www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

ఆదివారం | 26-1-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 298 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 8.55 తదుపరి త్రయోదశి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ. 8.26 తదుపరి మూల; వర్జ్యం: సా.4.38-6.16; దుర్ముహూర్తం: సా.4.33-5.18; అమృతఘడియలు: రా.2.28-4.06; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.03 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టాటా ఏఐఏ లైఫ్ శుభ్ ముహూరత్

తల్లిదండ్రులు పిల్లల పెళ్లి ఖర్చుల కోసం ఆదా చేసిందుకు వీలుగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 'శుభ్ ముహూరత్' పేరుతో సరికొత్త జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఫంక్షన్ హాల్ బుకింగ్ నుంచి అతిథ్య సదుపాయాలు, సంగీత్ వంటి కార్యక్రమాల నిర్వహణ, ఆహారం, పానీయాలు, పెళ్లి బట్టలు, ఆభరణాల కోసం చెల్లింపుల కోసం ఈ పాలసీ వీలు కల్పిస్తుంది. అంతేకాదు, క్యాపిటల్ గ్యారంటీ, మార్కెట్ అనుసంధానిత పెట్టుబడుల వృద్ధి, దురదృష్టవశాత్తు పేరెంట్ చనిపోయిన పక్షంలో జీవిత బీమా కవరేజీ వంటి ఫీచర్లను సైతం కలిగి ఉంది. ఏడాది నుంచి 20 ఏళ్ల వయసున్న పిల్లలు కలిగిన 31-51 ఏళ్ల తల్లిదండ్రుల కోసమే ఈ పథకం.

శ్రీరామ్ లైఫ్ సునిశ్చిత్ లాభ్

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. 'శ్రీరామ్ లైఫ్ సునిశ్చిత్ లాభ్' పేరుతో నాన్ పార్టిసిపేటింగ్ ఇండివిడ్యువల్ సేవింగ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. నెల రోజుల పసిపాప నుంచి 60 ఏళ్ల వయసున్న వ్యక్తులు ఈ పథకానికి అర్హులు. కనీస వార్షిక పెట్టుబడి రూ.30,000. ఫ్లెక్సిబుల్, ట్యాక్స్ ఫ్రీ మెచ్యూరిటీ ఇన్‌కమ్ చెల్లింపుల ఫీచర్లతో కూడిన ఈ పథకం.. వార్షిక ప్రీమియంపై 160 రెట్ల వరకు డెత్ బెనిఫిట్ కూడా ఆఫర్ చేస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	490
వరంగల్	462	గోదావరి	485
చిత్తూరు	523	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

రిస్క్ లేకుండా అధిక వడ్డీ ఆశిస్తున్నారా? ప్రస్తుత మార్కెట్లో అసలు అలాంటి అవకాశం ఉందా? ఉంటే ఏంటా అవకాశం? ఎవరు అందిస్తున్నారు ఆ అవకాశం? అయితే ఈ వివరాలు మీకోసమే..

ప్రత్యేక ఎఫ్‌డీ.. అధిక వడ్డీ

కస్టమర్లకు బ్యాంకుల ఆఫర్లు .. వడ్డీ రేటు, కాలపరిమితులూ రెండూ స్పెషలే..

దేశీయంగా బ్యాంకులు కూడా ప్రస్తుతం నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. చదవడానికి వింతగా ఉన్నా ఇది ముమ్మాటికీ నిజం. గత వారం ఒక దశలో మన దేశ బ్యాంకింగ్ రంగంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల నిధుల కొరత ఏర్పడింది. రుణాల వృద్ధికి తగ్గట్టు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) పెరగకపోవడం ఇందుకు ప్రధాన కారణం. గత ఏడాది బ్యాంకింగ్ రంగం రుణాల గిరాకీ 11.1 శాతం పెరిగితే.. ఎఫ్‌డీల వృద్ధి రేటు 9.8 శాతం మాత్రమే. డిపాజిట్ల సమీకరణ కోసం బ్యాంకులు ఎంత ప్రయత్నించినా పెద్దగా ఉపయోగం లేకుండాపోయింది. చాలా మంది మదుపరులు ముఖ్యంగా మిలీనియల్స్ తమ పొదుపు మొత్తాలను ఎఫ్‌డీలకు బదులు.. నష్టభయం (రిస్క్) ఉన్నప్పటికీ స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్ పథకాలకు మళ్లించడమే ఇందుకు ప్రధాన కారణం.



పోటా పోటీగా పథకాలు

రిస్క్ ఫ్రీ మదుపరులను, సీనియర్ సిటిజన్లను ఆకర్షించేందుకు భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఇండియన్ బ్యాంక్.. గత ఏడాది జూలై నుంచి 'స్పెషల్ టెన్యూర్ ఎఫ్‌డీ (ప్రత్యేక కాలపరిమితితో కూడిన ఫిక్స్‌డ్ డిపాజిట్స్)' పేరుతో స్వల్పకాలిక ఎఫ్‌డీ పథకాలు ప్రారంభించాయి. ఈ పథకాల సబ్‌స్క్రిప్షన్ గడువు ఈ ఏడాది మార్చి నెలాఖరుతో ముగియబోతోంది. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ స్వల్పకాలిక ఎఫ్‌డీలపై వడ్డీ రేటు ఎక్కువ. ఏ మాత్రం నష్టభయం లేకుండా అధిక వడ్డీ కోసం చూసే మదుపరులకు ఈ డిపాజిట్ పథకాలు అత్యంత అనువైనవి.

ఎవరికి మేలు?

స్వల్పకాలంలో నష్టభయం లేకుండా హామీతో కూడిన రాబడులు ఆశించే సంప్రదాయ మదుపరులకు, సీనియర్ సిటిజన్లకు 7 శాతానికిపైగా వడ్డీ రేటు ఆఫర్ చేసే ఈ స్పెషల్ టెన్యూర్ ఎఫ్‌డీలు అత్యంత అనుకూలం. స్వల్పకాలిక పెట్టుబడుల వివిధీకరణ కోసం చూసే వ్యక్తిగత మదుపరులు కూడా ఈ ప్రత్యేక డిపాజిట్లపై ఒక కన్నేయవచ్చు.

బీఓబీ ఉత్సవ్ డిపాజిట్ స్కీమ్

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) 400 రోజుల కాలపరిమితితో 'బీఓబీ ఉత్సవ్ డిపాజిట్ స్కీమ్' పేరుతో ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని తీసుకువచ్చింది. బీఓబీ ఈ స్కీమ్‌పై 7.3 శాతం వార్షిక వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. సీనియర్ సిటిజన్లకు మరో అర శాతం వడ్డీ (7.8 శాతం) అధికంగా అందిస్తోంది.

ఎస్‌బీఐ అమృత్ కలశ్, అమృత్ వృష్టి

ఎస్‌బీఐ 400 రోజుల కాలపరిమితితో అమృత్ కలశ్, 444 కాలపరిమితితో అమృత్ వృష్టి పథకాలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో అమృత్ కలశ్ స్పెషల్ టెన్యూర్ ఎఫ్‌డీపై 7.10 శాతం, అమృత్ వృష్టి స్పెషల్ టెన్యూర్ ఎఫ్‌డీపై 7.25 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. ఈ రెండు ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అర శాతం వడ్డీని అందిస్తోంది.

ఇండియన్ బ్యాంక్ ఇండ్ సుప్రీం

ఇండియన్ బ్యాంక్ 300 రోజుల కాలపరిమితో ఇండ్ సుప్రీం పేరుతో ఈ ప్రత్యేక డిపాజిట్ పథకాలను ప్రారంభించింది. ఈ ఎఫ్‌డీలపై 7.3 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. ఈ పథకంపైనా సీనియర్ సిటిజన్లకు మరో అర శాతం వడ్డీ అదనంగా లభిస్తుంది.

జాగ్రత్తలు తప్పవు..

ఈ స్పెషల్ టెన్యూర్ ఎఫ్‌డీలు అందరికీ అనుకూలమని చెప్పలేం. కాబట్టి మదుపు చేసే ముందే డిపాజిట్ కాల పరిమితి, వడ్డీ రేటుతో పాటు కనీస డిపాజిట్ ఎంత? ఏదైనా అవసరం వచ్చి ఎఫ్‌డీని ముందే వెనక్కి తీసుకునేందుకు అవకాశం ఉందా? ఉంటే అందుకు ఎంత పెనాల్టీ చెల్లించాలి? వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను పోటు, రాబడులపై ద్రవ్యోల్బణం ప్రభావం వంటి అన్ని విషయాలను ముందే తెలుసుకోవాలి. లేకపోతే నగదు లభ్యత (లిక్విడిటీ) దెబ్బతింటుంది.

త్వరపడితే బెటర్

అమెరికా, జపాన్, యూకే, ఈయూతో సహా అనేక దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిస్తున్నాయి. మన భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా త్వరలోనే ఇందుకు సిద్ధమవుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నష్టభయం లేకుండా హామీతో కూడిన అధిక రాబడులు ఆశించే మదుపరులు, సీనియర్ సిటిజన్లు మార్చిలోగా ఈ ఎఫ్‌డీలను ఎంచుకోవడం మంచిది. స్టాక్ మార్కెట్ కూడా ప్రస్తుతం తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. ఈ మార్కెట్లోని మదుపరులు కూడా తమ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని ఈ ఎఫ్‌డీలకు మళ్లించడం మంచిది. కాకపోతే వీరు వీలైనంత తక్కువ కాలపరిమితి ఉండే స్పెషల్ టెన్యూర్ ఎఫ్‌డీలను లేదా మ్యూచువల్ ఫండ్స్ అందించే లిక్విడ్ ఫండ్స్‌ను ఎంచుకోవడం మేలు.

జీఎస్‌టీలో కొత్తగా వచ్చిన మార్పులేమిటంటే ?

ఇదీ GST

జీఎస్‌టీ చట్టంలో ఇటీవల కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ వివరాలు మీ కోసం..

సెకండ్ హ్యాండ్ కార్లు: మొదటిది, సెకండ్ హ్యాండ్ కార్లకు సంబంధించింది. సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ పరిధి రోజురోజుకూ విస్తరిస్తోంది. పెద్ద కార్ల కంపెనీలు సైతం సెకండ్ హ్యాండ్ కార్ల కోసం విడిగా షోరూమ్‌లను తెరుస్తున్నాయి. కొత్త కార్ల మాదిరిగానే ఈ కార్లకు కూడా ఫ్రీ సర్వీసింగ్ వారంటీ ఇస్తున్నాయి. ఈ సెకండ్ హ్యాండ్ కార్లు అమ్మే వారు జీఎస్‌టీని అమ్మకపు విలువ మీద కాకుండా మార్జిన్ మీద చెల్లించాలి. మార్జిన్ అంటే అమ్మిన ధరకు, కొన్న ధరకు మధ్య ఉన్న వ్యత్యాసం. ఒకవేళ ఆదాయ పన్ను (ఐటీ) చట్టం ప్రకారం కారుకు 'తరుగుదల' నమోదు చేస్తే, తరుగుదల పోయిన తర్వాత మిగిలిన నికర విలువను కొన్న ధరగా భావిస్తూ.. మార్జిన్ లెక్కించాలి. ఈ సెకండ్ హ్యాండ్ కార్లకు సంబంధించి పన్ను రేటు.. కారు కెపాసిటీ, పొడవు, కారు టైప్‌ను బట్టి 12 శాతం నుంచి 18 శాతం ఉండగా, కొత్తగా వచ్చిన మార్పు ప్రకారం అన్ని రకాల కార్లకు జీఎస్‌టీ 18 శాతంగా నిర్ణయించటం జరిగింది. ఈ మార్పు జనవరి 16 నుంచి అమల్లోకి వచ్చింది.

రెస్టారెంట్లు: అలాగే రెస్టారెంట్లకు సంబంధించి 'స్పెసిఫైడ్ ప్రెమిసెస్' అనే నిర్వచనం మార్చటం జరిగింది. ఒక హోటల్‌లో ఉన్న రెస్టారెంట్ సర్వీస్ మీద ఎంత జీఎస్‌టీ చెల్లించాలి అనేది, ఆ హోటల్ స్పెసిఫైడ్ ప్రెమిసెస్ కిందకు వస్తుందా లేదా అనే విషయం మీద ఆధారపడి ఉంటుంది. స్పెసిఫైడ్ ప్రెమిసెస్ అయితే 18 శాతం, లేకుంటే 5 శాతం చెల్లించాలి. ఈ స్పెసిఫైడ్ ప్రెమిసెస్ అనేది ఇంతకు ముందు ఉన్న నిర్వచనం ప్రకారం హోటల్ రూమ్‌కు సంబంధించి 'డిక్లేర్డ్ టారిఫ్' బట్టి ఉండగా.. ఇప్పుడు మారిన నిర్వచనం ప్రకారం గడిచిన ఆర్థిక సంవత్సరం వసూలు చేసిన 'వాస్తవ రూమ్ ధర'ను బట్టి ఉంటుంది. అలాగే, స్పెసిఫైడ్ ప్రెమిసెస్ కిందకు రాకున్నా 18 శాతం జీఎస్‌టీ చెల్లిస్తూ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునే సదుపాయం ఇప్పుడు కల్పించటం జరిగింది. ఈ మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

రివర్స్ చార్జ్ మెకానిజం: ఇంకా, రివర్స్ చార్జ్ మెకానిజమ్‌కు సంబంధించి కొన్ని మార్పులు చేయటం జరిగింది. వాణిజ్య భవనాలను జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేని వ్యక్తి అద్దెకు ఇస్తే.. అద్దెకు తీసుకున్న వ్యక్తికి లేదా సంస్థకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉన్నట్లయితే ఆ అద్దెకు సంబంధించిన జీఎస్‌టీ, రివర్స్ చార్జ్ మెకానిజం కింద కిరాయిదారుడే చెల్లించాలి. ఈ నిబంధన గత అక్టోబరులోనే అమల్లోకి వచ్చింది. అయితే ఇప్పుడు దీనికి సవరణ చేయటం జరిగింది. కిరాయిదారుడు రిజిస్ట్రేషన్ పొంది ఉన్నా కాంపోజిషన్ స్కీమ్ కింద నమోదై ఉంటే.. రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించదు. అలాగే స్పాన్సర్‌షిప్ సర్వీస్ కూడా రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చేది. ఇప్పుడు కొత్తగా చేసిన మార్పు ప్రకారం సర్వీస్ అందించే సంస్థ బాడీ కార్పొరేట్ కింద గుర్తింపు పొందినట్లయితే రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించదు. ఈ మార్పులు కూడా జనవరి 16 నుంచి అమల్లోకి వచ్చాయి.


రాంబాబు గొండాల

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

అరుంధతీ భట్టాచార్య, పవన్ గోయెంకాకు పద్మశ్రీ

వాణిజ్య, పారిశ్రామిక రంగం నుంచి 10 మందికి పద్మ పురస్కారాలు

న్యూఢిల్లీ: ఈ ఏడాదికి గాను కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రకటించింది. వాణిజ్య, పారిశ్రామిక రంగం నుంచి మొత్తం 10 మందికి ఈ పురస్కారాలు వరించాయి. జపాన్ వాహన సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దివంగత ఒసాము సుజుకీకి పద్మ విభూషణ్ దక్కగా.. తమిళనాడుకు చెందిన నల్లి సిల్క్స్ వ్యవస్థాపకులు నల్లి కుప్పుస్వామి చెట్టి, గుజరాత్‌కు చెందిన జైడస్ లైఫ్ సైన్సెస్ చైర్మన్ పంకజ్ పటేల్‌కు పద్మ భూషణ్ లభించింది. కాగా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ మాజీ చైర్‌పర్సన్, సేల్స్‌ఫోర్స్ ఇండియా ప్రస్తుత చైర్‌పర్సన్, సీఈఓ అరుంధతీ భట్టాచార్యకు పద్మశ్రీ దక్కింది. దేశీయ వాహన సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా మాజీ ఎండీ, భారత స్పేస్ ప్రోగ్రామ్ ఇన్‌స్పేస్ ప్రస్తుత చైర్మన్ పవన్ గోయెంకా, ఎవాన్ సైకిల్స్ ఎండీ ఓంకార్ సింగ్ పాహ్వా, యాక్సెల్ పార్ట్‌నర్ వ్యవస్థాపక భాగస్వామి ప్రశాంత్ ప్రకాశ్, హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ చైర్మన్ ఆర్‌జీ చంద్రమోగన్, సెంచురీ ప్లైబోర్డ్స్ సజ్జన్ భజంకకు సైతం పద్మశ్రీ లభించింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	136
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	112
కర్నూలు	120	నెల్లూరు	117
విశాఖపట్నం	127	అనంతపురం	117
గోదావరి	136		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,430 ▲	75,560 ▲	1,05,000 ▲
విజయవాడ	83,000 ▲	78,000 ▼	93,000 ▼
విశాఖపట్నం	80,370 ▼	73,670 ▼	91,870 ▼
రాజమండ్రి	82,420 ▲	75,550 ▲	94,000 ▲
ప్రొద్దుటూరు	82,000 ▲	75,930 ▲	93,000 ▼
ముంబై	80,348 ▲	73,599 ▲	91,211 ▲

స్పోర్ట్స్



గోల్స్‌కు అడ్డుగోడ

గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం నెగ్గింది. తద్వారా వరుసగా రెండు విశ్వక్రీడల్లో కంచు మోత మోగించడం ద్వారా చరిత్ర సృష్టించింది. ఈ విజయంలో కేరళకు చెందిన గోల్‌కీపర్ శ్రీజేష్ అత్యంత కీలక భూమిక పోషించాడు. 18 ఏళ్ల కెరీర్‌లో 336 మ్యాచ్‌ల్లో శ్రీజేష్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత హాకీకి రిటైర్మెంట్ ప్రకటించిన 36 ఏళ్ల శ్రీజేష్ జూనియర్ జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు.

శ్రీజేష్.. పద్మభూషణుడు

హాకీ మాజీ స్టార్‌కు మూడో అత్యున్నత పౌర పురస్కారం


అశ్విన్, విజయన్, హర్వీందర్‌కు పద్మశ్రీ

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రం శనివారం ప్రకటించిన పద్మ అవార్డులకు ఈసారి క్రీడా రంగం నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. వీరిలో భారత జట్టు మాజీ కెప్టెన్, దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌ను దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మభూషణ్ వరించింది. అలాగే ఇటీవల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు పద్మశ్రీ లభించింది. ఇక..ఫుట్‌బాల్ లెజెండ్ ఐఎం విజయన్‌కూ పద్మశ్రీ ప్రకటించారు. పారా ఆర్చర్ హర్వీందర్ సింగ్, పారా అథ్లెటిక్ కోచ్ సత్యపాల్ సింగ్‌కు కూడా పద్మశ్రీ అవార్డులు లభించాయి.

స్పిన్ మాంత్రికుడు: దశాబ్దానికిపైగా భారత జట్టు స్పిన్ విభాగానికి మూలస్తంభంగా నిలిచిన అశ్విన్..ఇటీవలి బోర్డర్-గవాస్కర్ సిరీస్ సందర్భంగా ఆటకు వీడ్కోలు పలికాడు. 106 టెస్టులు ఆడిన 38 ఏళ్ల అశ్విన్ 537 వికెట్లతో సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు.


అశ్విన్

ఫుట్‌బాల్‌కు పర్యాయం: దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీ అందుకోనున్న 55 సంవత్సరాల ఐఎం విజయన్ భారత గొప్ప ఫుట్‌బాల్ ఆటగాళ్లలో ఒకడు. కేరళకు చెందిన ఈ మాజీ ఫార్వర్డ్ 2000 నుంచి 2004 వరకు భారత ఫుట్‌బాల్ జట్టు సారథిగా కూడా బాధ్యతలు నిర్వర్తించాడు. విజయన్ 72 మ్యాచ్‌ల్లో 29 అంతర్జాతీయ గోల్స్ చేశాడు.


విజయన్

పారా ఆర్చరీలో చాంపియన్: హరియాణాకు చెందిన 33 ఏళ్ల హర్వీందర్ సింగ్ పారా ఆర్చర్. టోక్యో పారాలింపిక్స్‌లో రికర్వ్ ఓపెన్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలుచుకున్న ఈ స్టార్.. నిరుడు జరిగిన పారిస్ క్రీడల్లో పసిడి పతకం కొల్లగొట్టి చరిత్ర సృష్టించాడు.

ఇక.. పారిస్ పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత, ఖేల్‌రత్న అవార్డీ హైజంపర్ ప్రవీణ్ కుమార్‌ను తీర్చిదిద్దడంలో సత్యపాల్ సింగ్ కీలకపాత్ర పోషించాడు.


హర్వీందర్


సత్యపాల్

టీ20 ఉత్తమ క్రికెటర్‌గా అర్ష్‌దీప్

ఐసీసీ టీ20 జట్టు కెప్టెన్‌గా రోహిత్


అర్ష్‌దీప్

దుబాయ్: ఐసీసీ టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఎంపికయ్యాడు. 2024 ఏడాదికిగాను ఐసీసీ ఈ అవార్డులను ప్రకటించింది. ఇందుకోసం సికిందర్ రజా, బాబర్ ఆజమ్, ట్రావిస్ హెడ్ కూడా పోటీపడ్డారు. గతేడాది అర్ష్‌దీప్ ఆడిన 18 మ్యాచ్‌ల్లో 36 వికెట్లు తీశాడు. ఐసీసీ పురుషుల టీ20 జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఎంపికయ్యాడు. తన సారథ్యంలో గతేడాది భారత జట్టు టీ20 వరల్డ్‌కప్ గెలిచిన విషయం తెలిసిందే. అలాగే ఈ జట్టులో భారత్ నుంచి పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్, హార్దిక్ కూడా చోటు దక్కించుకున్నారు.

మహిళల టీ20 జట్టులో మంధాన, రిచా, దీప్తి: 2024 ఐసీసీ మహిళల టీ20 జట్టులో భారత్ నుంచి స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, కీపర్ రిచా ఘోష్, ఆల్‌రౌండర్ దీప్తి శర్మలకు చోటు దక్కడం విశేషం. ఈ జట్టుకు దక్షిణాఫ్రికా సారథి లారా వోల్వార్డ్‌ను కెప్టెన్‌గా నియమించారు.

గెలుపు దిశగా హైదరాబాద్

హైదరాబాద్: హిమాచల్‌ప్రదేశ్‌తో గ్రూప్-బి రంజీ పోరులో హైదరాబాద్ విజయం దిశగా దూసుకుపోతోంది. హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్ 565 భారీ స్కోరుకు జవాబుగా..ఓవర్‌నైట్ స్కోరు 33/1తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హిమాచల్ 275 పరుగులకు ఆలౌటైంది. అనికేత్ ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఫాలోఆన్‌లో..మూడోరోజు ఆఖరికి హిమాచల్ రెండో ఇన్నింగ్స్‌లో 21/0 స్కోరు చేసింది.

తిలక్ షో

ఆఖరి ఓవర్‌లో భారత్ విజయం

ఇంగ్లండ్‌తో రెండో టీ20


తిలక్ వర్మ (55 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 72 నాటౌట్)

చెన్నై: ఓ మాదిరి ఛేదనే అనుకున్నా.. ఓ ఎండ్‌లో టపటపా వికెట్లు పడుతున్న వేళ.. తెలుగు తేజం తిలక్ వర్మ (55 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 72 నాటౌట్) మొండి పట్టుదలను ప్రదర్శించాడు. ఇంగ్లండ్ బౌలర్లను చెండాడుతూ ఒంటిచేత్తో భారత జట్టుకు అద్భుత విజయాన్నందించాడు. ఓ దశలో గెలుపు కష్టమేననిపించినా, ఒత్తిడికి లోనుకాని అతడి ఆటతీరుతో ఆఖరి ఓవర్‌లో భారత్ ఊపిరిపీల్చుకుంది. ఫలితంగా శనివారం ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో టీమిండియా 2 వికెట్ల తేడాతో నెగ్గింది. అటు గెలుపు దరిదాపుల్లోకి వచ్చిన పర్యాటక జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 165 పరుగులు చేసింది. బట్లర్ (45), కార్స్ (31), జేమీ స్మిత్ (22) రాణించారు. అక్షర్, వరుణ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 19.2 ఓవర్లలో 8 వికెట్లకు 166 రన్స్ చేసి గెలిచింది. సుందర్ (26) సహకరించాడు. కార్స్‌కు 3 వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా తిలక్ నిలిచాడు. మూడో టీ20 మంగళవారం రాజ్‌కోట్‌లో జరుగుతుంది.

ఒక్కడై నిలిచి..: ఓ మాదిరి ఛేదనలో భారత్ ఇన్నింగ్స్ ధాటిగానే ఆరంభమైనా మధ్య ఓవర్లలో కాస్త తడబాటుకు గురైంది. అయితే తిలక్ వర్మ డాషింగ్ ఆటతీరుతో ఆఖర్లో జట్టు గట్టెక్కింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ అభిషేక్ (12) మూడు ఫోర్లతో చెలరేగాడు. కానీ రెండు, మూడో ఓవర్లలోనే అభిషేక్, శాంసన్ (5) వెనుదిరిగారు. కెప్టెన్ సూర్యకుమార్ (12) ఈ మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు. అయితే తిలక్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. ఆరంభం నుంచే జోరును ప్రదర్శిస్తూ ఇంగ్లండ్ బౌలర్లను చెడుగుడు ఆడేశాడు. ఐదో ఓవర్‌లో 4,6,6తో బ్యాట్‌కు పనిచెప్పిన తను చివరి ఓవర్ వరకు అండగా నిలిచాడు. పవర్‌ప్లే తర్వాత వికెట్లు వేగంగా పడడంతో కాస్త నెమ్మదించాడు. అటు సుందర్ 13వ ఓవర్‌లో 6,4,6 బాదడంతో స్కోరు గాడిన పడింది. కానీ వరుస ఓవర్లలో సుందర్, అక్షర్ (2) వెనుదిరగడంతో ఇంగ్లండ్ గెలిచేలా కనిపించింది. అప్పటికి భారత్ చేతిలో 3 వికెట్లే ఉండగా, చివరి 5 ఓవర్లలో 40 రన్స్ కావాలి. ఈ దశలో తిలక్ 16వ ఓవర్‌లో 6,6,4తో 19 రన్స్ రాబట్టడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గు చూపింది. దీనికి తోడు 12 బంతుల్లో 13 రన్స్ కావాల్సిన వేళ రవి బిష్ణోయ్ (9 నాటౌట్) ఫోర్‌తో ఉత్కంఠ తగ్గింది. ఇక ఆఖరి ఓవర్‌లో 6 పరుగులను తిలక్ 2,4తో మరో నాలుగు బంతులుండగానే ముగించి సంబరాలు చేసుకున్నాడు.

బట్లర్ మరోసారి..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ బట్లర్ మరోసారి కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అయితే 14 ఓవర్లు స్పిన్నర్లే వేయగా, వీరి ధాటికి మిగతా బ్యాటర్లు క్రీజులో కుదురుకోలేకపోయారు. చివర్లో అరంగేట్ర జేమీ స్మిత్, కార్స్ మాత్రం వేగంగా ఆడారు. పేసర్ అర్ష్‌దీప్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ సాల్ట్ (4) వికెట్ తీయగా, డకెట్ (3)ను సుందర్ అవుట్ చేశాడు. అయితే బట్లర్ ఎదురుదాడితో ఆరంభంలో రన్‌రేట్ మాత్రం తగ్గలేదు. పవర్‌ప్లేలో జట్టు 58/2 స్కోరుతో నిలిచింది. మిడిలార్డర్‌లో బ్రూక్ (13), లివింగ్‌స్టోన్ (13) త్వరగానే అవుటయ్యారు. అర్ధసెంచరీ ఖాయమనుకున్న బట్లర్‌ను పదో ఓవర్‌లో అక్షర్ అవుట్ చేశాడు. స్మిత్ రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నా వేగంగా ఆడే క్రమంలో వికెట్ చేజార్చుకున్నాడు. ఇక కార్స్ వచ్చీరాగానే బౌండరీలతో జోరు చూపాడు. 14వ ఓవర్‌లో 6,4 సాధించిన కార్స్ 16వ ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లతో అదరగొట్టాడు. అయితే ఆర్చర్ (12 నాటౌట్)తో సమన్వయలోపం కారణంగా కార్స్ రనౌటవడంతో జట్టు భారీస్కోరుపై దెబ్బపడింది. దీంతో రషీద్ (10)తో తొమ్మిదో వికెట్‌కు 20 రన్స్ జోడించిన ఆర్చర్ స్కోరును 160 దాటించగలిగాడు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) సుందర్ (బి) అర్ష్‌దీప్ 4; డకెట్ (సి) జురెల్ (బి) సుందర్ 3; బట్లర్ (సి) తిలక్ (బి) అక్షర్ 45; బ్రూక్ (బి) వరుణ్ 13; లివింగ్‌స్టోన్ (సి సబ్) హర్షిత్ (బి) అక్షర్ 13; స్మిత్ (సి) తిలక్ (బి) అభిషేక్ 22; ఓవర్టన్ (బి) వరుణ్ 5; కార్స్ (రనౌట్) 31; ఆర్చర్ (నాటౌట్) 12; రషీద్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 10; ఉడ్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 165/9. వికెట్ల పతనం:** 1-6, 2-26, 3-59, 4-77, 5-90, 6-104, 7-136, 8-137, 9-157. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-40-1; పాండ్యా 2-0-6-1; సుందర్ 1-0-9-1; అక్షర్ 4-0-32-2; బిష్ణోయ్ 4-0-27-0; వరుణ్ 4-0-38-2; అభిషేక్ 1-0-12-1.

భారత్: శాంసన్ (సి) కార్స్ (బి) ఆర్చర్ 4; అభిషేక్ (ఎల్బీ) ఉడ్ 12; తిలక్ (నాటౌట్) 72; సూర్యకుమార్ (బి) కార్స్ 12; జురెల్ (సి సబ్) రెహాన్ (బి) కార్స్ 4; హార్దిక్ (సి) సాల్ట్ (బి) ఓవర్టన్ 7; సుందర్ (బి) కార్స్ 26; అక్షర్ (సి) డకెట్ (బి) లివింగ్‌స్టోన్ 2; అర్ష్‌దీప్ (సి) ఆర్చర్ (బి) రషీద్ 6; బిష్ణోయ్ (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 19.2 ఓవర్లలో 166/8. వికెట్ల పతనం:** 1-15, 2-19, 3-58, 4-66, 5-78, 6-116, 7-126, 8-146. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-60-1; ఉడ్ 3-0-28-1; కార్స్ 4-0-29-3; రషీద్ 4-0-14-1; ఓవర్టన్ 2.2-0-20-1; లివింగ్‌స్టోన్ 2-0-14-1.

సిరీస్ నుంచి నితీశ్ అవుట్

రెండు మ్యాచ్‌లకు రింకూ దూరం

జట్టులో దూబే, రమణ్‌దీప్

చెన్నై: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌కు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ దూరమయ్యాడు. శుక్రవారం ప్రాక్టీస్ సెషన్‌లో అతడు పక్కటెముకల గాయానికి గురయ్యాడు. దీంతో సిరీస్‌లో మిగిలిన నాలుగు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని బీసీసీఐ ప్రకటించింది. అలాగే తొలి టీ20 మ్యాచ్ ఫీల్డింగ్ సమయంలో రింకూ సింగ్ వెన్నునొప్పికి గురయ్యాడు. ఈ కారణంగా రింకూ రెండు, మూడో మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. దీంతో నితీశ్ స్థానంలో శివమ్ దూబే, రింకూ స్థానంలో రమణ్‌దీప్ జట్టులో చేరనున్నారు.

క్వీన్..కీస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత మాడిసన్

ఫైనల్లో సబలెంకాకు షాక్



విజేతకు: రూ. 30.16 కోట్లు
రన్నరప్‌కు: 16.37 కోట్లు

నేడు పురుషుల ఫైనల్
సిన్నర్ X జ్వెరేవ్
మ.2 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

మెల్‌బోర్న్: మూడు పదుల వయస్సు సమీపిస్తున్నా కెరీర్‌లో ఒక్క గ్రాండ్‌స్లామూ లేదన్న అసంతృప్తిని అమెరికా క్రీడాకారిణి మాడిసన్ కీస్ అధిగమించింది. 2017 యూఎస్ ఓపెన్‌లో చిక్కినట్టే చిక్కి చేజారిన గ్రాండ్‌స్లామ్‌ను ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో ఒడిసి పట్టింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 29 ఏళ్ల కీస్ 6-3, 2-6, 7-5తో డిఫెండింగ్ చాంపియన్, వరల్డ్ నెం.1 సబలెంకా (బెలారస్)కు షాకిచ్చి ట్రోఫీని ముద్దాడింది. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌తో మురిసింది. 2017లో కీస్ యూఎస్ ఓపెన్ ఫైనల్ ఆడింది. ఆ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ ద్వారా మరో గ్రాండ్‌స్లామ్ తుది పోరుకు చేరింది. ఓ క్రీడాకారిణి మొదటి, రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ మధ్య ఇంత సుదీర్ఘ సమయం ఉండడం ఓపెన్ ఎరాలో ఓ రికార్డు. అందుకే కాబోలు మ్యాచ్ అనంతరం మాడిసన్ తీవ్ర భావోద్వేగానికి లోనైంది. కన్నీరు ఉబికొస్తుండగా కోచ్, భర్త ఫ్రాటెంజెలోను గట్టిగా హత్తుకుంది. కాగా..అతి పెద్ద వయస్సులో మొదటి గ్రాండ్‌స్లామ్ గెలిచిన నాలుగో ప్లేయర్‌గా కీస్ నిలిచింది.

ముంబైకి కశ్మీర్ షాక్

ముంబై: రోహిత్, జైస్వాల్, రహానె, శ్రేయాస్, శార్దూల్ వంటి స్టార్లతో కూడిన అత్యంత పటిష్టంగా ఉన్న ముంబై జట్టుకు పసికూన జమ్మూ కశ్మీర్ షాకిచ్చింది. రంజీట్రోఫీ గ్రూప్-ఎ మ్యాచ్‌లో 5 వికెట్లతో ముంబైని ఓడించింది. 205 పరుగుల లక్ష్యంతో శనివారం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన కశ్మీర్ 207/5 స్కోరు చేసి విజయం దక్కించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 120, జమ్మూ 206 రన్స్ చేశాయి. ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 290 రన్స్ చేసింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

ఆదివారం | 26-1-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) :22 సంచిక (Issue) : 298 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

పథకాల బౌండరీ

నేటి నుంచే ఇందిరమ్మ ఇళ్లు, రైతు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరు

- కొడంగల్ నుంచి శ్రీకారం చుట్టనున్న రేవంత్
- నేడు నారాయణపేట జిల్లా చంద్రవంచకు సీఎం
- తొలుత మండలానికో గ్రామంలో పూర్తిస్థాయిలో
- 622 గ్రామాల్లో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు
- రైతు భరోసా, ఆత్మీయ భరోసా 606 గ్రామాల్లో..
- నేటి రాత్రి 12 గంటల తర్వాత ఖాతాల్లోకి డబ్బు
- వచ్చేనెల క్యాబినెట్.. ఇతర లబ్ధిదారుల ఖరారు
- మార్చి 31లోపు పథకాలు పూర్తిగా అమలు


పథకాలపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, తుమ్మలతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న నాలుగు కీలక పథకాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పథకాలను సర్కారు ప్రారంభించబోతోంది. రైతులకు పంట పెట్టుబడి అందించే రైతు భరోసా, భూమిలేని రైతు కూలీలకు ఆర్థిక సాయం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు ప్రారంభం కానున్నాయి. వీటి కోసం ప్రభుత్వం పలు రకాలుగా కసరత్తు చేసింది. విధి విధానాల రూపకల్పన మొదలుకొని.. దరఖాస్తుల స్వీకరణ, గ్రామసభల నిర్వహణ, లబ్ధిదారుల ఎంపిక వంటి ప్రక్రియలు చేపట్టింది. కానీ, లబ్ధిదారుల ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. పథకాలను మాత్రం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, నాలుగు పథకాలకు సంబంధించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం భట్టి, ముగ్గురు మంత్రులు సమావేశ నిర్ణయాలను సచివాలయంలో మీడియాకు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నాలుగు పథకాలను మొదటి దశగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారుల వివరాలు కొలిక్కి రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. నాలుగు పథకాలకు సంబంధించి ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు ప్రస్తుతం జిల్లా కలెక్టర్ల వద్ద ఉన్నాయి. దరఖాస్తుల ఖరారు ప్రక్రియ ఇంకా

మిగతా 13వ పేజీలో...

ఉస్మానియా కొత్త ఆస్పత్రికి 31న శంకుస్థాపన

13

- అధునాతన సౌకర్యాలతో గోషామహల్ స్టేడియంలో నిర్మాణం
- బాధ్యతలు ఆర్అండ్‌బీ శాఖకే?
- అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష
- రూ.2,150 కోట్ల వ్యయం అంచనా

మునిసిపాలిటీల్లో రేపట్నుంచే ప్రత్యేకాధికారుల పాలన

- పాలకవర్గాలకు నేడే ఆఖరి రోజు
- సీఎం వద్దకు చేరిన ఉత్తర్వుల ఫైల్
- ఏప్రిల్‌లోగా ఎన్నికలకు యోచన

దేశంలోనే అతిపెద్ద ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ

12

- శంకర్‌పల్లిలో ఏర్పాటుకు జెన్‌కో నిర్ణయం
- 250 మె.వా.తో బ్యాటరీ స్టోరేజీకి టెండర్లు
- గంటకు 2.5 లక్షల యూనిట్ల కరెంట్ ఉత్పత్తి



తెలుగు రాష్ట్రాలకు సప్త పద్మాలు

- విఖ్యాత వైద్యుడు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి విభూషణ్
- స్టార్ హీరో నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్!
- మాదిగ రిజర్వేషన్ ఉద్యమ నేత మందకృష్ణ, అవధాని మాడుగుల నాగఫణి శర్మలకు పద్మశ్రీ
- విద్యావేత్తలు కృష్ణ, వాదిరాజులకూ చోటు
- బుర్రకథ అప్పారావుకు మరణానంతర పురస్కారం
- దశదిశ కర్మరోజే పద్మశ్రీ వార్త విన్న కుటుంబం
- 7 పద్మ విభూషణ్, 19 భూషణ్, 113 పద్మశ్రీలు
- గణతంత్ర పౌర అవార్డులను ప్రకటించిన కేంద్రం
- వాసుదేవ నాయర్, ఎల్.సుబ్రహ్మణ్యం విభూషణ్‌లు
- శేఖర్ కపూర్, అజిత్, శోభనలకు పద్మ భూషణ్

న్యూఢిల్లీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత జీర్ణ కోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డిని ఈ ఏడాది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పద్మ విభూషణ్ వరించింది. తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన ప్రముఖ నటుడు, శాసన సభ్యుడు బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం లభించింది. తెలంగాణకు చెందిన మాదిగ రిజర్వేషన్ ఉద్యమకారుడు మందకృష్ణ మాదిగ, ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రముఖ అవధాన విద్వాంసుడు మాడుగుల నాగఫణి శర్మ, ప్రముఖ విద్యావేత్త, రచయిత కేఎల్ కృష్ణ, కళారంగానికి చెందిన మిరియాల అప్పారావు(మరణానంతరం), విద్యారంగానికి చెందిన వాదిరాజు రాఘవేంద్రాచార్య పంచముఖిలకు ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారాలు లభించాయి. ఈ ఏడాదికి ఏడుగురికి పద్మ విభూషణ్, 19 మందికి పద్మ భూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు లభించాయి. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్‌సింగ్ ఖెహర్, ఇటీవల

మిగతా 2వ పేజీలో...

జమిలికి జైకొడదాం

11

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గణతంత్ర దినోత్సవ సందేశం
- వేడుకలకు సిద్ధమైన కర్తవ్యపథ్
- ముఖ్యఅతిథిగా ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంతో

రాష్ట్రానికి 21 సేవా పతకాలు

12

- ఇద్దరు పోలీసు అధికారులకు రాష్ట్రపతి విశిష్టసేవా పతకాలు
- 12 మందికి ప్రతిభసేవా పతకాలు

పద్మాల్లో తెలంగాణకు అవమానం

2

- మోదీకి లేఖ రాయనున్న రేవంత్
- పురస్కారం గౌరవం: నాగేశ్వర్‌రెడ్డి
- మాదిగ జాతికి అంకితం: మందకృష్ణ

సాయిరెడ్డి సన్యాసం కథ!

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ..' అని ఒక కవిగారు ఎప్పుడో అన్నారు. వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి శనివారం నుంచి రాజకీయ సన్యాసం తీసుకుంటున్నానని ప్రకటించడం ఈ కోవలోకే వస్తుంది.

పలు అవినీతి కేసులలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ-1గా ఉండగా, విజయసాయిరెడ్డి ఏ-2గా ఉన్నారు. వీరిద్దరినీ విడదీసి చూడలేము. అవినీతి విషయంలో అవిభక్త కవలలుగా చేయకూడని పనులన్నీ చేశారు. అలాంటి విజయసాయి రెడ్డి హఠాత్తుగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారా? అన్న అనుమానం సహజంగానే కలుగుతుంది. నిజానికి ఇది హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు. ఏడు మాసాల క్రితం జరిగిన ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయిన నాటి నుంచి ఆయన వైఖరిలో మార్పు వచ్చింది.


కొత్త పలుకు

తెలుగుదేశం పార్టీ తనను దగ్గరకు రానివ్వదు కనుక భారతీయ జనతా పార్టీలో చేరిపోవాలని కొన్ని రోజుల క్రితం ఆయన భావించారు. తనతో పాటు ఏడెనిమిది మంది రాజ్యసభ సభ్యులను తీసుకువస్తానని, పార్టీలో చేర్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలసి అర్జీ పెట్టుకున్నారు. అయితే ఈ విషయమై మరో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలసి మాట్లాడుకోవలసిందిగా అమిత్ షా ఆయనకు సూచించారు. దీంతో పీయూష్‌ను కలసిన విజయసాయి.. తనను బీజేపీలో చేర్చుకోవాలని కోరారు.

అయితే కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఏర్పడటానికి కారణం అయిన తెలుగుదేశం పార్టీ ఆమోదం లేకుండా పార్టీలో చేర్చుకోలేమని పీయూష్ గోయల్.. విజయసాయికి తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నుంచి నిరభ్యంతర పత్రం పొందడం కోసం విజయసాయి చేయని ప్రయత్నం లేదు. పార్టీ ముఖ్యులను కలసి తన మనసులోని మాటను చెప్పుకొన్నారు. జగన్ రెడ్డిపై పెండింగ్‌లో ఉన్న అవినీతి కేసులలో అప్రూవర్‌గా మారితే భారతీయ జనతా పార్టీలో చేరడానికి తాము క్లియరెన్స్ ఇస్తామని తెలుగుదేశం ముఖ్యులు ఆయనకు స్పష్టంచేశారు. దీంతో ఆయన డైలమాలో పడ్డారు. ఒక దశలో ఆయన అప్రూవర్‌గా మారడానికి కూడా సిద్ధపడ్డారు. అయితే గొడ్డలి గుర్తుకు వచ్చి పీడకల రావడంతో మరుసటి రోజుకే ఆయన తన మనసు మార్చుకున్నారట.

4

నా విషయంలో తన సవాలుకు కట్టుబడకుండానే విజయసాయి రెడ్డి అస్త్రసన్యాసం చేయడం నాకు అస్సలు నచ్చలేదు. కొంత కాలం క్రితం నాపై అవాకులూ చెవాకులూ పేలి వాంతులు చేసుకున్న విజయసాయి రెడ్డి బహిరంగ చర్చకు రావాలని నన్ను సవాలు చేశారు. నువ్వు అంతగా ముచ్చటపడితే ఎందుకు కాదంటానులే అని అందుకు సరే అన్నాను. అయినా అటువైపు నుంచి సౌండు లేదు. ఇప్పుడేమో రాజకీయ సన్యాసం అని అంటున్నారు. ఇప్పటికైనా తాను నోరు పారేసుకున్నందుకు ఆయన క్షమాపణలు చెబుతారేమో చూద్దాం. అయినా విజయసాయి రెడ్డి వంటి వారి నుంచి విలువలను ఆశించడం అత్యాశే అవుతుంది.

విజయసాయి రెడ్డి వంటి వాళ్లు కూడా అప్రూవర్ గా మారే ఆలోచన చేశారంటే రాజకీయాలలో ఎవరినీ పూర్తిగా నమ్మకూడదని మరోసారి రుజువైంది. బహుశా ఈ కారణంగానే కాబోలు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎవరినీ పూర్తిగా నమ్మరు.

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాప్!

- బీజేపీలో కీలకం, ఆర్ఎస్ఎస్‌తో సంబంధాల రీత్యానే
- గవర్నర్‌గా నియమితులైన తర్వాత కూడా ట్యాపింగ్
- ఆయన పీఏను పోలీసులు విచారించగా వెలుగులోకి

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తీవ్ర కలకలం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయం బయటపడింది. ప్రస్తుతం త్రిపుర గవర్నర్‌గా ఉన్న నల్లు ఇంద్రసేనారెడ్డి వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సారథ్యంలోని పోలీసులు 15 రోజులు ట్యాపింగ్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులు, న్యాయమూర్తులు, రాజకీయ నేతలు,



మిగతా 12వ పేజీలో...

విజయసాయి రాజీనామా

- ఆ వెంటనే ఆమోదించిన రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్
- ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లగానే వైసీపీకీ రాజీనామా చేస్తా..
- ఢిల్లీలో మీడియాకు తెలిపిన విజయసాయిరెడ్డి
- పదవుల ఆశలు, కేసుల మాఫీ హామీలు లేవని వ్యాఖ్య

12

ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్లివ్వం

- రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలి
- దావోస్‌లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం ఇవ్వాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- బీజేపీలో చేరిన కరీంనగర్ మేయర్ సునీల్‌రావు

నలుగురు హైకోర్టు అదనపు న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

- ప్రమాణం చేయించిన తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్
- మొదటి కోర్టు హాల్లో కార్యక్రమం
- హైకోర్టులో మొత్తం 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

12


ప్రమాణం చేస్తున్న జస్టిస్ వై రేణుక, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఈడ తిరుమలదేవి, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు



అన్‌స్టాపబుల్ బాలయ్య!

డైలాగ్ పలికితే థియేటర్ దబిడి దిబిడే

నటన అనేది ఓ ఉద్యోగంలా భావించకుండా ఓ కళగా ఆరాధించే నటుడు నందమూరి బాలకృష్ణ. అటు నటన, ఇటు రాజకీయాలు, మరో పక్క వైద్యరంగంలో సేవలు.. ఇలా ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పని చేస్తూ తెలుగు చిత్ర పరిశ్రమకు విశేషసేవలు అందిస్తున్న బాలకృష్ణ కృషికి గుర్తింపుగా ఇప్పుడు పద్మభూషణ్ పురస్కారం లభించడంతో అన్ని వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడెప్పుడో 1960ల్లో ఎన్టీఆర్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ నందమూరి వంశానికి పద్మ పురస్కారం లభించడం ఇదే. ఐదు దశాబ్దాల బాలకృష్ణ నట జీవితంలో భారీ విజయాలే కాదు.. కొన్ని పరాజయాలూ ఉన్నాయి. అపజయానికి ఆయన ఎప్పుడూ కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుక్కుంటూ రాజీ పడలేదు. డైలాగ్ చెప్పడంలో బాలకృష్ణది ఒక ప్రత్యేక ఒరవడి. కళ్ల వెంట నిప్పులు కురిపిస్తూ బేస్ వాయిస్‌లో ఆయన తెరపై డైలాగులు చెబుతుంటే థియేటర్లు దద్దరిల్లి పోతుంటాయి. తండ్రి ఎన్టీఆర్‌లా బాలకృష్ణకు కూడా తెలుగు భాష అంటే ఎంతో గౌరవం. సినిమాల్లో తెలుగుదనం ఉట్టిపడే పదాలతో డైలాగులు చెప్పే బాలయ్య నిజజీవితంలో కూడా తన ఆహార్యం, అలవాట్లతో ప్రత్యేకంగా కనిపిస్తారు. క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు బాలకృష్ణ. అలాగే ఆయనది ముక్కుసూటితత్త్వం. నాన్చుడు వ్యవహారం ఆయనకు నచ్చదు. మనసులో ఏముందో అది బయటకు చెప్పడం, నిజాన్ని నిర్భయంగా వెల్లడించడం అలవాటు. ఆరు పదుల వయసులో కూడా ఎంతో చలాకీగా ఉంటూ యువ హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు బాలకృష్ణ. 'అన్‌స్టాపబుల్' కార్యక్రమంతో దేశ వ్యాప్తంగా ఆయన క్రేజ్ సంపాదించుకున్నారు. రాజకీయ నాయకుడిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు. మూడు సార్లు హిందూపురం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు. బాలకృష్ణకు సీఎం చంద్రబాబు శనివారం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'తెలుగు సినీ దిగ్గజం, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు. లెజెండరీ ఎన్టీఆర్ వారసత్వాన్ని నిలబెడుతూ... మీరు సినిమా, రాజకీయాలు, దాతృత్వంలో మేటిగా నిలిచారు. ప్రజా సంక్షేమానికి మీ అంకితభావం... ప్రత్యేకించి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా లెక్కలేనన్ని జీవితాలకు స్వాంతనను చేకూర్చింది. లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చింది. మీ సేవలకు ఇది నిజమైన గుర్తింపు. దయాళువైన నేతకు తగిన గౌరవం' అని సీఎం చంద్రబాబు అన్నారు. 'పద్మభూషణ్ అందుకున్న మీ అందరి బాలయ్య, నా ముద్దుల మావయ్య బాలకృష్ణకు అభినందనలు' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

కోట్ల రూపాయలు ఇస్తామన్నా

విదేశాలకు వెళ్లని దేశ భక్తుడు

పద్మవిభూషణుడు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

» వైద్యరంగంలో చేసిన విశిష్ట సేవలకు ప్రభుత్వం గుర్తింపు


హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో అత్యంత సుప్రసిద్ధులైన వైద్యులలో ఆయన ఒకరు. ప్రపంచంలోనే గ్యాస్ట్రో ఎంటరాలజీకి సంబంధించిన అత్యున్నత డాక్టర్లలో ఒకరిగా పేరు పొందారు. ఏకంగా 1050కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించి గ్యాస్ట్రో ఎంటరాలజీలో ఆయన స్పృశించని అంశమంటూ లేదనే ఖ్యాతిని గడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆస్పత్రి వ్యవస్థాపక ఛైర్మన్, ఇప్పటికే భారతదేశంలో రెండు పౌర పురస్కారాలను అందుకున్న డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డిని దేశంలో రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ వరించింది. 2002లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ అవార్డులను అందుకున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి.. విజయవాడలో ఇంటర్, కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించారు. అనంతరం చెన్నైలో ఇంటర్నల్ మెడిసిన్, చండీగఢ్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. తొలుత నిమ్స్, గాంధీ ఆస్పత్రుల్లో సేవలందించారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు ఐఐఎస్‌సీ బెంగళూరు, ఐఐటీ కాన్పూర్, ఐఐటీ హైదరాబాద్ వంటి సంస్థలతో కలిసి కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించిన డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి.. చికిత్సల్లో అత్యాధునిక సాంకేతిక వినియోగాన్ని అందుబాటులోకి తెచ్చారు. భారత్, జపాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ బేస్డ్ ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షలను అందుబాటులోకి తెచ్చారు.

ఎన్నెన్నో అవార్డులు..

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని ఇప్పటికే ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. ఎండోస్కోపీ రంగంలో ప్రపంచ అత్యధిక పురస్కారంగా, వైద్య పరిభాషలో ఎండోస్కోపీకి సంబంధించి నోబెల్ బహుమతిగా అభివర్ణించే 'మాస్టర్ ఆఫ్ ఎండోస్కోపిస్ట్' అవార్డును 2009లో అందుకున్నారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపీ (ఏఎస్‌జీఈ) ఈ అవార్డును అందజేసింది. 2013లో ప్రపంచ అత్యుత్తమ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుడిగా నాగేశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఇక 2022లో ప్రతిష్ఠాత్మక అమెరికన్ గ్యాస్ట్రో ఎంటరాలాజికల్ అసోసియేషన్ (ఏజీఏ) అందించే విశిష్ట విద్యావేత్త పురస్కారాన్ని కూడా ఆయన అందుకున్నారు. వరల్డ్ ఎండోస్కోపీ ఆర్గనైజేషన్‌కు ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి భారతీయుడిగానూ రికార్డు సాధించారు. నగరంలో నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రి, ఇప్పుడు గ్యాస్ట్రో ఎంటరాలజీ పరంగా హార్వర్డ్, హాంకాంగ్‌లోని ఆస్పత్రుల తర్వాత మూడో స్థానంలో ఉంది.

దేశసేవను మించిన భాగ్యం లేదు..

హార్వర్డ్ యూనివర్సిటీ లాంటివి కోట్ల రూపాయల జీతం ఇచ్చేందుకు ముందుకొచ్చినా దేశ సేవను మించిన భాగ్యం లేదంటూ నిర్ద్వంద్వంగా తిరస్కరించిన విశిష్ట వ్యక్తి డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి. గ్యాస్ట్రో ఎంటరాలజీ చికిత్స అంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సిందే అనేంతగా ప్రపంచ పటంలో హైదరాబాద్ ఖ్యాతిని ఇనుమడింపజేశారు. దేశ విదేశాల నుంచి ఎంతోమంది డాక్టర్లు నగరానికి వచ్చి మరీ ఆయన వద్ద శిష్యరికం చేస్తున్నారు.



భారతీయ వైద్య స్ఫూర్తిని చాటే సందర్భం

పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపిక చేసినట్లుగా కేంద్రం ప్రకటించిన వెంటనే డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రకటించడం తాను ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఇది కేవలం తన వ్యక్తిగత మైలురాయి మాత్రమేకాదని, భారతీయ వైద్య స్ఫూర్తిని, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలో మన దేశ గొప్పదనాన్ని చాటే సందర్భమన్నారు. రోగి సంరక్షణ కోసం కరుణతో కూడిన సేవలందించడమే తన ప్రథమ కర్తవ్యమని, తమపై నమ్మకం ఉంచే ప్రతి వ్యక్తికీ తాను ఈ గౌరవాన్ని అంకితం చేస్తున్నానని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ అంటే కేవలం రోగాన్ని నయం చేయడమేకాదని, మానవాళిపై గౌరవం, సానుభూతితో సేవ చేయడమని తాను గట్టిగా నమ్ముతానన్నారు.

పద్మ విభూషణ్ వీరికే



జస్టిస్ జేఎస్ ఖేహర్ | కుముదిని లఖియా | ఎల్. సుబ్రమణ్యం | వాసుదేవన్ నాయర్ | ఒసామా సుజుకీ | శారదా సిన్హా

ఉద్యమాలే జీవితం

మాదిగల కోసం 30 ఏళ్లుగా మందకృష్ణ పోరాటం



హైదరాబాద్ సిటీ, హనుమకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక పురస్కారం పద్మశ్రీకి ఎంపికైన మందకృష్ణ మాదిగ జీవన ప్రస్థానం.. అనేక ఉద్యమాలతో ముడివేసుకొని ఉంది. మాదిగల కోసం ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని ప్రారంభించిన ఆయన.. దివ్యాంగులు, వృద్ధులు, హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారుల తదితరుల కోసం ఉద్యమాలు నిర్మించారు. మంద కృష్ణ మాదిగ స్వస్థలం వరంగల్ జిల్లా హన్మకొండ దగ్గర న్యూశాయంపేట. 1965లో ఆయన జన్మించారు. తండ్రి పేరు కొమురయ్య, తల్లి కొమురమ్మ. గ్రామంలో తలెత్తిన కులపరమైన ఘర్షణకు వ్యతిరేకంగా గొంతెత్తిన మంద కృష్ణ, ఆ ఘటనలో బాధితులపక్షాన నిలిచిన నాటి పీపుల్స్ వార్ పార్టీ పట్ల ఆకర్షితుడయ్యారు. జనగామ జిల్లా ఆర్గనైజర్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ క్రమంలో అరెస్టు అయ్యారు. అనంతరకాలంలో సాయుధ విప్లవ పంథాను వీడిన మంద కృష్ణ, అప్పటికే జనజీవన స్రవంతిలోకి వచ్చిన ప్రముఖ కవి శివసాగర్ వెంట నడిచారు. కారంచేడులో దళితులపై జరిగిన హత్యాకాండకు వ్యతిరేకంగా పురుడు పోసుకున్న దళిత మహాసభతో గొంతుకలిపారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాల విషయంలో మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రకాశం జిల్లా ఈదుముడిలో 13 మంది యువకులతో 1994 జూలై7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించారు. ఉమ్మడి ఏపీవ్యాప్తంగా మాదిగ దండోరా ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లారు. ఈ ఉద్యమం స్ఫూర్తితో మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలో సైతం ఎస్సీ వర్గీకరణ ఉద్యమాలు బయలుదేరాయి. మంద కృష్ణ తన పేరు చివర మాదిగ సామాజికవర్గం పేరును కలుపుకొని మందకృష్ణ మాదిగగా ప్రకటించుకున్నారు. మాదిగల ఆత్మగౌరవానికి చిహ్నంగా మారారు. తెలంగాణ ఉద్యమంలోనూ మందకృష్ణ తనదైన పాత్ర పోషించారు. 2004లో హృద్రోగ చిన్నారుల శస్త్రచికిత్సకు సహాయసహకారాలను కూడగట్టే కార్యక్రమానికి నాంది పలికారు. గుండెజబ్బుల బారినపడిన చిన్నారులతో పెద్ద ర్యాలీ తీయడమేగాక ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో 5వేలమందికిపైగా చిన్నారులు గుండెజబ్బుతో బాధపడుతున్నారన్నది వెల్లడైంది. ఆ పోరాటం స్ఫూర్తిగానే నాటి సీఎం వైఎస్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారన్న అభిప్రాయాలున్నాయి. 2007లో మంద కృష్ణ వికలాంగుల హక్కుల పోరాట సమితిని నెలకొల్పారు. దివ్యాంగులకు ప్రతి నెలా పింఛన్లు ఇవ్వాలని, రిజర్వేషన్లను అమలు చేయాలని ఉద్యమించారు. ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో వికలాంగులకు పింఛన్ లభిస్తోంది. 2004, 2009 ఎన్నికల్లో మధిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. తర్వాత వర్ధన్నపేట శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఎస్సీ వర్గీకరణ పోరును బలోపేతం చేశారు. గతేడాది ఎన్నికలప్పుడు ఎమ్మార్పీఎస్ సభకు ప్రధాని మోదీ హాజరై వర్గీకరణకు మద్దతు ప్రకటించారు. 30ఏళ్ల పోరాటం ఫలితంగా సుప్రీంకోర్టు ధర్మాసనం నిరుడు ఆగస్టులో వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. మంద కృష్ణ మాదిగ భార్య జ్యోతి. వారికి ముగ్గురు సంతానం.

పద్మం మెచ్చిన సామాన్యులు




లిబియా లోబో | విజయలక్ష్మి | గోకుల్ | సాలీ హోల్కర్

న్యూఢిల్లీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గోవాకు చెందిన వందేళ్ల వయసున్న స్వాతంత్ర్య సమరయోధురాలు.. 150 మందికి డోలు వాయిద్యంలో తర్ఫీదు ఇచ్చిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన కళాకారుడు.. దేశంలోనే మొట్టమొదటిసారిగా తోలు బొమ్మలాట ప్రదర్శనలు చేసిన 96 ఏళ్ల కళాకారిణి.. ఇలా దేశవ్యాప్తంగా 30 మంది సామాన్యులకు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. వీరిలో లిబియా లోబో సర్దేశాయ్ (100) గోవాలో పోర్చుగీసు వారికి వ్యతిరేకంగా ఉద్యమగళాన్ని వినిపించారు. అప్పట్లో ఓ మారుమూల అటవీ ప్రాంతం నుంచి 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' పేరుతో రేడియో స్టేషన్‌ను నడిపారు. ఆమె జనాన్ని ఎంతంగా చైతన్యపరిచారంటే 1955లో పోర్చుగీసు పాలనకు వ్యతిరేకంగా గోవాలో ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలు తీశారు. వందేళ్ల లిబియా లోబో సర్దేశాయ్. కాగా, పురుష కళాకారులదే ఆధిపత్యంగా ఉన్న ఇక డోలు వాయిద్యంలో మహిళలూ రాణించగలరని చాటిన బెంగాల్‌కు చెందిన 57 ఏళ్ల డోలు వాయిద్య కళాకారుడు గోకుల్ చంద్ర డే చాటారు. ఈ కళలో 150 మంది మహిళలకు కళలో శిక్షణనిచ్చి రాటుదేల్చారాయన. సాధారణ డోలు కన్నా 1.5 కిలోలు తక్కువగల తేలిక బరువున్న డోలుకు రూపకల్పన చేశారు. పండిట్ రవి శంకర్, ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌తో కలిసి భారత్ నుంచి ఆయన ఎన్నో అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు కూడా ఇచ్చారు. 82 ఏళ్ల సాలీ హోల్కర్.. మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనం. చేనేత ద్వారా చీరలు, పంచెలు, తలపాగాల రూపకల్పనలో ప్రత్యేకమైన సంప్రదాయ మహేశ్వరి క్రాఫ్ట్ కళలో యువతకు మెళకువలు నేర్పేందుకు మధ్యప్రదేశ్‌లో చేనేత విద్యాలయాన్ని నెలకొల్పారు. అటవీ జంతువులపై పరిశోధనలు చేసిన మహారాష్ట్రకు చెందిన 92ఏళ్ల మారుతి భుజంగరావుకు పద్మ అవార్డు దక్కింది. ఈయన పక్షులు, జంతువులు, వృక్షజాతులపై ప్రత్యేక నిఘంటువులను తయారు చేశారు. రాజస్థాన్‌కు చెందిన 68 ఏళ్ల బతూల్ బేగం గొప్ప భజన్ గాయకురాలు. ఈమె టౌన్ హాల్ ఆఫ్ ప్యారిస్‌లో ప్రదర్శననిచ్చారు. కర్ణాటకకు చెందిన భీమవ్వ (96) దేశంలోనే తొలిసారిగా తొలుబొమ్మలాట ప్రదర్శనలు చేసిన కళాకారిణి. ఈమె 14 ఏళ్ల వయసులోనే ఈ కళలో పట్టు సాధించారు. 12 దేశాల్లో ప్రదర్శనలిచ్చారు. అసోంకు చెందిన జాయ్‌చరణ్ భతారీ 'ధంసా ఫోక్' వాయిద్య కారుడికి కూడా సముచిత గౌరవం దక్కింది. ఈయన తన జీవితాన్నంతా ఈ గిరిజన సంప్రదాయ సంగీత పరిరక్షణకే వెచ్చించారు. సంప్రదాయ గిరిజన వాయిద్య కళాకారుడు, వెదురుతో ఈల (సులూర్/బస్తర్ ఫ్లూట్)ను తయారు చేసిన పండీరాం మండవి, బాలికల విద్య కోసం విశేషంగా కృషిచేసిన సామాజిక వేత్త, ఉత్తరాఖండ్ వాస్తవ్యురాలు రాధా బహిన్ భట్ (91), గుజరాత్‌లో కుష్టు రోగులకు సేవ చేస్తున్న సురేశ్ సోనీ, నిరుపేద రోగులకు ఉచితంగా క్యాన్సర్ చికిత్స చేస్తున్న కర్ణాటకలోని కలబుర్గికి చెందిన అంకాలజిస్ట్ విజయలక్ష్మి దేశమాని, మహారాష్ట్రలో నిరుపేద ప్రజలకు ఉచితంగా చికిత్స చేస్తున్న అంధుడైన వైద్యుడు విలాస్ డంగ్రే, గుజరాత్‌లోని తంగలియా నేత విధానంలో ప్రత్యేకతను చాటుకున్న దంగాసియా వర్గానికి చెందిన లవ్‌జీ భాయ్ నేగీభాయ్ (64)కి, మహారాష్ట్రకు చెందిన ప్రకృతి ప్రేమికుడు.. 5వేలకు పైగా మొక్కలు నాటి 400 హెక్టార్ల అడవిని కాపాడిన చైత్‌రాం దేవ్‌చంద్, తావిల్ అనే ప్రత్యేక సంగీత వాయిద్యానికి ప్రాచుర్యం కల్పించిన పుదుచ్చేరికి చెందిన పి.దచ్చనమూర్తి, ఉత్తరాఖండ్‌లో పర్యాటక జర్నలిజానికి విశేష సేవలు చేస్తున్న అక్కడి దంపతులు హ్యూజ్, కోలీన్ గంజర్, హిమాచల్‌లో 99 పేరుతో కొత్తరకం యాపిల్స్ పండిస్తున్న హరిమన్ శర్మ, అరుణాచల్‌లో స్థానిక తెగల్లో మద్యం మాన్పించేందుకు కృషిచేస్తున్న జుండే యోంగాంకు పురస్కారాలు లభించాయి.

పద్మ పురస్కారాల్లో తెలంగాణకు అవమానం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన పద్మ పురస్కారాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపికలో తెలంగాణకు అవమానం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గద్దర్ (పద్మవిభూషణ్), చుక్కా రామయ్య (పద్మభూషణ్), అందెశ్రీ (పద్మభూషణ్), గోరటి వెంకన్న (పద్మశ్రీ), జయధీర్ తిరుమలరావు (పద్మశ్రీ) వంటి ప్రముఖులను కేంద్రం పరిగణనలోకి తీసుకోకపోవడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు.

వెండి తెర శోభాయమానం!



తన నటనతో దశాబ్దంపాటు తెలుగు వారిని అలరించారు శోభన! సినీ నటిగా, నాట్య కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1982లో 'విక్రమ్' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యారు. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, మోహన్‌బాబు వంటి అగ్ర కథానాయకుల సరసన నటించారు. ఇప్పటి వరకు 230కి పైగా చిత్రాల్లో నటించారు. 1994లో విడుదలైన 'మణిచిత్రతళ' అనే మలయాళ సినిమాకు గాను ఆమెకు భారత ప్రభుత్వం నుంచి తొలిసారిగా జాతీయ ఉత్తమ నటి పురస్కారం లభించింది. నటనతో పాటు శాస్త్రీయ నృత్యం అంటే శోభనకు ప్రాణం. 1989లో సొంతంగా ఓ డ్యాన్స్ స్కూల్‌ని ప్రారంభించారు. దేశ, విదేశాల్లో ఎన్నో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. భరత నాట్యంలో శిక్షణ ఇచ్చేందుకు శోభన 1994లో 'కళార్పణ' అనే సంస్థను ప్రారంభించారు. నేటి తరానికి చెందిన ఎందరో కళాకారిణులు ఈమె దగ్గర నటనలో, నాట్యంలో శిక్షణ పొందుతున్నారు. శోభన 1970 మార్చి 21న తిరువనంతపురంలో జన్మించారు. పూర్తి కళా రంగానికే అంకితమైన శోభన ఇంత వరకూ వివాహం చేసుకోలేదు.

తెలుగు రాష్ట్రాలకు సప్త పద్మాలు

(మొదటి పేజీ తరువాయి)

మరణించిన ప్రముఖ మళయాళీ రచయిత వాసుదేవన్ నాయర్, ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు ఎల్.సుబ్రమణ్యం, కథక్ నృతకారిణి కుముదిని లఖియా, ప్రముఖ జానపద గాయని శారాదా సిన్హా, జపాన్‌కు చెందిన వ్యాపార వేత్త, సుజుకీ మోటార్ ఛైర్మన్ ఒసామా సుజుకీ(మరణానంతరం)కి పద్మ విభూషణ్ పురస్కారాలు లభించాయి. పద్మ భూషణ్ లభించిన వారిలో మహారాష్ట్ర మాజీ సీఎం, మాజీ లోక్‌సభ స్పీకర్, శివసేన నేత మనోహర్ జోషి, సీనియర్ జర్నలిస్టు కె.సూర్యప్రకాశ్, ప్రముఖ సినీనటులు అనంతనాగ్, అజిత్ కుమార్, దర్శకుడు శేఖర్ కపూర్, నటి, భరతనాట్య ప్రముఖురాలు శోభన, ప్రముఖ గాయకుడు పంకజ్ ఉదాస్, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోదీ, ప్రముఖ హాకీ కోచ్ పీఆర్ శ్రీజేష్, ఇటీవల మరణించిన ప్రముఖ ఆర్థిక వేత్త వివేక్ దెబ్రాయ్, ఆధ్యాత్మికవేత్త సాధ్వి రితంబర, నల్లి స్కిల్స్ అధినేత నల్లి కుప్పుస్వామి శెట్టి తదితరులు ఉన్నారు. పద్మశ్రీ పురస్కారాలు పొందిన ప్రముఖులలో గాయకుడు అర్జిత్ సింగ్, సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, ప్రముఖ రాజస్థానీ రచయిత షీన్ కాఫ్ నిజాం తదితరులు ఉన్నారు. తమిళనాడుకు చెందిన దినమలర్ పత్రిక యజమాని లక్ష్మీపతి రామసుబ్బయ్యర్‌కు పద్మశ్రీ ఇచ్చారు. తమిళనాడు నుంచి ఇటీవలే రిటైర్ అయిన ప్రముఖ క్రికెట్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను పద్మశ్రీ వరించింది. అత్యంత విజయవంతమైన స్టార్టప్‌లు ఫ్లిప్‌కార్ట్, ఓలా, బుక్‌మైషో, స్విగ్గీలను తొలిదశలోనే గుర్తించి వాటి పురోగతికి అండగా నిలిచిన వెంచర్ క్యాపిటలిస్ట్ ప్రశాంత్ ప్రకాశ్(కర్ణాటక)ను పద్మశ్రీతో గౌరవించారు. జాతీయ గీతానికి కొత్త ట్యూన్ కట్టిన సంగీతకారుడు రికీ గ్యాన్ కేజ్(కర్ణాటక) పద్మశ్రీ అందుకున్న వారిలో ఉన్నారు.

కేఎల్ కృష్ణ ఆర్థికవేత్త



ప్రొఫెసర్ కొసరాజు లీలా కృష్ణ ప్రముఖ ఆర్థికవేత్త. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో విశేష సేవలు అందించారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఉంగటూరులో జన్మించారు.

పదో తరగతి చదవి అవధానిగా ఎదిగి



అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మ కేవలం పదో తరగతి చదివారు. ఆ తర్వాత ఆధ్యాత్మికత దిశగా వెళ్లి అవధానిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆయన తల్లిదండ్రులు మాడుగుల నాగభూషణ శర్మ, సుశీలమ్మ. 1959లో నాగఫణి శర్మ జన్మించారు. ఈయనకు ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క చెల్లెల్లు ఉన్నారు. మొత్తం 9 మందిలో నాగఫణి శర్మ రెండో సంతానం. కడవకల్లు, పుట్లూరు, లేపాక్షి, కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈయన చదువు కొనసాగింది.

సంస్కృత భాషకు చేసిన సేవలు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరో పద్మశ్రీ గ్రహీత వాధిరాజు రాఘవేంద్రచార్య పంచముఖి సుదీర్ఘకాలం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సంస్థకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం మంత్రాలయ సంస్కృత విద్యాలయ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్‌గా పని చేస్తున్నారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. తిరుపతి సంస్కృత యూనివర్సిటీలో పదేళ్లుగా చాన్స్‌లర్‌గా పని చేశారు. వాధిరాజ్ తాను ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోలేదని చెప్పారు.

బుర్రకథ గురువు అప్పారావు



కోనసీమ జిల్లా రావులపాలెంలో నివాసం ఉంటున్న బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావు ఈ నెలలోనే కనుమ పండుగ రోజు మరణించారు. శనివారం నాడే దశదిన కర్మ నిర్వహించారు. ఇదే సమయంలో పద్మశ్రీకి అప్పారావు ఎంపికయ్యారంటూ సమాచారం రావడంతో కుటుంబ సభ్యులంతా కన్నీరు మున్నీరయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కరప మండలం నడకుదురు గ్రామంలో 1949లో అప్పారావు జన్మించారు. 1969లో బుర్రకథ రంగంలో అడుగుపెట్టి జూనియర్ నాజర్, రావిశెట్టి వీరేశం గురువుల వద్ద బుర్రకథ కళను అభ్యసించారు. రాగాల అప్పారావుగా కూడా పేరొందారు. రేడియోలో, దూరదర్శన్‌లో ప్రదర్శనలు ఇచ్చారు.

పద్మ గ్రహీతలకు కిషన్‌రెడ్డి అభినందనలు


తెలుగు రాష్ట్రాల నుంచి పద్మ అవార్డులకు ఎంపికైన వారిని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అభినందించారు. ఆయా రంగాల్లో వారు చేసిన సేవలకు సరైన గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. వైద్య పరిశోధనలో నాగేశ్వర్‌రెడ్డి, మాదిగ సమాజానికి గుర్తింపు పోరాటంలో మందకృష్ణ అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. సినీ, రాజకీయ, సామాజిక సేవ రంగాల్లో బాలకృష్ణ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారని ప్రశంసించారు.

రియల్ లైఫ్‌లోనూ హీరోనే



తెరపైన హీరోయిజాన్ని ప్రదర్శించే నటులకు మనదగ్గర కొదువ లేదు. కానీ నిజ జీవితంలోనూ అలాంటి తెగువను ప్రదర్శించగల అతికొద్దిమంది నటుల్లో అజిత్ అగ్రగణ్యుడు. తెరపైన బైకర్, రేసర్, బిజినెస్‌మాన్, టీచర్ లాంటి విభిన్న పాత్రలను తన అద్భుత నటనతో పండించిన అజిత్ మేకప్ తీశాక నిజ జీవితంలోనూ వాటిని సాకారం చేసుకున్నారు. దక్షిణాదిన అగ్రహీరోగా ఎదిగిన అజిత్‌కుమార్ 1971లో పి. సుబ్రమణ్యం, మోహిని దంపతులకు తంజావూర్‌లో జన్మించారు. ఆ తర్వాత వారి కుటుంబం తెలంగాణ రాష్ట్రంలోని సికింద‌రాబాద్‌కు వలస వచ్చింది. పదో తరగతితోనే చదువు ఆపేసిన అజిత్ ఎన్‌ఫీల్డ్ బైక్ గ్యారేజీలో మెకానిక్‌గా జీవితం ఆరంభించారు. అయితే తండ్రికి ఆపని నచ్చకపోవడంతో మధ్యలోనే వదిలేసి ఓ దుస్తుల ఎగుమతి కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. తర్వాత సొంతంగా దుస్తుల ఎగుమతి వ్యాపారం చేసి నష్టపోయాడు. అయితే ఆ సమయంలోనే పలు దుస్తుల బ్రాండ్స్‌కు మోడల్‌గానూ అజిత్ పనిచేశారు. హెర్క్యులెస్ సైకిల్స్ కోసం ఓ యాడ్ చేసే క్రమంలో ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్‌తో ఆయనకు పరిచయమైంది. ఆయన సూచన మేరకు సినీ రంగంవైపు అజిత్ అడుగులేశారు. 1990లో 'ఎన్ వీడు ఎన్ కనవర్' చిత్రంలో విద్యార్థిగా చిన్న పాత్రలో తెరపై తొలిసారి కనిపించారు అజిత్. ఎస్పీ చరణ్, అజిత్ స్కూల్ ఫ్రెండ్స్. అలా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సూచనతో 'ప్రేమ పుస్తకం' చిత్రంలో తొలిసారి హీరోగా అజిత్ అవకాశం దక్కించుకున్నారు. ఇప్పటివరకూ అజిత్ నటించిన తెలుగు చిత్రం ఇదొక్కటే. అయితే ఆ సినిమా విడుదలలో జాప్యం జరగడంతో ఆయన హీరోగా నటించిన తమిళ చిత్రం 'అమరావతి' ముందు విడుదలైంది. 1995లో వచ్చిన 'ఆసై' చిత్రం సూపర్‌హిట్ అవ్వడంతో అజిత్ ఇక వెనుదిరిగి చూడలేదు. 1999లో వచ్చిన 'వాలి' చిత్రంలో ద్విపాత్రాభినయనం చేసిన అజిత్ తొలిసారి ఉత్తమనటుడిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం అందుకున్నారు. ఆ తర్వాత కోలీవుడ్‌లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి హీరోగా తన కెరీర్‌ను సుస్థిరం చేసుకున్నారు. మొత్తం మూడు ఫిలింఫేర్ పురస్కారాలను అందుకున్నారు. 2000లో నటి షాలినీని ఆయన పెళ్లాడారు.

లోకం తీరు



కాలయాపనలేని తీర్పులు అవసరం

- పరస్పర సహకారంతోనే కేసుల పరిష్కారం
- హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీసుధ
- ఖమ్మంలో రెండో అదనపు సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభం


మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీసుధ

ఖమ్మం లీగల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారం, మధ్యవర్తిత్వంతో కేసులకు పరిష్కారం లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, ఖమ్మం పరిపాలనా న్యాయాధికారి జస్టిస్ శ్రీసుధ అన్నారు. కాలయాపన లేకుండా తీర్పులు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఖమ్మంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఏర్పాటుచేసిన రెండో అదనపు సీనియర్ సివిల్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు నగేష్ భీమపాక, కాజా శరత్‌లతో కలిసి శనివారం ఆమె ప్రాంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ కేసుల సత్వరపరిష్కారానికి అందరూ కృషిచేయాలన్నారు. పేదలకు, కక్షిదారులకు న్యాయసహాయం అందించేందుకు న్యాయ వ్యవస్థలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతుల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించుకోవటంతో డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ శరత్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న కేసులకు అనుగుణంగా కొత్త కోర్టులు అవసరం ఉందని తెలిపారు. నూతన కోర్టులు ఏర్పాటైనా జడ్జీల నియామకానికి సమయం పడుతుందని చెప్పారు. జస్టిస్ నగేష్ మాట్లాడుతూ మనిషి అహం తగ్గించుకుంటే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. సాధ్యమైనంతవరకు తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నించాలని కోరారు. తెలుగు భాష గౌరవాన్ని అందరూ కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్, న్యాయాధికారులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, అర్చనకుమారి, దేవినేని రాంప్రసాదరావు, వి.శీనయ్య, ఎం.కల్పన, వి.శివరంజని, కె.దీప, వి. మాధవీలత, బి.నాగలక్ష్మి, బి.రజిని, ఏపూరి బిందుప్రియ, ఆర్.శాంతిలత, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాసరావు, సీహెచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అలకనంద కిడ్నీ రాకెట్ కేసు..

7 నెలల్లో 20 ఆపరేషన్లు

- ఏ-1గా డాక్టర్ అవినాశ్, ఏ-2గా సుమంత్
- రూ. 12 కోట్లు వెనకేసుకున్న ముఠా సభ్యులు
- ఒక్కో మూత్రపిండానికి రూ.60 లక్షల వసూలు
- అందులో కిడ్నీదాతకు 5 లక్షలే.. డాక్టర్‌కు 10 లక్షలు
- 9 మంది అరెస్టు.. పరారీలోనే కీలక వైద్యులు

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ అలకనంద ఆస్పత్రిలో వెలుగుచూసిన కిడ్నీరాకెట్ తతంగాలను తవ్వినకొద్దీ వెలుగులోకి వస్తున్నాయని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు వివరించారు. ఈ కేసులో ఇప్పటి వరకు 9 మందిని అరెస్టు చేయగా.. నిందితులైన ఇద్దరు ప్రధాన వైద్యులు, కీలక పాత్ర పోషించిన నలుగురు వ్యక్తుల కోసం గాలిస్తున్నామని చెప్పారు. అలకనంద ఆస్పత్రిలో గడిచిన ఏడు నెలల్లో మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు 20 జరిగాయని, అంతకు ముందు సైదాబాద్‌లోని జననీ ఆస్పత్రి ఈ దందాకు అడ్డాగా ఉండేదని వెల్లడించారు. ఈ ముఠా కిడ్నీమార్పిడికి రూ.60 లక్షల దాకా వసూలు చేసేదన్నారు. శనివారం సుధీర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన అవినాశ్ చైనాలో ఎంబీబీఎస్ చదువుకున్నాడు. పుణెలో డిప్లొమా ఇన్ సర్జరీ పూర్తిచేసి, అక్కడే పనిచేవాడు. 2022లో హైదరాబాద్‌కు వచ్చి.. సైదాబాద్ మాదన్నపేటలో జననీ ఆస్పత్రిని స్థాపించాడు. లాభాలు లేకపోవడంతో మూసివేయాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో ఏపీలోని వైజాగ్‌కు చెందిన లక్ష్మణ్ ఇతనికి పరిచయమయ్యాడు. ఆపరేషన్ థియేటర్‌ను అద్దెకిస్తే.. ఒక్కో కిడ్నీ మార్పిడి సర్జరీకి రూ.2.5 లక్షలు ఇస్తానంటూ ఆఫరిచ్చాడు. దానికి అవినాశ్ ఒప్పుకోవడంతో.. 2023 ఏప్రిల్ నుంచి 2024 జూన్ వరకు అక్కడ నిరాటంకంగా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించారు. లక్ష్మణ్ స్నేహితుడు పవన్ అలియాస్ లియోన్, అతని అనుచరుడు పూర్ణ అలియాస్ అభిషేక్ కిడ్నీ మార్పిడి సర్జరీ వ్యవహారాలను చూసుకునేవారు. నెఫ్రాలజిస్టు అయిన పవన్.. తన వద్దకు వచ్చే కిడ్నీ రోగుల్లో ధనికులు, రూ.లక్షలు ఖర్చు పెట్టగలిగేవారిని గుర్తించి, మూత్రపిండాల మార్పిడి వివరాలు చెప్పేవాడు. వీరంతా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించుకుని, ఆర్థిక ఇబ్బందులతో కిడ్నీలు దానం చేయడానికి సిద్ధపడేవారిని సంప్రదించేవారు. కిడ్నీలు అవసరమైన వారి నుంచి రూ.55 లక్షల నుంచి రూ.60 లక్షలు వసూలు చేసేవారు. దాతలకు రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షలు ఇచ్చేవారు. పవన్ సూచనల మేరకు యూరాలజిస్టులు– తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్ పెరుమాళ్, జమ్మూకశ్మీర్‌కు చెందిన డాక్టర్ షోహిబ్‌ను హైదరాబాద్‌కు రప్పించి, సర్జరీలు చేయించేవారు. వారికి ఒక్కో సర్జరీకి రూ.10 లక్షల వరకు, ఆపరేషన్ థియేటర్ టీమ్‌కు రూ.30 వేలు ఇచ్చేవాడు. ఆపరేషన్ థియేటర్ అద్దె రూ.2.5 లక్షలు పోను.. మిగతాదాన్ని లక్ష్మణ్, పవన్ టీమ్, ఏజెంట్లు పంచుకునేవారు. అయితే.. గత ఏడాది జూన్‌లో ఆ ఆస్పత్రిని అవినాశ్ మూసివేయడంతో.. దందాకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

అలకనందకు మారిందిలా..

కజకిస్థాన్‌లో వైద్యవిద్యను అభ్యసించిన డాక్టర్ గుంటుపల్లి సుమంత్.. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి అలకనంద ఆస్పత్రిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జననీ ఆస్పత్రిని మూసివేశాక.. అవినాశ్ సుమంత్‌ను కలిశాడు. కిడ్నీ ఆపరేషన్ల గురించి చెప్పి.. ఒక్కో సర్జరీకి రూ.2.5 లక్షలు వస్తాయని, అలకనంద ఆపరేషన్ థియేటర్‌ను అద్దెకిస్తే.. తాను రూ.1.5 లక్షలు అందేలా చేస్తానని, తాను రూ.లక్ష తీసుకుంటానని చెప్పాడు. దీంతో సుమంత్ ఒప్పుకొన్నాడు. దాంతో.. గడిచిన ఏడు నెలల్లో 20 మూతపిండాల మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహించారు. కిడ్నీరాకెట్ ఈ 20 సర్జరీల ద్వారా రూ.12 కోట్లు వెనకేసుకుందని రాచకొండ సీపీ తెలిపారు. ఈ కేసులో అవినీశ్, సుమంత్, కర్ణాటకకు చెందిన ఆర్గనైజర్లు పొన్నుస్వామి ప్రదీప్, సూరజ్ మిశ్రా, మెడికల్ బృందానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు వివరించారు. రాజశేఖర్, షోహిబ్, కీలక సూత్రధారులు పవన్, పూర్ణ అలియాస్ అభిషేక్, లక్ష్మణ్, శంకర్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విలేకరుల సమావేశంలో డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎస్‌వోటీ, సరూర్‌నగర్ పోలీసులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- ఆదిలాబాద్ జిల్లాలో వర్తమన్నూర్‌లో ఘటన


నర్సయ్య(ఫైల్)

బజార్‌హత్నూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అప్పులు తెచ్చి ఎన్నోఆశలతో సాగు చేసిన పంటలు దిగబడి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆది లాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం వర్తమన్నూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన రైతు మైలనర్సయ్య (56) తనకున్న ఆరు ఎకరాల్లో రూ.10లక్షల వరకు అప్పులు తెచ్చి పత్తి, కంది పంటలను సాగు చేశాడు. అయితే దిగుబడి సరిగ్గా రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు.. అప్పులిచ్చిన వారు వేధింపులకు గురి చేయడంతో నర్సయ్య శనివారం పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఉరేసుకున్నాడు.

పూజారి కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో

మృతులు 18 కాదు 12 మంది

వారిలో 8 మంది నక్సలైట్లు, నలుగురు గ్రామస్థులు

- క్షేమంగానే దామోదర్: మావోయిస్టు పార్టీ లేఖ

చర్ల, ములుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌లోని పూజారి కాంకేర్, మల్లంపేట అడవుల్లో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. ఆ ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు, అందులో తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కారదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్లు మావోయిస్టు పార్టీ సౌత్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ పేరుతో గతంలో విడుదలైన లేఖ నకిలీదని తెలిపింది. ఆ లేఖను పోలీసులే సృష్టించారని ఆరోపించింది. దామోదర్ సురక్షితంగా ఉన్నట్టు పేర్కొంది. పూజారి కాంకేర్ అడవుల్లో పోలీసులు జరిపిన దాడిలో 12మంది చనిపోయారని, వారిలో 8 మంది మావోయిస్టులు, నలుగురు గ్రామస్థులు ఉన్నారని మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ప్రతినిధి సోమ తేర్ అలియాస్ సమత పేరుతో శనివారం లేఖ విడుదలైంది. పోలీసులు వందలమంది గ్రామస్థులను పట్టుకుని తీసుకుని వెళ్లారని, వారి ఆచూకీ ఇప్పటికీ తెలియదని ఆ లేఖలో మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ లేఖ విడుదలతో దామోదర్ ఎలా ఉన్నాడనే ఉత్కంఠకు తెర పడినట్లయింది.

కేసీఆర్ సోదరి సకలమ్మ కన్నుమూత


సకలమ్మ(ఫైల్)

హైదరాబాద్ సిటీ/మేడ్చల్ ప్రతినిధి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సోదరి చీటి సకలమ్మ(82) శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కేసీఆర్‌కు సకలమ్మ ఐదవ సోదరి. ఆమె స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. భర్త హన్మంతరావు కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. సకలమ్మ అంత్యక్రియలను శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలం మునీరాబాద్ గ్రామ పరిధిలోని శ్మశానవాటికలో నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, నందికంటి శ్రీధర్, బాల్క సుమన్, ఎర్రోల్ల శ్రీనివాస్, జీవన్‌రెడ్డి తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

సాయిరెడ్డి 'సన్యాసం' కథ!

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ..' అని ఒక కవిగారు ఎప్పుడో అన్నారు. రాజకీయాలలో ఇది మరీ ఎక్కువగా జరుగుతుంటుంది. వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి శనివారం నుంచి రాజకీయ సన్యాసం తీసుకుంటున్నానని ప్రకటించడం ఈ కోవలోకే వస్తుంది. గతంలో ఎక్స్ వేదికగా నికృష్టమైన పోస్టులు పెట్టిన ఆయనపై విమర్శలు వెల్లువెత్తడంతో ఇకపై హుందాగా ఉంటానని ప్రకటించి మాట తప్పారు. ఈ కారణంగా ఇప్పుడు కూడా 'రాజకీయ సన్యాసం' చేస్తున్నానన్న మాటకు కట్టుబడి ఉంటారో లేదో వేచి చూడాలి. పలు అవినీతి కేసులలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ–1గా ఉండగా, విజయసాయిరెడ్డి ఏ–2గా ఉన్నారు. వీరిద్దరినీ విడదీసి చూడలేము. అవినీతి విషయంలో అవిభక్త కవలలుగా చేయకూడని పనులన్నీ చేశారు. అలాంటి విజయసాయిరెడ్డి హఠాత్తుగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారా? అన్న అనుమానం సహజంగానే కలుగుతుంది. నిజానికి ఇది హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు. ఏడు మాసాల క్రితం జరిగిన ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయిన నాటి నుంచి ఆయన వైఖరిలో మార్పు వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా జగన్‌రెడ్డి ఆయనను దూరం పెట్టారు. దీంతో ఆయన పార్టీలో పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తూ వచ్చినా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్నికల్లో ఓడిపోవడంతో పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఒక దశలో భావించారు. అయితే జగన్‌రెడ్డి ఒత్తిడి తేవడంతో పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇంచార్జిగా మళ్లీ బాధ్యతలు చేపట్టారు. భవిష్యత్తులో తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోవడం లేదని కూడా విజయసాయిరెడ్డి ప్రకటించారు. అయితే ఇది కూడా విధిలేని స్థితిలోనే ఆయన ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ తనను దగ్గరకు రానివ్వదు కనుక భారతీయ జనతా పార్టీలో చేరిపోవాలని కొన్ని రోజుల క్రితం ఆయన భావించారు. తనతో పాటు ఏడెనిమిది మంది రాజ్యసభ సభ్యులను తీసుకువస్తానని, పార్టీలో చేర్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలసి అర్జీ పెట్టుకున్నారు. అయితే ఈ విషయమై మరో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలసి మాట్లాడుకోవలసిందిగా అమిత్ షా ఆయనకు సూచించారు. దీంతో పీయూష్‌ను కలసిన విజయసాయి.. తనను బీజేపీలో చేర్చుకోవాలని కోరారు. అయితే కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఏర్పడటానికి కారణం అయిన తెలుగుదేశం పార్టీ ఆమోదం లేకుండా పార్టీలో చేర్చుకోలేమని పీయూష్ గోయల్.. విజయసాయికి తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నుంచి నిరభ్యంతర పత్రం పొందడం కోసం విజయసాయి చేయని ప్రయత్నం లేదు. పార్టీ ముఖ్యులను కలసి తన మనసులోని మాటను చెప్పుకొన్నారు. జగన్‌రెడ్డిపై పెండింగ్‌లో ఉన్న అవినీతి కేసులలో అప్రూవర్‌గా మారితే భారతీయ జనతా పార్టీలో చేరడానికి తాము క్లియరెన్స్ ఇస్తామని తెలుగుదేశం ముఖ్యులు ఆయనకు స్పష్టంచేశారు. దీంతో ఆయన డైలమాలో పడ్డారు. ఒక దశలో ఆయన అప్రూవర్‌గా మారడానికి కూడా సిద్ధపడ్డారు. అయితే గొడ్డలి గుర్తుకు వచ్చి పీడకల రావడంతో మరుసటి రోజుకే ఆయన తన మనసు మార్చుకున్నారట. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు ఏమి జరిగిందో అక్కడి సన్నివేశాల గురించి క్షుణ్ణంగా తెలిసినప్పటికీ పార్టీ ఆదేశం మేరకు వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని తొలుత ప్రకటించింది విజయసాయిరెడ్డే కావడం గమనార్హం. అవినీతి కేసులలో అప్రూవర్‌గా మారితే తనకు ముప్పు తప్పదని భావించిన విజయసాయిరెడ్డి.. మనసు మార్చుకున్నారని ఆయన సన్నిహితులు చెబుతారు. ఈ దశలోనే ఆయనను ఉత్తరాంధ్ర ఇంచార్జిగా జగన్‌రెడ్డి నియమించారు. ఇష్టంగానో అయిష్టంగానో ఆయన ఆ బాధ్యతలు చేపట్టారు. తర్వాత కూడా చంద్రబాబుపై తనకున్న ద్వేషాన్ని దాచుకోకుండా ఎక్స్ వేదికగా నోరు పారేసుకున్నారు. 2029 నాటికి చంద్రబాబు బతికుంటే అప్పుడు తాము అధికారంలోకి వచ్చి ఆయనను జైలుకు పంపుతామని విజయసాయిరెడ్డి నోరు పారేసుకున్నారు. పనిలో పనిగా నాపై కూడా చెత్త ఆరోపణలు చేస్తూ తన మనో వికారాలను బయట పెట్టుకున్నారు. బహిరంగ చర్చకు రావాలంటూ సవాలు విసిరి తోక ముడిచారు. చంద్రబాబును తిడుతూనే జనసేనాని పవన్ కల్యాణ్‌ను కీర్తించారు. కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. విజయసాయిరెడ్డి మాటలకూ చేతలకూ పొంతన ఉండదు. అందువల్లే ఆయన మాటలను రాజకీయాల్లో ఎవరూ విశ్వసించరు. భారతీయ జనతా పార్టీలో చేరడానికి సిద్ధపడినా ఆ పార్టీ ముఖ్యులు ఆయనను సీరియస్‌గా తీసుకోలేదు. అయినా కనపడిన వారినందరినీ కలసి జగన్‌రెడ్డితో తాను ఇక ప్రయాణం చేయలేనని ఆయన వాపోతూ వచ్చారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి తనను తరచుగా అవమానిస్తూ వచ్చినా విజయసాయి సహిస్తూ వచ్చారట. వాస్తవానికి వైఎస్ రాజశేఖరరెడ్డితో విజయసాయికి పరిచయం ఏర్పడిన నాటి నుంచి ఆ కుటుంబానికి విధేయుడిగా ఆయన ఉండిపోయారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆడిటర్‌గా తన తెలివితేటలను ఉపయోగించి క్విడ్ ప్రో కోకు తెర లేపారు. జగన్‌రెడ్డితో అనతికాలంలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మింపజేశారు. ఈ క్రమంలో అన్ని కంపెనీలనూ జగన్ పేరిట ఏర్పాటు చేస్తే షర్మిల పరిస్థితి ఏమిటి? అని రాజశేఖరరెడ్డి ఆయనను నిలదీశారు. తోడబుట్టిన వాళ్లు గిఫ్ట్ డీడ్‌లు చేసుకోవచ్చునని విజయసాయిరెడ్డి సర్దిచెప్పారు. సండూర్ పవర్ ఏర్పాటు నుంచి ఆ తర్వాత డజన్లకొద్దీ సూట్‌కేస్ కంపెనీల ఏర్పాటు వెనుక విజయసాయి ఉన్నారు. ఈ క్రమంలోనే ఒక చార్టెడ్ ఎకౌంటెంట్‌గా విజయసాయి అనైతికంగా వ్యవహరించి నందున ఆయన సర్టిఫికెట్‌ను ఎందుకు రద్దు చేయకూడదు అంటూ చార్టెడ్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చెన్నై విభాగం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై కూడా ఆయన హైకోర్టులో స్టే పొందారు.

> విజయసాయిరెడ్డి ఉదంతంలో ప్రాంతీయ పార్టీలు, ముఖ్యంగా వైసీపీ, తెలుగుదేశం పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్టీ టికెట్ల కేటాయింపు, రాజ్యసభకు అభ్యర్థుల ఎంపికలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వకుండా విధేయతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తిస్తే మంచిది. తమిళనాడులో డీఎంకే పార్టీ టికెట్లు అమ్ముకోదు. అందుకే ఆ పార్టీ ఎంపీలు, నాయకులు తాము అధికారంలో ఉన్నా లేకపోయినా ఫిరాయింపులకు పాల్పడరు. తెలుగునాట ఈ పరిస్థితి లేదు. రాజకీయ సన్యాసం ప్రకటించిన తర్వాత కూడా ఇటు విజయసాయికి కానీ, అటు జగన్‌రెడ్డికి కానీ సానుభూతి లభించే పరిస్థితి లేదు. అధికారాన్ని గరిష్ఠ స్థాయిలో దుర్వినియోగం చేయడమే ఇందుకు కారణం. జగన్‌రెడ్డి ముందు కుర్చీలో కూర్చోవడానికి కూడా సాహసించని విజయసాయి వంటి వాళ్లు ఇప్పుడు అదే జగన్‌రెడ్డి ప్రాధేయపడినా రాజీనామా నిర్ణయం వెనక్కు తీసుకోవడానికి నిరాకరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

అవమానాలను దిగమింగుకొని..

వైఎస్ కుటుంబంపై తనకు ఉన్న విధేయత, అభిమానం వల్లనే ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ఆ కుటుంబంతో తన అనుబంధాన్ని కొనసాగిస్తున్నానని విజయసాయిరెడ్డి తన సన్నిహితుల వద్ద చెబుతుంటారు. మన దేశంలో రాజకీయ అధికారాన్ని మించిన అధికారం లేదని విజయసాయిరెడ్డి అంటూ ఉంటారు. అలాంటిది ఉన్న ఎంపీ పదవిని కూడా ఆయన ఎందుకు వదులుకుంటున్నారు? అన్న ప్రశ్న తప్పకుండా వస్తుంది. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డితో ఆయనకు ఎదురైన చేదు అనుభవాల గురించి తెలుసుకోవాలి. రాజశేఖరరెడ్డి కుటుంబంతో ఉన్న ఆత్మీయ అనుబంధం కారణంగానే జగన్‌రెడ్డితో కలసి ప్రయాణించవలసి వస్తున్నదని ఆయన తరచుగా అంటూ ఉంటారట. తన మాయా సామ్రాజ్య నిర్మాణానికి కర్త కర్మ క్రియ వంటి విజయసాయి పట్ల జగన్‌రెడ్డి కనీసం ఉదారంగానైనా ఉండేవారు కాదట. మొదటిసారి రాజ్యసభ పదవి ఇవ్వజూపినప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందున ఎమ్మెల్యేలకు తలా కోటి రూపాయలు ఇవ్వాలని జగన్‌రెడ్డి సూచించగా చెన్నైలో ఒక భవనాన్ని విజయసాయి విక్రయించి ఆ సొమ్ము పంచి పెట్టి ఎంపీ అయ్యారు. ఒక దశలో విజయసాయిరెడ్డి ఫ్రెంచి కట్ గడ్డంతో ఉండేవారు. అప్పుడు ఆయనను చూసిన జగన్‌రెడ్డి రోత మీడియా ఉద్యోగుల ముందే మీ ముఖానికి ఆ పిల్లి గడ్డం అవసరమా? అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇలాంటి అవమానాలు ఎదురైనా భరించి జగన్‌రెడ్డి అధికారంలోకి వస్తే చక్రం తిప్పవచ్చునని విజయసాయి భావించారు. అనుకున్నట్టుగానే 2019లో అధికారంలోకి రాగానే ఆయన రెచ్చిపోయారు. ఉత్తరాంధ్ర ఇంచార్జిగా తిరుగులేని అధికారం చలాయించారు. ఈ క్రమంలో ఆయనకూ, పార్టీలోని ఇతర ముఖ్యులకూ మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఆయనపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పార్టీలో విజయసాయి ప్రాధాన్యాన్ని జగన్‌రెడ్డి తగ్గిస్తూ వచ్చారు. చివరకు ఉత్తరాంధ్ర ఇంచార్జిగా కూడా తప్పించారు. అయినా సీబీఐ, ఈడీ కేసులలో విచారణ ముందుకు సాగకుండా ఢిల్లీ స్థాయిలో విజయసాయి తన వంతు కృషి చేశారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు విధేయుడిగా మారిపోయారు. ఈ విధంగా స్వామి కార్యం, స్వకార్యం చక్కదిద్దుకుంటూ వచ్చారు. అయినా ఎన్నికల ముందు, ఆ తర్వాత కూడా జగన్‌రెడ్డి నుంచి ఈసడింపులు తప్పలేదు. జగన్‌రెడ్డి ఆయనను నమ్మడం పూర్తిగా మానేశారు. ఈ దశలో తమపై ఉన్న కేసుల గురించి జగన్‌రెడ్డి వద్ద చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం చంద్రబాబుపై ఆధారపడి ఉన్నందున ఆయన మాటకు విలువ ఉంటుందని, కేసుల విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది కనుక జాతీయ స్థాయి మద్దతు కోసం కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుదామని జగన్‌రెడ్డి ప్రతిపాదించారట. దీంతో విజయసాయిరెడ్డి కల్పించుకొని ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ప్రధాని మోదీని ధిక్కరించడం సరైనది కాదని సూచించినా జగన్ లెక్క చేయలేదు. మరోవైపు తాను వియ్యం అందుకున్న అరబిందో ఫార్మా అధినేత రాంప్రసాద్‌రెడ్డి కూడా విజయసాయిరెడ్డి రాజకీయాల వల్ల తమకు ఇబ్బందులు వస్తున్నాయని అసహనం వ్యక్తంచేశారట. ఒక్కగానొక్క కుమార్తె సంసార జీవితంలో ఇబ్బందులు ఏర్పడకూడదని విజయసాయి అంతర్మథనం చెందుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అనుమతి పొంది భారతీయ జనతా పార్టీలో చేరిపోయి ఆ తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి మళ్లీ బీజేపీ తరఫున ఎంపీ కావాలని భావించారు. తన కుమార్తెను తెలంగాణలో బీజేపీ తరఫున వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయించాలని కూడా ఆయన తలపోశారు. తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్టుగా ఆయనకు భారతీయ జనతా పార్టీలో చేరడం సాధ్యం కాలేదు. కుటుంబపరంగా, రాజకీయంగా సమస్యలు చుట్టుముట్టడంతో ఆయన కొన్ని రోజులుగా మానసికంగా నలిగిపోయారని చెబుతున్నారు. మా వాడు మెంటల్ బ్యాలెన్స్ తప్పినట్టుగా ప్రవర్తిస్తున్నాడు అని వైసీపీకి చెందిన ఒక ముఖ్యుడు ఈ మధ్య నా వద్ద వ్యాఖ్యానించారు. తాను ఇప్పటికీ బాడుగ ఇంట్లోనే ఉంటానని విజయసాయిరెడ్డి చెప్పుకొంటారు కానీ అది నిజం కాదు. వైఎస్ కుటుంబం వల్ల తాను బాగానే లాభపడ్డానని, చార్టెడ్ ఎకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేసి ఉంటే అంత సంపాదించేవాడిని కానని ఆయన తన కొలీగ్స్ వద్ద చెబుతుంటారు. విజయసాయికి 22 ఎకరాల్లో ఫాం హౌజ్ కూడా ఉంది. అందులో దేశ విదేశాల నుంచి వన్య ప్రాణులను తెప్పించి పోషిస్తున్నారు. ఇప్పుడు తన నివాసం కోసం సొంత భవనాన్ని నిర్మించుకుంటున్నారు. స్వామి కార్యం, అంటే జగన్‌రెడ్డికి అక్రమ సంపాదనలో సహాయపడుతూనే.. స్వకార్యం, అంటే తన కోసం కూడా ఆయన బాగానే సంపాదించి పెట్టుకున్నారు. అయితే అన్ని రోజులూ ఒకేలా ఉండవు కదా. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వారి పాపాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. మద్యం, ఇసుక, భూముల విషయాల్లో విజయసాయిరెడ్డి చేతివాటంపై చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ కారణంగానే పవన్ కల్యాణ్ ద్వారా రక్షణ పొందవచ్చునని డిప్యూటీ సీఎంను పొగుడుతున్నారు. కాకినాడ పోర్టులో తన సొంత అల్లుడి పేరిట బలవంతంగా తీసుకున్న షేర్లను తిరిగి కేవీ రావుకు బదలాయింపజేశారు. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో ప్రతికూల పరిస్థితులు ఉండటంతో ఇక లాభం లేదనుకున్న విజయసాయిరెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్టు ప్రకటించి ఉంటారు. తాను నమ్ముకున్న జగన్‌రెడ్డి తనను నమ్మకపోవడం, అవసరార్థం తానుగా విధేయత ప్రకటించుకున్నప్పటికీ కేంద్ర పెద్దల నుంచి కోరుకుంటున్న ఉపశమనం లభించే పరిస్థితి కనిపించకపోవడం, ఇతరత్రా సమస్యలు చుట్టుముట్టడంతో విజయసాయిరెడ్డి రాజకీయ సన్యాసం అనే నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు.

> గతంలో ఎక్స్ వేదికగా నికృష్టమైన పోస్టులు పెట్టిన విజయసాయిరెడ్డిపై విమర్శలు వెల్లువెత్తడంతో ఇకపై హుందాగా ఉంటానని ప్రకటించి మాట తప్పారు. ఈ కారణంగా ఇప్పుడు కూడా 'రాజకీయ సన్యాసం' చేస్తున్నానన్న మాటకు కట్టుబడి ఉంటారో లేదో వేచి చూడాలి.



> విజయసాయిరెడ్డి రాజకీయ సన్యాసం వల్ల వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగులుతుంది. అవినీతి చేయడంలో కవలలుగా సాగిన జగన్‌రెడ్డి–విజయసాయిరెడ్డిని విడదీసి చూడలేం కనుక ఇప్పుడు విజయసాయి ఏకంగా వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యం కచ్చితంగా దెబ్బతింటుంది. జగన్‌రెడ్డి లండన్ పర్యటనలో ఉన్నప్పుడు విజయసాయి ఈ ప్రకటన చేయడం రాజకీయాల్లో అనైతికతకు నిదర్శనం. విషయం తెలుసుకున్న జగన్‌రెడ్డి రాజీనామా చేయవద్దని విజయసాయిపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ ఒత్తిడి తట్టుకోలేకపోయిన ఆయన ఎక్స్ వేదికగా శుక్రవారంనాడే తన రాజకీయ సన్యాసం గురించి ప్రకటించారు. నిజానికి శనివారంనాడు రాజ్యసభ చైర్మన్‌ను వ్యక్తిగతంగా కలసి రాజీనామా లేఖ అందజేసే వరకు ఆ విషయాన్ని రహస్యంగా ఉంచాలనుకున్నారు. ఈ పరిణామాన్ని జగన్ అనుకూల శక్తులు కనీసం ఊహించలేదు. ఈ కారణంగానే జగన్‌కు అనుకూలంగా సోషల్ మీడియాలో వీడియోలు పెట్టే పేటీఎం బ్యాచ్ విజయసాయిరెడ్డి ప్రకటన తర్వాత వెంటనే స్పందించలేదు. జగన్‌రెడ్డి నుంచి ఆదేశాల కోసం ఎదురుచూశారేమో తెలియదు. విజయసాయిరెడ్డి వంటి వాళ్లు ఇలా చేస్తే జగన్‌రెడ్డితో ఇంకా ఎవరు మిగులుతారు అన్న ప్రశ్న ఈ సందర్భంగా తలెత్తుతోంది.

'అయోధ్య' ఆగిందెందుకు?

రాజ్యసభ చైర్మన్‌ను కలసి విజయసాయిరెడ్డితో పాటు అయోధ్య రామిరెడ్డి కూడా ఎంపీ పదవులకు శనివారం రాజీనామా చేస్తారని మూడు రోజుల క్రితమే నాకు తెలుసు. అయితే ఈ విషయం నాకు చెప్పిన వ్యక్తికి ఇచ్చిన మాట ప్రకారం మీడియాలో ఉండి కూడా నేను ఆ విషయాన్ని బయట పెట్టలేదు. జర్నలిజంలో ఇలాంటి ప్రమాణాలు ఉంటాయని విజయసాయిరెడ్డి వంటి వారికి తెలియదు. రోత మీడియా గురించి మాత్రమే వారికి తెలుసు. అయోధ్య రామిరెడ్డి విషయానికి వస్తే ఆయనకు రాజ్యసభ సభ్యత్వం వదులుకోవడం ఇష్టం లేదు. వైసీపీ నుంచి ఎంపిక అయినందున ఇప్పటికి రాజీనామా చేసినా తెలుగుదేశం పార్టీలో చేరి మళ్లీ తన పదవి దక్కించుకోవాలని తలపోశారు. బీజేపీలో చేరడానికి ఆయన ఇష్టపడలేదట. రాజ్యసభలో తమ బలం పెరగాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. అయితే అయోధ్యరెడ్డి ఆ పార్టీలో చేరడానికి ఇష్టపడకపోవడంతో తెలుగుదేశం పార్టీ కూడా ఆయనను చేర్చుకోవడానికి సుముఖత వ్యక్తం చేయలేదట. ఈ కారణంగా అయోధ్య రామిరెడ్డి రాజీనామా వ్యవహారం ప్రస్తుతానికి పెండింగ్‌లో పడింది. విజయసాయిరెడ్డి ఉదంతంతో రాజకీయాలు ఎంత జుగుప్సాకరంగా తయారవుతున్నాయో అర్థమవుతుంది. ఆయన రాజకీయ సన్యాసం వల్ల వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగులుతుంది. అవినీతి చేయడంలో కవలలుగా సాగిన జగన్‌రెడ్డి–విజయసాయిరెడ్డిని విడదీసి చూడలేం కనుక ఇప్పుడు విజయసాయి ఏకంగా వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యం కచ్చితంగా దెబ్బతింటుంది. జగన్‌రెడ్డి లండన్ పర్యటనలో ఉన్నప్పుడు విజయసాయి ఈ ప్రకటన చేయడం రాజకీయాల్లో అనైతికతకు నిదర్శనం. విషయం తెలుసుకున్న జగన్‌రెడ్డి రాజీనామా చేయవద్దని విజయసాయిపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ ఒత్తిడి తట్టుకోలేకపోయిన ఆయన ఎక్స్ వేదికగా శుక్రవారంనాడే తన రాజకీయ సన్యాసం గురించి ప్రకటించారు. నిజానికి శనివారంనాడు రాజ్యసభ చైర్మన్‌ను వ్యక్తిగతంగా కలసి రాజీనామా లేఖ అందజేసే వరకు ఆ విషయాన్ని రహస్యంగా ఉంచాలనుకున్నారు. ఈ పరిణామాన్ని జగన్ అనుకూల శక్తులు కనీసం ఊహించలేదు. ఈ కారణంగానే జగన్‌కు అనుకూలంగా సోషల్ మీడియాలో వీడియోలు పెట్టే పేటీఎం బ్యాచ్ విజయసాయిరెడ్డి ప్రకటన తర్వాత వెంటనే స్పందించలేదు. జగన్‌రెడ్డి నుంచి ఆదేశాల కోసం ఎదురుచూశారేమో తెలియదు. విజయసాయిరెడ్డి వంటి వాళ్లు ఇలా చేస్తే జగన్‌రెడ్డితో ఇంకా ఎవరు మిగులుతారు అన్న ప్రశ్న ఈ సందర్భంగా తలెత్తుతోంది. ఆర్థిక నేరగాడిగా జగన్‌కు ఎంత పేరుందో విజయసాయికి కూడా అంతే పేరుంది. జగన్‌పై ఉన్న కేసులు విచారణకు వచ్చి రుజువైతే విజయసాయికి కూడా శిక్ష పడుతుంది. ఆ పరిస్థితి నుంచి ఉపశమనం పొందాలంటే తాను అప్రూవర్‌గా మారడం ఒక్కటే విజయసాయిరెడ్డి ముందున్న ప్రత్యామ్నాయం. అప్రూవర్‌గా మారితే తన ప్రాణాలకే ముప్పని ఆయనకు తెలుసు. అందుకే అప్రూవర్‌గా మారి, బీజేపీలో చేరిపోయి ఎంపీగా కొనసాగలేని పరిస్థితి ఆయనకు ఏర్పడింది. బహుశా ఈ కారణంగానే రాజకీయ సన్యాసం చేయాలని భావించి ఉంటారు. సీబీఐ, ఈడీ కేసుల విషయం అటుంచితే మద్యం, ఇసుక వగైరా వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసిన కేసులు కూడా తరుముకొస్తున్నాయి. ఈ కేసుల నుంచి రక్షణ పొందడానికి ఆయన అప్రూవర్‌గా మారతారేమో తెలియదు. జగన్‌కు సంబంధించిన కేసులలో విజయసాయిరెడ్డి వంటి వాళ్లు కూడా అప్రూవర్‌గా మారే ఆలోచన చేశారంటే రాజకీయాలలో ఎవరినీ పూర్తిగా నమ్మకూడదని మరోసారి రుజువైంది. బహుశా ఈ కారణంగానే కాబోలు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎవరినీ పూర్తిగా నమ్మరు. ఈ మొత్తం ఉదంతంలో ప్రాంతీయ పార్టీలు, ముఖ్యంగా వైసీపీ, తెలుగుదేశం పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్టీ టికెట్ల కేటాయింపు, రాజ్యసభకు అభ్యర్థుల ఎంపికలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వకుండా విధేయతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తిస్తే మంచిది. తమిళనాడులో డీఎంకే పార్టీ టికెట్లు అమ్ముకోదు. అందుకే ఆ పార్టీ ఎంపీలు, నాయకులు తాము అధికారంలో ఉన్నా లేకపోయినా ఫిరాయింపులకు పాల్పడరు. తెలుగునాట ఈ పరిస్థితి లేదు. జగన్‌రెడ్డి రాజకీయాలలోకి రాకముందు కూడా తెలుగుదేశం పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోగానే పార్టీ ఫిరాయించడాన్ని చూశాం. ఇప్పుడు జగన్‌రెడ్డి పార్టీ కూడా ఈ సరసన చేరింది. రాజకీయ సన్యాసం ప్రకటించిన తర్వాత కూడా ఇటు విజయసాయికి కానీ, అటు జగన్‌రెడ్డికి కానీ సానుభూతి లభించే పరిస్థితి లేదు. అధికారాన్ని గరిష్ఠ స్థాయిలో దుర్వినియోగం చేయడమే ఇందుకు కారణం. జగన్‌రెడ్డి ముందు కుర్చీలో కూర్చోవడానికి కూడా సాహసించని విజయసాయి వంటి వాళ్లు ఇప్పుడు అదే జగన్‌రెడ్డి ప్రాధేయపడినా రాజీనామా నిర్ణయం వెనక్కు తీసుకోవడానికి నిరాకరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? జగన్‌రెడ్డికి కూడా ఇదో గుణపాఠం. అధికారాన్ని ఉపయోగించి ఎంత డబ్బు పోగేసుకున్నా మనశ్శాంతి లేనప్పుడు ఏమి ప్రయోజనం? తన ఆర్థిక నేరాల్లో భాగస్వామి అయిన విజయసాయిరెడ్డి ఇప్పుడు దూరం అవుతున్నారు. రక్తం పంచుకు పుట్టిన చెల్లి షర్మిల ఎప్పుడో దూరమైంది. రాజకీయ అధికారం ఎంత ప్రమాదకరమైనదో కదా! డబ్బు–అధికారాన్ని పంచుకోవడానికి సిద్ధపడకపోతే రక్తం పంచుకు పుట్టిన వాళ్లు కూడా శత్రువులుగా మారతారని జగన్‌రెడ్డి ఇప్పటికీ గ్రహించకపోతే అంతకంటే విషాదం ఉండదు. అధికారం ఉన్నప్పుడు అందరూ ఆప్తులుగానే కనిపిస్తారు. అధికారం–డబ్బు లేకపోతే ఒంటరివారుగా మిగిలిపోతారు.

సవాలుకు కట్టుబడకుండానే..

ఈ విషయం అలా ఉంచితే నా విషయంలో తన సవాలుకు కట్టుబడకుండానే విజయసాయిరెడ్డి అస్త్రసన్యాసం చేయడం నాకు అస్సలు నచ్చలేదు. కొంత కాలం క్రితం నాపై అవాకులూ చెవాకులూ పేలి వాంతులు చేసుకున్న విజయసాయిరెడ్డి బహిరంగ చర్చకు రావాలని నన్ను సవాలు చేశారు. నువ్వు అంతగా ముచ్చటపడితే ఎందుకు కాదంటానులే అని అందుకు సరే అన్నాను. దీనికి బదులుగా వేదిక ఢిల్లీలో ఉండాలని, అది కూడా ఫలానా ఫలానా వారి సమక్షంలో అని ఆయన షరతులు పెట్టగా అందుకు కూడా సరే అన్నాను. అయినా అటువైపు నుంచి సౌండు లేదు. ఇప్పుడేమో రాజకీయ సన్యాసం అని అంటున్నారు. ఇప్పటికైనా తాను నోరు పారేసుకున్నందుకు ఆయన క్షమాపణలు చెబుతారేమో చూద్దాం. అయినా విజయసాయిరెడ్డి వంటి వారి నుంచి విలువలను ఆశించడం అత్యాశే అవుతుంది. కాకతాళీయమే అయినా ఒకప్పటి సినిమా హీరోయిన్, డ్రగ్స్ కేసులలో అభియోగాలు ఎదుర్కొన్న మమతా కులకర్ణి శుక్రవారంనాడే సన్యాసినిగా మారిపోయారు. విజయసాయిరెడ్డి కూడా అదే రోజు తన రాజకీయ సన్యాసం నిర్ణయాన్ని ప్రకటించారు. మమతా కులకర్ణి విషయం పక్కన పెడితే విజయసాయిరెడ్డి ఇప్పటికైనా ఒక మనిషిగా పరివర్తన చెంది చేసిన పాపాలు కడుక్కొనే ప్రయత్నం చేస్తే ఆయన అస్త్రసన్యాసానికి అర్థం పరమార్థం ఉంటుంది. లేనిపక్షంలో ఆయనలో గుంట నక్క లక్షణాలు ఉన్నట్టుగానే భావించాల్సి ఉంటుంది!

> విజయసాయిరెడ్డి మాటలను రాజకీయవర్గాల్లో ఎవరూ విశ్వసించరు. భారతీయ జనతా పార్టీలో చేరడానికి సిద్ధపడినా ఆ పార్టీ ముఖ్యులు ఆయనను సీరియస్‌గా తీసుకోలేదు. అయినా కనపడిన వారినందరినీ కలసి జగన్‌రెడ్డితో తాను ఇక ప్రయాణం చేయలేనని ఆయన వాపోతూ వచ్చారు. వాస్తవానికి వైఎస్ రాజశేఖరరెడ్డితో విజయసాయికి పరిచయం ఏర్పడిన నాటి నుంచి ఆ కుటుంబానికి విధేయుడిగా ఆయన ఉండిపోయారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆడిటర్‌గా తన తెలివితేటలను ఉపయోగించి క్విడ్ ప్రో కోకు తెర లేపారు. జగన్‌రెడ్డితో అనతికాలంలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మింపజేశారు. ఈ క్రమంలోనే ఒక చార్టెడ్ ఎకౌంటెంట్‌గా విజయసాయి అనైతికంగా వ్యవహరించినందున ఆయన సర్టిఫికెట్‌ను ఎందుకు రద్దు చేయకూడదు అంటూ చార్టెడ్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చెన్నై విభాగం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై కూడా ఆయన హైకోర్టులో స్టే పొందారు.

"మంచి శిక్షణ గల కళ్లు, చెవులూ వుంటే మనకదే చాలు. సువిశాల కళా ప్రపంచాన్ని చాప చుట్టి పరచినట్టు పరుస్తాయవి. శ్రద్ధాళువు లయిన కళ్లు సాధారణ తర్కానికి, కాలానికీ అతీతమయిన కళా రహస్యాలను బోధించి పెట్టగలవు".

చిన్న అద్దంలో పెద్దాయన

> కొండపల్లి శేషగిరిరావు తమ స్వీయ శైలిలో ఎక్కువ భాగం పురాణేతిహాసాల ప్రధానాంశాలనే వెదికి పెద్ద పెద్ద కేన్వాస్‌లు నింపారు. కణ్వాశ్రమం, అక్కడి తీవలు, ప్రాచీన వృక్షాలు, రామలక్ష్మణులు, బండబారిన అహల్య, పరిసర వాతావరణం, మధ్య యుగ యోగులు వేటికవి అనర్గళ వ్యాఖ్యల్లా వెలుగు చూపెడతాయి.

పై మాటలు అన్నది ప్రముఖ చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు. అప్పట్లో పెద్దాయనను నాలుగయిదుసార్లు కలిసి అనేక గంటలు గడిపాను. అప్పుడు ఆయన తమ పెయింటింగ్‌లను చూపెడుతూ చెప్పిన ముక్కలను చెవికెక్కించుకున్నాను. అలా ఆయన్ను చెవి పెట్టి వినడం వలన చిత్రకళలోని సత్సంప్రదాయం ఒకటి మనకు బోధపడుతుందని, దాని పై స్థాయి చేరదలచే వారికి సన్మార్గం సుగమం అవుతుందని కూడా అర్థమయింది. చిత్ర, శిల్ప కళలపై ఆయనకు మహగట్టి అవగాహన, అధ్యయనం విస్తృత పర్యటనల వల్ల ఏర్పడ్డవి. ఆ కాలంలో అజంతా చిత్రాల ముందు ఆయన అలా నిలబడి ఆ బొమ్మలు గీయడం, ఎలిఫెంటా తదితర ప్రాంతాల్లో శిల్పాలను తదేకంగా పరిశీలించడం, వాటి ఆగమ, మర్మాలు నోట్స్ రాసుకోవడం వంటి ఎన్నెన్నో విశేష వివరాలు ధారాపాతంగా చెప్పుకొచ్చారు. వింటుంటే అవన్నీ ఆయనతో నేనూ తిరిగొచ్చినట్టయింది. వివిధ కాలాల, రకరకాల చిత్ర కళా ఖండాల విశేషాలతో పాటు సమకాలీన చిత్ర కళా ప్రదర్శనల ప్రసక్తి వివరంగానే తెచ్చారాయన. వాటిపై ఆయన అభిప్రాయాలూ వ్యాఖ్యలూ మనకి గుచ్చుకోవు, గుర్తెరిగేలా, గుచ్చి గుచ్చి పునః పరిశీలించేలా చేస్తాయి. అదంతా సద్విమర్శ అంతే. కొండపల్లి వంటి పెద్దలు తీరా వెళ్లిపోయే వరకు ఉపేక్షించి ఆనక– అరెరె! అటువంటి పెద్దలను మరింత వినివుంటే మన టూరిస్టు శ్రమ కొంత తగ్గేదని నొచ్చుకున్న వారున్నారు. అదీ ఆయన విద్వత్తు.

కొండపల్లి వారి ఇంటి మేడ మీద గది ఒక చిన్న మ్యూజియం, గ్రంథాలయం. అందులో చిన్న కుర్రాడి లాగ గంపెడు ఉత్సాహంతో చెప్పే ఆయన మాటల తీరుతోపాటు ఆయన చక్కని ముక్కు, దానికి అడపా దడపా అంటించే దిక్కుమాలిన ముక్కుపొడి, తెల్ల తామర వంటి చేతులు, పొడవాటి వేళ్ల, అవి పుట్టించిన పెయింటింగ్‌లతో పాటు చూడబుద్ధేస్తాయి. చంద్రుడు సరే, చూపెట్టే వేలునీ చూసిన వైనం ఇక్కడ సత్సందర్శనమే.

కొండపల్లి వారు శాంతినికేతన్ విద్యార్థి దశ నుంచి, హైదరాబాద్‌లో చిత్ర కళ అధ్యాపకులుగా వెలిగిన దశ దాకా చేసిన డ్రాయింగ్‌లు, వాటర్ కలర్, వాష్ పనితనం చూస్తే మన మనసు గనిలో అపురూపాలేవో దొరికినట్టనిపిస్తాయి. నాటి బెంగాలీ శైలిలో చుట్టుకుపోకుండా వున్నారు గానీ ఆయన ఆధునిక కళా శైలిలోకి మాత్రం దిగిపోలేదు. అలాగని కొద్దిపాటి ఆ ధోరణి చిత్రాలూ చేయకపోలేదు.

తమ స్వీయ శైలిలో ఎక్కువ భాగం పురాణేతిహాసాల ప్రధానాంశాలనే వెదికి పెద్ద పెద్ద కేన్వాస్‌లు నింపారాయన. ఉత్తరాది మినియేచర్‌లను పరిశీలనకే పరిమితం చేసి తన కంపోజిషన్‌కు ఎక్కువ విలువ ఇచ్చారు. కణ్వాశ్రమం, అక్కడి



తీవలు, ప్రాచీన వృక్షాలు, రామలక్ష్మణులు, బండబారిన అహల్య, పరిసర వాతావరణం, మధ్య యుగ యోగులు వేటికవి అనర్గళ వ్యాఖ్యల్లా వెలుగు చూపెడతాయి. ఆ పెయింటింగ్‌లన్నీ శ్రద్ధగా జాగ్రత్త చేసి అచ్చు వేయించే కృషిలో వున్నారు వారి అబ్బాయి వేణుగోపాలరావు గారు. పెయింటింగ్సే గాక కొండపల్లి వారి మ్యూరల్స్ కూడా ఆయన మార్కు ప్రత్యేకత చూపెడతారు. మొగల్, దక్కనీ, వనపర్తి వంటి మార్గాల్లో ప్రాంతీయ కళాకారులు చేసిన ప్రక్రియలన్నీ ఆయన ఎంతో ఇష్టంగా చెప్పుకొస్తారు. కానీ వాటిని ఇప్పటి కమర్షియల్ వినియోగ మార్గంలోకి మార్చుకుని ప్రయోజనం పొందాలని చూడలేదాయన. వాటి బదులు దక్కనీ కొండ బండరాళ్లు, కాకతీయ నందిలోని నగిషీ అలంకారాలూ తమ నల్లని ఇంకు రేఖల సందడిలోకి తెచ్చి చూపెట్టారు. ఆక్వా టెక్చర్ – నీరు, గంజి, రంగులు కలగలిపిన పనితనంతో కాగితం మీద 'దించారు'. అలాగే కాకతీయ శిల్ప ప్రత్యేకతల్లో ప్రధానమైన నందిపై కనిపించే వివిధ రకాల తాళ్ల ముడి, వాటి సూత్రంలో డిజైన్స్ రంగుల సంబరాన్ని అధిగమించే నలుపు గీతల్లో భలే గీసారాయన. అవి పుస్తకంగా అచ్చులో ఉన్నాయి. చిత్ర కళా విద్యార్థులకు, పరిశోధకులకు అవన్నీ మహాగ్రంథాల పఠనీయాంశాల వంటివి.

ఇంక చైనీయ శైలిలో రైస్ పేపర్ మీద వచ్చే ముచ్చటను మన కాగితంపై ముద్దొచ్చేలా ఆ పూలు, పళ్లు, తీవలు, కొండల దొంతరలు, కోళ్లు, కోతులూ వేసేరు కొండపల్లి వారు. మహానాజూగ్గా వుంటాయవి. చివరికి వాటిపై ఆయన సంతకం కూడా చైనీయ శైలిలో చూడముచ్చటేస్తుంది.

వేరే చెప్పనవసరం లేకుండా– పెద్దాయనకు గొప్ప అవార్డులు వచ్చి చేరాయి. సాలార్ జంగ్ మ్యూజియం, పిట్స్‌బర్గ్ వెంకటేశ్వరాలయం, వాషింగ్టన్‌లో భారత రాయబార కార్యాలయం వంటి ప్రముఖ స్థలాల్లో కొండపల్లి వారి బొమ్మలున్నాయి. కంటికి వెలుగులా ఆకర్షిస్తున్నాయవి. వెళ్లి చూడవచ్చు.

మనసు పెడితే, పడితే ప్రభుత్వం కొండపల్లి వంటి మహామహుల చిత్రాలను అనేకానేక మార్గాల్లో అచ్చువేసి ప్రచారం చేస్తే పోయేదేమీ లేదు. మంచి పేరు రావడం తప్ప.

• శివాజీ తల్లావజ్ఝల

(రేపు కొండపల్లి శేషగిరావు శతజయంత్యుత్సవాల ముగింపు)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
ఆదివారం 26 జనవరి 2025

రహదారి భద్రత అందరి బాధ్యత

అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి సురేఖ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మట్టెవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత అందరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి ఎంజీఎం వరకు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి కొండా సురేఖ, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు రహదారి భద్రత నిబంధనలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. సీపీ అంబర్ కిశోర్‌ఝా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ బి.నందిరాంనాయక్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఎంజీఎం సూపరింటెండెంట్ మొగిళి, నెహ్రూ యువ కేంద్ర అధికారి అన్వేష్, వరంగల్ మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపిరెడ్డి, సీఐ షుకుర్, పోలీసు శాఖ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, ప్రవీణ్, చిలువేరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చిన్ననాటి నుంచే అణగారిన వర్గాల హక్కుల సాధనపై తపన

తొలుత సామాజిక కార్యకర్తగా.. ఆ తర్వాత ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడిగా..

మాదిగ ఉద్యమ నేతకు పద్మశ్రీ

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అవార్డుకు మంద కృష్ణమాదిగ ఎంపిక


మాదిగ దండోర విశ్వరూప సభలో భావోద్వేగానికి గురైన మందకృష్ణను హత్తుకున్న ప్రధాని నరేంద్ర మోదీ (ఫైల్)

- అనేక ప్రజా పోరాటాలకు ఆధ్యుడిగా నిలిచిన దళిత నాయకుడు
- దండోరా, పలు మానవీయ ఉద్యమాలతో కొత్త స్ఫూర్తి
- రాజకీయంగానూ క్రియాశీలక పాత్ర

హనుమకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఉద్యమ నాయకుడిగా, మానవీయ పోరాటాలకు ఆద్యుడిగా పేరున్న.. మాదిగల ఆత్మగౌరవం, రిజర్వేషన్ల సాధన కోసం పోరాడుతున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అత్యంత ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రజావ్యవహారాల కేటగిరీలో రాష్ట్రం నుంచి ఆయనకు ఈ పురస్కారం దక్కింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుల్లో ఏడుగురు తెలుగువారు ఎంపికవగా వారిలో మంద కృష్ణ ఒకరు. కృష్ణమాదిగ హనుమకొండ జిల్లా హంటర్ రోడ్డులోని న్యూశాయంపేటలో 1965లో జన్మించారు. తండ్రి పేరు కొమురయ్య, తల్లి కొమురమ్మ. భార్య జ్యోతి, ముగ్గురు సంతానం. ఒక కూతురు, ఇద్దరు కుమారులుండగా.. కూతురు వైద్యురాలు. కృష్ణమాదిగ బాల్యమంతా మిగతా 7వ పేజీలో..

- రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా స్కీమ్‌లు ప్రారంభం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,717గ్రామాల్లో 3,18,338 దరఖాస్తులు
- అత్యధికంగా రేషన్‌కార్డుల కోసం 1,49,478మంది అర్జీలు
- ప్రతీ మండలం నుంచి ఒక గ్రామం చొప్పున ఎంపిక
- ఆ గ్రామంలో నూరుశాతం పథకాలు అమలుకు కార్యాచరణ
- ఫిబ్రవరి ఒకటి నుంచి మార్చి చివరినాటికి అర్హులందరికీ అందేలా చర్యలు



చార్ ధమాకా..!

నేడు నాలుగు కొత్త పథకాలకు ప్రభుత్వం శ్రీకారం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కొత్త సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. తద్వారా గణతంత్ర దినోత్సవ కానుకగా ప్రజలకు 'చార్ ధమాకా' ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాల అమలుకు కార్యాచరణ రూపొందించింది. తొలుత ప్రతీ మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి.. ఆ గ్రామంలో ఈ నాలుగు పథకాలను నూరుశాతం అమలు చేసేలా కసరత్తు చేసింది. అయితే ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,717 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా.. నాలుగు పథకాల కోసం 3,18,338 మంది దరఖాస్తులు చేస్తున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి మార్చి చివరినాటికి అర్హులందరికీ కొత్త పథకాలను అందించనున్నారు. దీంతో పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలతో పాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా దక్కుతుందని భావిస్తున్న పేదల ఆశలు నెరవేరనున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్ 7

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి
- పర్యవేక్షించిన రెవెన్యూ యంత్రాంగం
- ఏఆర్ పోలీసుల ఆధ్వర్యంలో కవాతుకు సిద్ధం
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న కలెక్టర్ ప్రావీణ్య


గణతంత్ర వేడుకలకు ముస్తాబైన పరేడ్‌గ్రౌండ్

వరంగల్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌ను అధికారులు ముస్తాబు చేశారు. వేడుకల సందర్భంగా పోలీసు కవాతు నిర్వహించేందుకు ఏఆర్ అదనపు డీసీపీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను సిద్ధం చేశారు. మార్చ్‌ఫాస్ట్ నిర్వహణ కోసం ఎర్రమట్టితో ప్రత్యేక ట్రాక్ పోశారు. మార్చ్‌ఫాస్ట్ చేసేందుకు ఆరు ప్లాటూన్‌లతో అడ్మిన్ ఆర్ఐ స్పర్జన్‌రాజ్ ఆధ్వర్యంలో సాధన చేశారు. ఈస్ట్‌జోన్‌లో జరిగే పరేడ్‌కు ఆర్ఐ శ్రీధర్, వెస్ట్‌జోన్‌లో నిర్వహించే పరేడ్‌కు హోంగార్డు ఆర్ఐ చంద్రశేఖర్, సెంట్రల్‌జోన్ స్పర్జన్‌రాజు కమాండర్‌గా వ్యవహరించనున్నారు. సంఘ విద్రోహశక్తుల నుంచి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు గ్రౌండ్ నలువైపులా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తుకు ముందస్తు చర్యలు చేపట్టారు. సందర్శకులు, అతిథులు కూర్చొనేందుకు వీలుగా షామియానాలు, స్నాక్స్, మంచినీరు ఇతర ఏర్పాట్లను హనుమకొండ ఆర్ఐ దశరథం, ఏఆర్ఐ శరత్ దగ్గరుండి పర్యవేక్షించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్టాల్స్ కోసం గ్రౌండ్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఎదుట స్టేజీకి ఎడమ వైపు షామియానాలు ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వశాఖల పనితీరును వివరించేవిధంగా ప్రత్యేకంగా శకటాలు ఆకర్షించనున్నాయి. ఉదయం 9గంటలకే గణతంత్ర వే డుకలకు ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ హాజరై జెండావిష్కరించి జిల్లాలో జరిగిన అభివృద్ధిపై ప్రసంగించనున్నారు.

కార్యక్రమ వివరాలు

- 9 గంటలకు కలెక్టర్ చేతుల మీదుగా జాతీయ జెండావిష్కరణ
- 9 నుంచి 9.05 వరకు గార్డ్ ఆఫ్ హానర్ తనిఖీ
- 9.05 నుంచి 9.20 వరకు మార్చ్ ఫాస్ట్
- 9.20 నుంచి 9.35 హనుమకొండ జిల్లాలోని అభివృద్ధిపై ప్రసంగం
- 9.40 నుంచి 9.50 స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం
- 9.50 నుంచి 10.10 సాంస్కృతిక కార్యక్రమాలు
- 10.10 నుంచి 10.30 అవార్డుల పంపిణీ
- సాయంత్రం 5 నుంచి 6 వరకు ఐడీఓసీలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి

- కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. అరాచక పాలన..
- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే గ్రామ సభలు
- గ్రామ సభలలో తిరుగుబాటు చేస్తున్న ప్రజలు
- పోలీసులు తప్పుడు కేసులు పెడితే వదిలిపెట్టం..
- మీడియాతో ఎర్రబెల్లి దయాకర్‌రావు

7

రానున్న రోజుల్లో బీఆర్ఎస్ భూస్థాపితం

పదేళ్లలో ఆ నాయకులు ఒక్క హామీ నెరవేర్చలేదు..


హనుమకొండ డీసీసీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

- ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదం
- రానున్న ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే పట్టం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

దామోదర్ క్షేమంగానే ఉన్నాడు..

మావోయిస్టు పార్టీ సౌత్ జోనల్ ప్రతినిధి సోమతేర్ సమత

ఏటూరునాగారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ క్షేమంగానే ఉన్నాడని ఆ పార్టీ ప్రకటించింది. మావోయిస్టు సౌత్ జోనల్ ప్రతినిధి సోమతేర్ అలియాస్ సమత పేరుతో మీడియాకు ఈ మేరకు శనివారం సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. 2025 జనవరి 16, 17 తేదీల్లో 8 వేల మంది పోలీసు బలగాలతో బీజాపూర్ జిల్లాలోని సింగవరం, తుండెపల్లి, మల్లంపెంట, పూజారి కంకేర్, తేమ ల్బట్టి గ్రామాల ప్రజలపై పిరికిపంద దాడులు జరిగాయని పేర్కొన్నారు. ఈ దాడుల్లో 8 మంది మావోయిస్టులు అమరులయ్యారని తెలిపారు. అమరులైన మావోయిస్టులకు పార్టీ నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అమరులైన వారి ఆశయాలను సాధించుకుంటామని తెలిపారు. ప్రజల్లో అయోమయం, నైరాశ్యం సృష్టించేందుకే పోలీసులు తమ పార్టీ పేరుతో నకిలీ స్టేట్‌మెంట్లు ఇచ్చారని విమర్శించారు. మావోయిస్టు తెలంగాణ కార్యదర్శి దామోదర్‌తో పాటు ఇతర సహచరులు క్షేమంగానే ఉన్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ పేరుతో నకిలీ లేఖలను సృష్టించే వారిని గుర్తించి, స్వతంత్ర విచారణ జరిపి ద్రోహులను కఠినంగా శిక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివాసీ నేతలు, జర్నలిస్టులు, మేధావులు, ప్రతిపక్ష పార్టీలు ఈ మారణకాండపై విచారణ జరిపి వెంటనే నిజానిజాలను నిగ్గుతేల్చాలని నంబర్ వన్ ద్రోహి, తీవ్రవాద, కార్పొరేట్ భక్త ఫాసిస్ట్ బీజేపీని పూర్తిగా పాతర పెడతామని పేర్కొన్నారు. కార్పొరేటీకరణ- సైనికీకరణ కగార్ పోరుకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోరాడి అసువులు బాసిన అమరుల త్యాగాలు వృథా కావని, పోలీసుల నిత్తుటి బాకీ తీర్చుకుంటామని హెచ్చరించారు.

చీటింగ్ కేసులో బీఆర్ఎస్ నేత రిమాండ్

చిలుపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డికి రిమాండ్ విధించినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం ఎస్ఐ కథనం ప్రకారం... శ్రీపతిపల్లికి చెందిన కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి తన పేరిట ఉన్న 17 ఎకరాల భూమిని 2019లో సిద్ధిపేట జిల్లా చేర్యాలకు చెందిన పెద్ది రమేష్‌కు విక్రయించి డబ్బులు తీసుకున్నాడు. అదే భూమిని తిరిగి ధరణి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ద్వారా మరో వ్యక్తికి 2022 సంవత్సరంలో విక్రయించాడు. బాధితుడు పెద్ది రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనోజ్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రఘునాథపల్లిలో పట్టపగలే చోరీ



దుండగులు ఇంటి తాళం పగులగొట్టి తెరిచిన బీరువా

రఘునాథపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇంటి తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని లూర్థు మాతా చర్చి పక్కన ఉన్న మేకల సోమిరెడ్డి ఇంటి తాళం పగులగొట్టి దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.30వేల నగదుతో పాటు భూమి పత్రాలను దొంగిలించారు. మేకల సోమిరెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పటులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

సంఘటిత కృషితోనే డ్రగ్స్ నిర్మూలన

● ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి రమేష్‌బాబు ● వరంగల్ నిట్‌లో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం ● పెద్దసంఖ్యలో హాజరైన విద్యార్థులు ● డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ

హనుమకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలంతా సంఘటితంగా కృషి చేయాలని ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి, హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్ సీహెచ్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. వరంగల్ నిట్‌లో శనివారం డ్రగ్ దుర్వినియోగం-రాష్ట్రంలో డిఅడిక్షన్ విధానాలపై అవగాహన కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువత వాటికి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతను ఈ కార్యక్రమంలో వక్తలు నొక్కి చెప్పారు. రాష్ట్రంలో డీఅడిక్షన్‌కు అనుసరిస్తున్న విధానాలను వివరించారు. హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ, వరంగల్ ఎన్ఐటీ నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్), ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వల్ల జీవితాలు చిన్నాభిన్నమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వినియోగం వల్ల



వరంగల్ నిట్‌లో డ్రగ్స్ నిర్మూలనపై జరిగిన అవగాహన కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు

ఎదురయ్యే సమస్యల పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. యువతను డ్రగ్స్ నుంచి దూరంగా ఉంచడానికి అందరు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా, తమ కెరీర్‌ను నాశనం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని ఉద్బోధించారు. ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుద్ధి మాట్లాడుతూ.. నిట్ క్యాంపస్‌లో డ్రగ్స్‌కు, ర్యాగింగ్‌కు ఏమాత్రం ఆస్కారం లేదని అన్నారు. ఈ రెండు చెడు వ్యవసనాల గురించి విద్యార్థులకు ఎప్పటికప్పుడు తగిన అవగాహన కలిగిస్తున్నామని అన్నారు. అనంతరం విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి బాధ్యతగల పౌరులుగా జీవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ, నార్కోటిక్స్ విభాగం, హనుమకొండ పోలీసు అధికారులు సమన్వయం చేశారు. కార్యక్రమానికి జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి క్షమ దేశ్‌పాండే పర్యవేక్షించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్‌బాబు, హనుమకొండ అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, నిట్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, నార్కోటిక్స్ విభాగం డీఎస్పీ సైదులు పాల్గొన్నారు. వరంగల్ నిట్, శివాని జూనియర్ కాలేజ్, యూనివర్సిటీ లా కాలేజ్, ఎస్వీఎస్ విద్యా సంస్థలు, న్యూసైన్స్ డిగ్రీ కాలేజ్, వాగ్దేవి డిగ్రీ, పీజీ కాలేజ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఆదర్శ కాలేజ్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు హాజరయ్యారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

ఘనంగా ఏకశిల విద్యాసంస్థల వార్షికోత్సవం



ఏకశిల పాఠశాలలో సరస్వతి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యేలు నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి

ఐనవోలు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉద్బోధించారు. ఏకశిల విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు శనివారం పున్నేలు ఏకశిల ఈ టెక్నో పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, గౌరవ అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందన్నారు. నేటి విద్యార్థులు రేపటి నాయకులు, విద్యావత్తులు, శాస్త్రవేత్తలు, అవిష్కకరణకర్తలుగా ఎదుగాలన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్యం చాలా అమూల్యమైనదని, మంచి అలవాట్లు సత్ప్రవర్తన కలిగిన భారత పౌరుడిగా దేశానికి సేవ చేసే దిశగా అడుగులు వేయాలని హితవు పలికారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిల విద్యాసంస్థలు విద్యార్థులు మంచి ఫలితాలతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ఎతికల్ కెరీర్ గైడెన్స్ చైర్మన్ జి.శివప్రసాద్, తేజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరక్టర్ వీవీ రమణ రెడ్డి, ప్రిన్సిపాల్ మహ్మద్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ కె.రవి కిరణ్, కె.భిక్షపతి, టి.దీపక్, ఎ.లవకుమార్, వి.మణికుమార్, అకాడమిక్ ఇన్‌చార్జ్ కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు, నాయకులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రవీంద్రశర్మ

జనగామ కల్చరల్, జనవరి 25(ఆంధ్ర జ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ అన్నారు. శనివారం జనగామ జిల్లా సబ్‌జైలులో ఖైదీల హక్కులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి రవీంద్రశర్మ ముఖ్య అతిథిగా హాజరై మాహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత ఇంకొకసారి తప్పు చేయరాదన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఖైదీలకు ఉచితంగా న్యాయవాదులను నియమిస్తా మన్నారు. పైసా ఖర్చు లేకుండా విడుదల కావచ్చు న్నారు. రాజీపడతగ్గ కేసులను ఎక్కువ కాలం తీసుకోకుండా విడుదల చేస్తున్నామన్నారు. లీగల్ అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహించడం, ఖైదీలను చైతన్యవంతం చేయడం, వారిలో నేరప్రవృత్తి లేకుండా చేయడం, ఫుడ్ సరిగ్గా ఉందా లేదా పరిశీలించడం, ప్రతి కేసులో న్యాయవాది ఉన్నాడా అని తెలుసుకోవడం లాంటి పనులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్నామని, ఖైదీలు సంస్థ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రిపబ్లిక్‌డే సందర్భంగా కోర్టు సిబ్బందికి క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, ఎం.రవీంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.శశి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప, జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుకు దరఖాస్తు చేయలేదు..

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తాను కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేయలేదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడారు. రేషన్‌కార్డు దరఖాస్తుదారుల జాబితాలో తన పేరు ఎందుకు చేర్చారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జవాబు చెప్పాలని కోరారు. తన పేరు తనకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం నుంచి, జిల్లా, మండల, గ్రామ అధికారులకు ఎలా చేరిందో సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాక, తాను రేషన్ కార్డుకు దరఖాస్తు చేసినట్లు సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం సరైంది కాదని తెలియజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు మెయిల్ ద్వారా రాత పూర్వక ఫిర్యాదు పంపినట్టు తెలిపారు. ఈసమావేశంలో నాయకులు బానోతు సారంగపాణి, ఊడుగుల ప్రవీణ్, నట్ల శ్రీనివాస్, జన్ను జయరావు, కాత్యం శ్రీనివాస్, కస్తూరి రవీందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాకాలను సందర్శించిన పీసీసీఎఫ్ డోబ్రియాల్



పాకాలలో చేపట్టిన అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ డోబ్రియాల్

ఖానాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సును శనివారం తెలంగాణ అటవీ శాఖ ప్రధాన కార్యాలయ అధికారి (పీసీసీఎఫ్) డోబ్రియాల్ సందర్శించారు. ఈ సందర్భంగా పాకాలలో ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాకాల బయోడైవర్సిటీ పార్క్, బోటింగ్ పాయింట్, పాకాల తూములను, అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. సరస్సులో బోటు షికారు చేశారు. పాకాలలో పర్యాటక పరంగా చేపట్టిన అభివృద్ధి పనులు, అడవులు, వన్యప్రాణుల సంరక్షణ తదితర విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకాలను సందర్శించే పర్యాటకులకు ట్రెక్కింగ్ సౌకర్యం కల్పించాలని, జంగిల్ సఫారీ, పాకాల నుంచి భీమునిపాదం వాటర్ ఫాల్స్ మీదుగా పులిమడుగు తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా పాకాలను అభివృద్ధి చేయాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ప్రకృతికి హానిచేయకుండా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ భీమానాయక్, వరంగల్, మహబూబాబాద్ డీఎఫ్‌వోలు అనూజ్ అగ్రవాల్, విశాల్, ఎఫ్ఆర్వో రవికిరణ్, డీఆర్వో రీణా, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు

● రూ.34లక్షల 84 వేల అసలు కరెన్సీ, రూ.21 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం ● వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అసలు నోట్లు ఇస్తే.. నాలుగింతలు నకిలీ నోట్లు ఇస్తామని నకిలీ నోట్ల వ్యాపారం చేస్తున్న 8 మంది ముఠా సభ్యులను కేయూ పోలీసులు అరెస్టు చేసి రూ.34లక్షల 84 వేల అసలు కరెన్సీతో పాటు రూ.21 లక్షల నకిలీ నోట్లు, కారు, ఆటో, 9సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు మణికాల కృష్ణ గొర్రెల వ్యాపారం నిర్వహించేవాడు. వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించేందుకు ప్రణాళిక రూపొందించాడు. ఈ క్రమంలోనే తనకు అడవిలో డబ్బులతో ఉన్న డ్రమ్ము దొరికిందని, అందులోని డబ్బులు వినియోగిస్తే తనకు మంచి జరగదని, తనకు ఎవరైనా రూ.లక్ష ఇస్తే వారికి డ్రమ్ములోని రెండింతలు డబ్బులు ఇస్తానని, ఒక లక్ష ఇస్తే నాలుగు రెట్లు నకిలీనోట్లు ఇస్తానని నమ్మించేవాడు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా కేశవాపూర్‌కు చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్‌కు పాల్వంచ అడవిలో అసలు, నకిలీ నోట్లతో భద్రపరిచిన డ్రమ్మును చూపించి అందులో నుంచి అసలు రూ.500 నోటు తీసి చూపించడంతో నమ్మాడు. ఆపై రూ.10లక్షల అసలు నోట్లకుగానూ ఇరవై లక్షలు, అలాగే రూ.ఐదు లక్షల అసలు నోట్లకు రూ.20 లక్షల నకిలీ నోట్లు మార్పిడీ చేసుకునేందుకు ఇద్దరి మధ్య అంగీకారం కుదుర్చుకున్నారు. డబ్బును హనుమకొండకు తీసుకొచ్చి ఇస్తేనే తీసుకుంటానని శ్రీనివాస్ చెప్పడంతో ప్రధాన నిందితుడు అంగీకరించాడు. ఈ క్రమంలో శుక్రవారం మణికాల కృష్ణ కారులో డబ్బు తీసుకొని వచ్చి ఓఆర్ఆర్ రోడ్డులోని



వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

పెగడపల్లి క్రాస్ వద్ద శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులకు డబ్బులు అందిస్తుడటంతో పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రధాన నిందితుడితో కారులో వచ్చిన కర్నూలుకు చెందిన బిజిని వేముల వెంకటయ్య, బూర్గంపాడు మండలం నక్రీపేట తండాకు చెందిన ధరంసోతు శ్రీను, తేజావత్ శివ, ముకమామిడికి చెందిన గుగులోతు వీరన్న, కేశవపూర్‌కు చెందిన ఉడుత మల్లేశ్, ఎర్రగొల్ల అజయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ప్రధాన నిందితుడు కృష్ణ గతంలో ఇదే తరహాలో నకిలీ నోట్లను విక్రయించడంతో సత్తుపల్లి, వి.యం. బంజర, లక్ష్మీదేవిపేట పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సీపీ అంబర్ కిషోర్ ఝా నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ రవికుమార్, ఎస్సై మాధవ్, హెడ్‌కానిస్టేబుల్ నర్సింగ్‌రావు, కానిస్టేబుళ్ల శ్యాంరాజు, సంజీవ్, సంపత్, హోంగార్డు రాజేందర్ పాల్గొన్నారు.



పొగ మంచు అందాలు


శీతాకాలం తెల్లవారుజామున.. మంచుకురిసే వేళ.. ప్రకృతి అందాలు రెట్టింపవుతాయి. ఓ వైపు కవి ్మన పొగమంచు.. మరోవైపు పూవులను, సాలెగూళ్లను పట్టిన మంచు బిందువులు కనుల వి ందు చేస్తుంటాయి. శనివారం తెల్లవారు జామున వడ్డేపల్లి చెరువు సమీపంలో ఇదిగో ఇలా ప్రకృతి రమణీయ దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

ఫోటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటో గ్రాఫర్, హనుమకొండ









నీటి బిందువులతో సాలె గూడు

ప్రజలను మోసగిస్తున్న రేవంత్ సర్కార్

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే గ్రామ సభలు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, వినయ్‌భాస్కర్, నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో గ్రామసభలలో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధ్వజమెత్తారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన అని, పేదలకు సంక్షేమ పథకాలు అని మాయమాటలు చెప్పి.. కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరాచక, పోలీస్ పాలన చేస్తున్నాడన్నారు. గ్రామసభలలో రైతులు రుణమాఫీ కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని విమర్శించారు. దావోస్, సింగపూర్ పోయి సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష కోట్లు తీసుకువస్తున్నట్లు చెబుతున్నారని, ఒక్క రూపాయి కూడా తేలేదని విమర్శించారు. రాష్ట్రంలో పోలీసులను పార్టీ కార్యకర్తలుగా వాడుకుంటున్నారని, వారితో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ఎర్రబెల్లి ఆరోపించారు. రాష్టంలో మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పోలీసు అధికారులు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. తప్పుడు కేసులు పెట్టిన పోలీసులను వదిలిపెట్టమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోసమే గ్రామసభల పేరుతో హడావుడి చేస్తోందని, అధికారులు వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రజాపాలన గ్రామ సభలలో ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీశారని, ఎక్కడ కూడా గ్రామసభలు విజయవంతం కాలేదని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఇప్పటివరకు 409మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ ఆత్మహత్యలకు సీఎం రేవంత్‌రెడ్డే కారణమన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొనకుండా క్రికెట్ పోటీలలో పాల్గొంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 40శాతానికి మించి రుణమాఫీ కాలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వందల మంది పోలీసులతో గ్రామ సభలు నిర్వహించారని విమర్శించారు. గ్రామసభలో ఒక్క లబ్ధిదారుడిని ఎంపిక చేయలేదన్నారు. నర్సంపేటలో పోలీస్‌స్టేషన్ ఎదుట మాజీ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ అనుచరులు దాడి చేస్తే పోలీసులు బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు.

ఎమ్మెల్యేలకు 2ప్లస్ 2 ఏకే 47 తుపాకులు ఎందుకు ఇచ్చారని, ప్రజాక్షేత్రంలో ఏకే47లతో తిరుగుతూ ప్రజ లను భయభ్రంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్నారు. రాజకీ య ఒత్తిడితోనే కేసులు పెడుతున్నారని, సీపీ అంబర్ కిషోర్‌ఝా కేసులపై సమీక్ష చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామసభల పేరిట, దరఖాస్తులు, సర్వేలతో ప్రభుత్వం కాలయాపన చేస్తోం దన్నారు. సంక్షేమ పథకాలు అడిగితే దాడులు చేస్తారా? అని ప్రభుత్వాన్ని విమర్శించారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎవ్వరిని తరిమికొడతారో చూద్దామని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ గుమస్తాలను పెట్టుకొని పాలన చేస్తు న్నారన్నారు. నగరంలో అభివృద్ధి ఆగి పోయిందని, గతంలో తీసుకువచ్చిన అభివృద్ధి కార్యక్రమాలకే కొబ్బరికాయలు కొట్టి కొండా సురేఖ ప్రజాపాలన అని చెప్పుకుంటున్నారన్నారు. కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, రాష్ట్ర రైతు రుణవిమోచన కమీషన్ మాజీ ఛైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యమ నేతకు పద్మశ్రీ

(5వ పేజీ తరువాయి)

వరంగల్‌లోనే గడిచింది. ప్రాథమిక విద్య న్యూశాయంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో సాగగా, పదోతరగతి, ఇంటర్ హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జూనియర్ కళశాలలో చేశారు.

అణగారిన వర్గాల కోసం..

మంద కృష్ణమాదిగ మొదట పీపుల్స్‌వార్ పార్టీ సానుభూతి పరుడిగా పని చేశారు. చిన్నతనం నుంచే అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే తత్వం ఉన్న ఆయన పీపుల్స్‌వార్‌లో చేరి కొంత కాలం సీవోగా పని చేసి అరెస్టయ్యారు. నక్సల్స్ సానుభూతి పరుడైప్పటికీ ఆయన ఆ తర్వాత కాలంలో చట్టపరమైన మార్గాల ద్వారా అట్టడుగు దళిత వర్గాల హక్కులను సాధించేందుకు తీవ్రవాదాన్ని విడిచిపెట్టారు. తర్వాత చదువుకు స్వస్తి చెప్పి పూర్తిగా సామాజిక కార్యకర్తగా పలు ప్రజా ఉద్యమాల్లో మరింత చురుకుగా పాల్గొనడం ప్రారంభించారు. రిజర్వేషన్ల అమలులో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలుగా ఉద్యమిస్తున్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావం:

1994 జులై 7న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మాదిగ దండోరా నినాదంతో కృష్ణమాదిగ నేతృత్వంలో మొదట 20 మంది యువకులతో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భవించింది. ఎస్సీ రిజర్వేషన్లను ఎస్సీ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం విభజించి దళితుల్లో అత్యధికంగా వెనుకబడి కులాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో దండోర ఉద్యమం కృష్ణమాదిగ నాయకత్వంలో ముందుకు సాగింది. అణగారిన కులాల ఆత్మగౌరవం, సమన్యాయం డిమాండ్‌తో బయలుదేరిన దండోరా ఉద్యమం అనతి కాలంలోనే నాటి ఉమ్మడి రాష్ట్రంలో బలమైన ఉద్యమ సంస్థగా ఎదిగి.. అణగారిన కులాల గొంతుకగా నిలిచింది. దండోరా ఉద్యమం ఇచ్చిన స్ఫూర్తితో రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లో సైతం ఎస్సీ వర్గీకరణ ఉద్యమాలు బయలు దేరాయి. రాష్ట్రాల ఎల్లలు దాటిన ఈ ఉద్యమం దేశంలోనే దళిత హక్కులపై దేశవ్యాప్తంగా సరికొత్త చర్చకు దారి తీసింది. ఆత్మన్యూనతా భావంతో బాధపడుతున్న మాదిగలు చివరకు పేరు చివరన మాదిగ అని జోడించుకునే స్థాయికి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపిన ఘనత మందకృష్ణకే దక్కుతుంది. విస్తృత దళిత ఉద్యమంలో భాగంగా మంద కృష్ణ



1985లో కారంచేడు, 1991లో సుందూరుల్లో జరిగిన మారణ కాండలపై గళమెత్తారు.

మానవీయ ఉద్యమాలకూ..

మంద కృష్ణమాదిగ తనదైన పద్ధతిలో ఓ వైపు మాదిగ హక్కుల కోసం ఉద్యమిస్తూనే మరో వైపు పలు మానవీయ ఉద్యమాలను సైతం చేపట్టారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం హయాంలో గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత వైద్యం అందచేయాలనే ఉద్యమానికి కూడా దండోరా ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. చాలా కాలంగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన వికలాంగుల పక్షాన కూడా మంద కృష్ణ నిలబడ్డారు. వీరికి సరైన న్యాయం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నడిపారు. మంద కృష్ణ పోరాట ఫలితంగానే తెలుగు రాష్ట్రాల్లోని వికలాంగులకు ప్రస్తుతం పింఛన్ అందుతోంది. వృద్ధులు, వితంతువుల పక్షాన కూడా ఆయన పలు పోరాటాలు చేశారు.

రాజకీయాల్లో క్రియాశీలకంగా..

మంద కృష్ణ మాదిగ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని వివిధ రూపాల్లో విస్తరిస్తూనే రాజకీయాల్లో సైతం క్రియాశీలకంగా వ్యవహరించారు. 2004 ఎన్నికల్లో ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా, 2009లో మరో సారి అదే నియోజకవర్గం నుంచి త్రిలింగ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో తన సొంత పార్టీ అయిన మహాజన సోషలిస్టు పార్టీ పక్షాన వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పటికీ గెలుపు సాధించలేకపోయారు.

ప్రధాని మోదీకి సన్నిహితంగా..

దండోరా ఉద్యమ నేపథ్యంగానే మంద కృష్ణ మాదిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సన్నిహితుడయ్యాడు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మాదిగ దండోర విశ్వరూప సభకు స్వయంగా హాజరైన నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి తన మద్దతు ప్రకటించారు. ఇటీవల లోకసభ ఎన్నికల సందర్భంగా హనుమకొండలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభల్లో నరేంద్ర మోదీ, కృష్ణమాదిగ వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని మోదీ ప్రకటించారు. ఆ సమయంలో భావోద్వేగానికి గురైన కృష్ణమాదిగ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో ఆయన్ను మోదీ హత్తుకుని ఊరడించిన సన్నివేశం నేటికీ అందరి కళ్లలో మెదులుతూనే ఉంది. ఇక 30 ఏళ్ల పాటు ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ సాగించిన పోరాటం చివరకు ఫలించే దశకు చేరుకుంది. గతేడాది ఆగస్టు 1 సుప్రీం కోర్టు కూడా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కానీ అమల్లో ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయంటూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 'వేల గొంతుకలు.. లక్ష డప్పులు' కార్యక్రమం ద్వారా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

మందకృష్ణమాదిగ గురించి..



తల్లిదండ్రులు	: కొమురమ్మ, కొమురయ్య
భార్య	: జ్యోతి
సంతానం	: ఒక కూతురు, ఇద్దరు కుమారులు
జననం	: 1965
స్వస్థలం	: హనుమకొండ హంటర్ రోడ్డులోని న్యూశాయంపేట
విద్యాభ్యాసం	: న్యూశాయంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాలల్లో పదోతరగతి, ఇంటర్ చదివారు.

రానున్న రోజుల్లో బీఆర్ఎస్ భూస్థాపితం ఖాయం

- పదేళ్లలో ఆ నాయకులు ఒక్క హామీ నెరవేర్చలేదు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ డీసీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ సుధారాణి, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయిందన్న బాధ నుంచి ఇంకా బీఆర్ఎస్ నాయకులు కోలుకోలేదని, ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్న ఆ నాయకులు రానున్న రోజుల్లో భూస్థాపితమవడం ఖాయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ముందుగా బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ వరంగల్ పర్యటనకు వచ్చినప్పుడు వరంగల్ నగరానికి రూ.300కోట్లు ఇస్తానన్న నిధులు, కేటీఆర్ వరంగల్‌కు వచ్చి ఇచ్చిన హామీలను స్క్రీన్ ద్వారా విలేకరుల చూపించారు.

అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో ఒక్క వాగ్దానం నెరవేర్చని నాయకులు ఇప్పుడు వరంగల్ అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేస్తామని చెప్పిన నేతలు.. ఇప్పుడు ఎక్కడపోయారన్నారు. పారదర్శకంగా పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనే ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా సర్వేలు చేపట్టి అమలు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రేషన్ కార్డుల ప్రక్రియ, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు.. రెండు పడకల ఇళ్లను ఎందుకు అందించలేకపోయారని ప్రశ్నించారు. ఆ పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో.. ఎంత మందికి రేషన్‌కార్డులు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని అంటున్నారని, బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు 3వ స్థానం కల్పించి ఎప్పుడో బుద్ధిచెప్పారని ఎద్దేవా చేశారు. రానున్న ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కడతారని నాయిని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చార్ ధమాకా..!

- నేడు నాలుగు కొత్త పథకాలకు ప్రభుత్వం శ్రీకారం
- రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా స్కీమ్‌లు ప్రారంభం
- ఫిబ్రవరి ఒకటి నుంచి మార్చి చివరి నాటికి అర్హులందరికీ అందేలా చర్యలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు ఇప్పటికే పలు హామీలను నెరవేరుస్తూ వస్తున్న ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కొత్తగా నాలుగు పథకాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ప్రతీ గ్రామంలో గ్రామ సభలను నిర్వహించింది. రేషన్‌కార్డులతో పాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు శ్రీకారం చుట్టనుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,717 గ్రామాల నుంచి 3,18,338 దరఖాస్తులను స్వీకరించింది. వీటిలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 86,237 దరఖాస్తులు వచ్చాయి. హనుమకొండ జిల్లా నుంచి 57,477 దరఖాస్తులు, వరంగల్ జిల్లా నుంచి 57,008 దరఖాస్తులు, ములుగు జిల్లా నుంచి 42,6 57, భూపాలపల్లి జిల్లా నుంచి 40,711, జనగామ జిల్లా నుంచి 34,248 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లబ్ధిదారులను గుర్తించనున్నారు.

ఆ మూడింటికే దరఖాస్తుల వెల్లువ

ప్రభుత్వం కొత్తగా నాలుగు పథకాలను అమలు చేస్తుండగా, రైతు భరోసా మినహా మిగతా మూడు పథకాల కోసం ప్రజలు అధికసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా రేషన్‌కార్డుల కోసం 1,49,478మంది దరఖాస్తులు చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవటంతో చాలమంది కార్డుల కోసం తహసీల్దార్ కార్యాలయాలు, పౌరసరఫరాల శాఖ అధికారుల చుట్టు చక్కర్లు కొట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానించటంతో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చిపడుతున్నాయి. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితి ఇంతే. 2015-18 వరకు రెండు విడతల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసింది. వాటిలో పదివేల ఇళ్లు కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో సొంతింటి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 87,528 మంది దరఖాస్తులు చేసుకున్నారు. సొంత జాగా ఉన్నవారికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుండటంతో లబ్ధిదారుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఒక్క మహబూబాబాద్ జిల్లా నుంచే ఇందిరమ్మ ఇళ్ల కోసం 30,611 దరఖాస్తులు రాగా, వరంగల్ జిల్లా నుంచి 20,578 మంది దరఖాస్తు చేసుకున్నారు. భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేల సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 50,276మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 20రోజుల పని దినాలు ఉండాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 7,39,614 జాబ్‌కార్డులు ఉండగా, 15,25,252మంది కూలీలు ఉన్నారు. అయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయం కోసం కేవలం 50,276 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నేడు మండలానికో గ్రామంలో అమలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గణతంత్ర దినోత్సవం నుంచి కొత్తగా నాలుగు పథకాలను ప్రారంభించేందుకు సన్నద్ధమైంది. ఈ మేరకు ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు రోజులు పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించింది. 3,18,338మంది దరఖాస్తులు చేసుకోవటంతో వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. తొలుత ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 76మండలాల నుంచి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు పథకాలను అమలు చేయాలని నిర్ణయించారు. 26వ తేదీన మధ్యాహ్నం 1గంటకు ఎంపిక చేసిన గ్రామాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పర్యటించి లబ్ధిదారులకు కొత్త పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు. ఈ గ్రామాల్లో అర్హులైన వారికి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలను అందించనున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మిగతా లబ్ధిదారుల దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించనున్నారు. మార్చి చివరి నాటికి అర్హులైనవారికి ప్రభుత్వం కొత్త పథకాలను అమలు చేయాలని నిర్ణయించింది.

రైతుభరోసాకు కోతలే..

అర్హులైన వారికే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాళ్లు, రప్పలు, సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించి రైతుభరోసాను నిలిపి వేయనుంది. గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరానికి ఏటా రెండు పంటలకు రూ.10వేల పెట్టుబడి సాయాన్ని అందించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రైతుభరోసాగా మార్చి ఏటా రెండు పంటలకు ఎకరాకు రూ.15వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. గతేడాది వానకాలం, యాసంగి పంటలకు ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని అందించలేదు. దీంతో ఈ పథకం ఉంటుందా..? ఉండదా? అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. ఈ క్రమంలో కొత్తగా అమలు చేయనున్న నాలుగు పథకాల్లో రైతు భరోసా కూడా ఉండటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఏటా ఎకరానికి ఇస్తామన్న రూ.15వేలకు బదులు రూ.12వేలే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమైంది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8,89,787మంది రైతులకు గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద రూ.903.93కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు యోగ్యమయ్యే భూములకే రైతుభరోసా ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు సాగుయోగ్యమైన భూములను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి వివరాలు సేకరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సాగుకు యోగ్యంకాని 27,466 ఎకరాల భూములను అధికారులు గుర్తించారు. వీరికి మినహా మిగతా రైతులకు రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే కొత్తగా రైతు భరోసా కోసం 3,506మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత రైతుభరోసాను అమలు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో నాలుగు పథకాల కోసం గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులిలా..

జిల్లా	రేషన్ కార్డులు	ఇందిరమ్మ ఇళ్లు	రైతు భరోసా	ఆత్మీయ భరోసా	మొత్తం
వరంగల్	28,868	20,578	580	6,982	57,008
హనుమకొండ	32,987	19,585	388	4,517	57,477
జనగామ	14,532	13,955	491	5,270	34,248
మహబూబాబాద్	37,954	30,611	561	17,111	86,237
భూపాలపల్లి	20,186	12,661	520	7,344	40,711
ములుగు	14,951	17,688	966	9,052	42,657
మొత్తం	1,49,478	87,528	3,506	50,276	3,18,338

భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలి : ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య

హసన్‌పర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగ ఉత్సవాలలో భాగంగా డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఎర్రగట్టుగుట్ట క్రాసు రోడ్డు టీటీడీ కల్యాణ మండపంలో శనివారం డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటాలకైన సిద్ధం కావాలన్నారు. డీబీఎఫ్ 25 ఏళ్లుగా దళితుల పక్షాన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మార్గంలో ప్రజలను చైతన్యవంతం చేస్తోందన్నారు. యేడాదిగా రాష్ట్రంలో దళిత అభివృద్ధి శాఖ మంత్రిని నియమించకపోవడంతో ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ విప్ ఆరెపల్లి మోహన్, డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. శనివారం కేయూ సెనెట్ హాల్‌లో హైదరాబాద్ జెన్ పాక్టు సంస్థ నేతృత్వంలో స్టెమ్ ఫర్ హర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం-2024-25 అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతికతోనే మహిళ సాధికారత సాధ్యం అవుతుందని చెప్పారు. మారుతున్న ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. భాష సామర్థ్యంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. జెస్ పాక్టు సంస్థ ఇంజనీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు ఇంటర్ స్థాయిలో 60 శాతం మార్కులు ఉంటే జనవరి 30లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఎంపికైన విద్యార్థినులకు ఏడాదికి రూ.40వేల చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్‌లను అందచేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, డాక్టర్ కె.భిక్షాలు, డాక్టర్ ఎస్.రమణ, జెస్ పాక్టు ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. శనివారం కేయూ గణితశాస్త్ర విభాగంలో నెహ్రూ యువకేంద్రం, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ సంయుక్తంగా మత్తు- మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి చింతల అన్వేష్, మ్యాథ్స్ విభాగాధిపతి డాక్టర్ భారవిశర్మలు జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం లేని సమాజం కావాలని అన్నారు. అలాగే మత్తుకు బానిసలు కావద్దని యువతను హెచ్చరించారు. యాంటీ నార్కోటిక్ డీఎస్సీ సైదులు మాట్లాడుతూ.. యువత ఇటీవల గంజాయికి బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తులో జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. రిసోర్సు పర్సన్ ప్రముఖ సైకాలసిస్టు డాక్టర్ ప్రహసిత్, పీపీటీ ప్రజంటేషన్‌లో యువతకు మాదక ద్రవ్యాలు వల్ల కలిగే నష్టాలను వివరించారు. మాదక ద్రవ్యాలపై డయల్ 100, 1933లకు ఫిర్యాదు చేయవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో భారవిశర్మ, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, లాయర్ బానోతు మహేందర్, వెల్దండి సురేశ్, గాలి భిక్షపతి , విద్యార్థులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు కేయూ స్టూడెంట్స్

కేయూ క్యాంపస్ జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): న్యూఢిల్లీలో ఆదివారం జరుగ నున్న రిపబ్లిక్‌డే వేడుకలకు కాకతీ య యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ కళాశాల ఎన్‌సీసీ కంప్యూటర్ సైన్స్ విభాగం స్టూడె ంట్స్ ఎంపికయ్యారు. కళాశాల బీటెక్ మూడో ఏడాదికి చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ బి. హరిప్రియ, (కల్చలర్), బీటెక్ రెండో ఏడాదికి చెందిన కె.ఆకాశ్‌వర్ధన్ (ఫ్లాగ్ ఏరియా) నుంచి ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ తెలిపారు. వీరిని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మ ల్లారెడ్డి, 1(టీ)సీటీఆర్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నర్ దేవేందర్ ఎస్.రావత్, ఆఫీసర్ కల్నర్ రత్నారెడ్డి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు కె.విజయ్‌కుమార్, అనిల్‌కుమార్‌లు అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాజీపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఇనిస్టిట్యూట్ సమీపంలో శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ల భ్యమైంది. కాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగి ఉండి ఎత్తు 5.5 అడుగు లు, ఛామనఛాయ రంగు, తెలుపు గడ్డం, తలకు తెలుపురంగు ముస్లిం టోపీ, నీలిరంగు ఫుల్‌షర్ట్, నీలి రంగు నలుపు రంగు గీతల లుంగీ ధరించి ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీ ఎంలో బధ్రపర్చామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో 85954 00800 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

బెల్లంపల్లి లోకోస్టార్స్ జట్టుకే క్రికెట్ ట్రోఫీ కైవసం

కాజీపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ఫైనల్స్ శనివారం నిర్వహించారు. ఈ పోటీలను మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. కాజీపేట ఆర్పీఎఫ్, బెల్లంపల్లి లోకోస్టార్స్ మధ్య జరిగిన ఫైనల్ పోటీలలో బెల్లంపల్లి లోకోస్టార్స్ జట్టు విజయం సాధించి క్రికెట్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. కాజీపేట ఆర్పీఎఫ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ట్రోఫీ గెలుచుకున్న బెల్లంపల్లి లోకోస్టార్స్‌కు రైల్వే ఏడీఆర్ఎం గోపాల్ ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా విజేతలను అభినంది ంచారు. ప్రతీ ఏడాది ఈ పోటీలను నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ బృందాన్ని ఏడీఆర్ఎం అభినందించారు. కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ అవార్డు అందుకున్న ఏసీపీ

వరంగల్ క్రైం, జనవరి25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పుర స్కరించుకొని హైద్రాబాద్ రవీంద్రభారతిలో శనివారం ఏర్పాటు చేసిన సమా వేశంలో గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా ఎస్‌బీ ఏసీపీ జితేందర్ రెడ్డి ఉత్తమ ఎలక్టోరల్ అవార్డు అందు కున్నారు. వరంగల్ పోలీస్ కవి ుషనరేట్ పరిధిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన సందర్భంగా జాతీయ ఎన్నికల సంఘం ఉత్తమ ఎలక్టోరల్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డిని డీజీపీ జితేందర్‌రెడ్డి, సీపీ అంబర్ కిషోర్ ఝూ అభినందించారు.

హరిప్రసాద్‌కు ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు

మడికొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మడికొండకు చెందిన చింతపండు హరిప్రసాద్ బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ 2024-25 (బీపీఏ) అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఉత్తమంగా విధులు నిర్వర్తించినందుకు గాను హరిప్రసాద్‌కు రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం కలెక్టర్ సత్యశారద చేతుల మీదుగా ఆయన అవా ర్డును అందుకున్నారు. హరిప్రసాద్‌ను పలువురు అభినందించారు.

మేరు సంఘం-2025 క్యాలెండర్ ఆవిష్కరణ

రాంనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మేరు సంఘం-2025 క్యాలెండర్‌ను పర్యాటక, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ శనివారం రాంనగర్‌లోని ఆమె నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మేరు కుల స్తులకు అప్పగిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం బాధ్యులు తెలిపారు. రంగశాయిపేటలో మేర కులస్తుల ఆధీనంలో ఉన్న స్మశాన వాటిక స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మింపజేస్తానని హామీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనువాస్, యాదగిరి స్వామి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనాలను మరమ్మతు చేయించండి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరి ధిలో చెత్తను తరలి ంచేం దుకు ఉప యోగి స్తున్న వాహనాలు త్వరగా మర మ్మతు చేసి ఇవ్వాలని బల్దియా డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం కమిషనర్‌ను కలిసి వినితి పత్రం అందించారు. నాలుగు మాసాలుగా వాహనాలు రిపేరు వచ్చిన విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కోవ డం లేదని వెల్లడించారు. చిన్నా చితకా రిపేర్లకు కూడా నెలల తరబడి బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డులో ఉంచుతున్నారని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డ్రైవర్ల సంఘం నాయకులు పడాల రామ్మూ ర్తి, మారెడుకొండ రాజు, సత్యనారాయణ, సంబరాజు శ్రీనివాస్, మాదాసి అశోక్, దడిగెల రవి, వడికాల నవీన్, ఖాజామొహినోద్దీన్, కొత్తపెల్లి శ్రీనివాస్‌లు ఉన్నారు.

ప్రజాస్వామ్య విజయంలో ఓటర్లే కీలకం

హనుమకొండ కలెక్టరేట్: ప్రజాస్వామ్య విజయంలో ఓటర్ల భాగస్వామ్యం కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ముఖ్య ఉద్దేశం 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయడం, ఎన్నికల్లో ఓటర్ల ఓటు వేసే విధంగా కృషి చేయడం అన్నారు. ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతు న్నాయంటే ఓటర్లే కారణమన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్క ఓటరు తప్పకుండా ఎన్నికల్లో ఓటు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నూతనంగా ఓటుహక్కు వచ్చిన ఓటర్లు సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ. గణేష్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు డాక్టర్ నారాయణ, రాథోడ్ రమేష్, డీటీఓ శ్రీనివాస్‌కుమార్, ఇతర ప్రభుత్వ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, కుసుమ శ్యాంసుందర్‌రావు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేయూలో నూతనంగా 5 పరిశోధన కేంద్రాల ఏర్పాటు

కేయూ క్యాంపస్ జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి 5 పరిశోధనా కేంద్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మంజూరు చేశాయి. ఈ మేరకు శనివారం వర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రాలకు డైరెక్టర్లుగా పలువురు ప్రొఫెసర్లను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 2019-2020 ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం 60:40 నిష్పత్తిలో రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రుసా) పథకంలో భాగంగా నిధులు రూ.50 కోట్లు మంజూరు చేసింది. వాటిలో రూ.15కోట్ల వ్యయంతో ఇంక్యూబేటర్ సెంటర్, ఇంటర్‌పెన్యూర్ షిష్ డెవలప్‌మెంట్ కోసం కె హబ్ భవనాన్ని నిర్మించారు. అలాగే 2024లో రుసా నిధులు రూ.35కోట్లు మంజూరు చేశారు. కాగా, 2019-20లో వచ్చిన రుసా నిధులతో వర్సిటీలో 5 పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో సెంటర్ ఫర్ డ్రగ్స్ రిసెర్చ్, సెంటర్ ఫర్ మ్యాలిక్యూలర్ మెటీరియల్ ఫిజిక్స్, నానో డ్రగ్స్ డెలివరీ సిస్టం (నాన్ సైన్స్) సెంటర్ హిథో- మెడికల్ ప్లాంట్స్, సెంటర్ ఆన్ సైబర్ ఫిజికల్ సిస్టం సెంటర్లను నూతనంగా వర్సిటీలో ఏర్పాటు చేశారు. కాగా, శనివారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి ఆయా పరిశోధన సెంటర్లకు డైరెక్టర్లుగా పలువురు ప్రొఫెసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో నూతన డైరెక్టర్లకు నియామక ఉత్తర్వులను అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, డాక్టర్ సీజే శ్రీలత, డాక్టర్ పోదేటి శ్రీనివాస్, ఏఆర్ హబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి ఆటడం లేదు.. పట్టించుకోరా..?

డంపింగ్ యార్డు పొగతో తట్టుకోలేక రోడ్డెక్కిన బాధితులు


రోడ్డుపై ఆవేదన వ్యక్తం చేస్తున్న మడికొండ వాసులు

మడికొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మడికొండ శివారులోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ ఊరిని మొత్తం కమ్మేసి ఊపిరాడటంలేదని బాధితులు వాపోతున్నారు. శనివారం ఎక్కువ మొత్తంలో గ్రామాన్ని కమ్మేసిన పొగతో విలవిలలాడిన మహిళలు, పిల్లలు రోడ్డెక్కారు. వాహనాలను ఆపి నిరసన వ్యక్తం చేశారు. తమ పాలిటశాపంగా మారిన డంపింగ్ మహమ్మారిని ఎత్తివేసి తమ ప్రాణాలను కాపాడాలని మడికొండ వాసులు నినదించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరిస్తానని బాధితులకు సర్దిచెప్పి అక్కడి నుంచి వారిని పంపించారు.

డంపింగ్ యార్డు ఎత్తివేసే వరకు విశ్రమించేది లేదు

మడికొండ, రాంపూర్ శివారులోని చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేసే వరకు విశ్రమి ంచేది లేదని డంపింగ్‌యార్డు సమస్య పరిష్కార అడ్‌హక్ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. శనివారం మడికొండలోని పెద్దమ్మ గుడి ప్రాంగణంలో సభ్యులు సమావేశమై కూలంకశంగా చర్చించి సమస్య పరిష్కారానికి పలు కీలక తీర్మానాలు చేశా రు. అవసరమైన మేరకు తగిన కార్యా చరణను రూపొందించుకొని ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగనున్నట్లు వారు తెలిపారు. సమస్య తీవ్రతను జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత ఉన్నతాధికారులు, మంత్రులు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విన్నవించనున్నట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు.

వేడుకగా ముగిసిన బల్దియా క్రీడలు

ఆసక్తిగా పాల్గొన్న ఉద్యోగస్తులు, కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా బల్దియా ఉద్యోగులు, కార్పొరేటర్ల మానసిక ఉల్లాసం కోసం నిర్వహించిన 'బల్దియా క్రీడల చాంపియన్ షిప్' శనివారంతో ముగిసింది. ఐదు రోజుల పాటు ఉత్సాహంగా కొనసాగిన క్రీడలలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు ఆసక్తిగా పాల్గొని ప్రతిభకు పదును పెట్టారు. ప్రధానంగా క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, మ్యూజికల్ ఛైర్, టగ్ ఆఫ్ వార్ విభాగాల్లో మహిళలకు, పురుషులకు వేరువేరుగా స్నేహపూర్వక పోటీలు నిర్వహించారు. కాగా, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇంజనీరింగ్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, మలేరియా అధికారి మాధవరెడ్డితో పాటు డిప్యూటీ కమిషనర్లు, మినిస్టీరియల్ సిబ్బంది హోదాను మరిచి ఆయా క్రీడల్లో పాల్గొని ఐదు రోజుల పాటు పాల్గొన్నారు. శనివారం ఆటల ముగింపు రోజు బల్దియా ఇండోర్ స్టేడియంలో మేయర్, కమిషనర్ టేబుల్ టెన్నీస్ ఆడి అందరినీ ఆకట్టుకున్నారు. క్రీడలు మానిసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఉపయోగపడుతాయని మేయర్ అన్నారు. కాగా, వివిధ వింగ్‌ల అధికారులు, ఉద్యోగులకు హనుమకొండ రెడ్డిపురంలోని ఏవీవీకే స్టేడియంలో ఐదురోజుల పాటు క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు క్రీడల ఇంచార్జీ డీఎఫ్‌వో శంకర్‌లింగం తెలిపారు.


టేబుల్ టెన్నీస్ ఆడుతున్న మేయర్, కమిషనర్

నేడు క్రికెట్ ఫైనల్ మ్యాచ్

బల్దియా పరిధిలో ఎంపికచేసిన అన్ని క్రీడాంశాలు ముగియగా పురుషుల క్రికెట్ మ్యాచ్ మిగిలి ఉంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బల్దియా ఉన్నతాదికారులు, ఉద్యోగులలో సంతోషాన్ని నింపేందుకు ఆదివారం మధ్యాహ్నం పురుషుల క్రికెట్ ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. లీగ్‌మ్యాచ్‌ల నుంచి సెమీస్ ద్వారా ఫైనల్‌కు చేరుకున్న బల్దియా శానిటేషన్ వర్సెస్ టౌన్‌ప్లానింగ్ జట్లు పోటీలు పడుతాయని ఆర్గనైజర్లు తెలిపారు. జెండా వేడుకల తర్వాత ఈ ఫైనల్ మ్యాచ్ ఉంటుందని, అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి అమల్లోకి నాలుగు పథకాలు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి25(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పథకాలు ఆదివారం నుంచి అమలులోకి రానున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పథకాలకు సంబంధించిన విధివిధానాలను అదనపు కలెక్టర్, పథకాలకు సంబంధించిన అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన ప్రజలకు ఈ పథకాలకు అందుతాయన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాలలో గ్రామసభలను నిర్వహించి లబ్ధిదారులను గుర్తించామన్నారు. భూమి లేని నిరుపేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా యేటా రూ.12వేలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు ప్రభుత్వం అందిస్తుం దన్నారు. పథకాల ప్రారంభోత్సవంలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హసన్‌పర్తి మండలం పెంబర్తి, ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామాలలో నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించిన వివరాలు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం గురించి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, రేషన్ కార్డుల గురించి డీఎస్‌ఓ కొమురయ్య, ఇందిరమ్మ ఇండ్లు గురించి గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి రాజేందర్ వివరించారు.

ఎల్లాపూర్ ఎస్‌పీఆర్ స్కూల్ విద్యార్థుల ఉదారత

హసన్‌పర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ ఎల్లాపూర్ ఎస్‌పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం హన్మకొండ అతిథి దివ్యాంగుల ఆశ్రమం, భీమారం లార్డు వృద్ధాశ్రమాన్ని సందర్శిం చారు. వారి యోగక్షేమ సమాచారాన్ని తెలుసుకుని సుమారు రూ.50వేల విలువైన వస్తువులు బియ్యం, నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రిక్ స్టవ్, పాత్రలు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్‌మోహన్ దివ్యాంగ ఆశ్రమ నిర్వాహకులు సుజాత, లార్డు వృద్ధాశ్రమ నిర్వాహకులు నారగాని నరేష్‌గౌడ్‌ని అభినందించి వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా, దయా గుణం అలవర్చుకొని వారి ప్యాకెట్‌మనీ నుంచి కొంత డబ్బులను ఇచ్చి ఇలాంటి ఉదారతను చాటుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎస్‌పీఆర్ స్కూల్ విద్యార్థులు

ఎస్సార్‌యూలో అట్టహాసంగా స్పార్కిల్ వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి

హసన్‌పర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో స్పార్కిల్-25 వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటిరోజు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, సాంస్కృతిక వేషధారణతో హాజరయ్యారు. సదస్సులో పాటల పోటీలు, తంబోలా, మెహందీ, ట్రెజర్ హంట్, ర్యాంప్‌వాక్, లైవ్ బ్యాండ్, నృత్య ప్రదర్శన, వంటల పోటీలు, బ్రష్, బ్లుష్ వంటి 23 కార్యక్రమాలలో పాల్గొని విద్యార్థులు తమ ప్రతిభతో ఆహూతులను మెప్పించారు. ఈ సందర్భంగా ఎ.వరదారెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాలతో విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడ తాయన్నారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు తమ అభిరుచులను, సాంకేతిక, సాంస్కృతి క రంగాలలో నైపుణ్యాలను ప్రదర్శించి మెప్పించా లన్నారు. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమ తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొవైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఏవివి.సుధాకర్, స్టూడెంట్ వెల్ఫేర్ కౌన్సిల్ కన్వీనర్స్ శశిధర్‌రెడ్డి, భావన, ఫణిశ్రీతో పాటు వివిధ విభాగాధిపతులు, వివిధ కళాశాలల విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుకు కృషి చేయాలి

● మేయర్ గుండు సుధారాణి

● బల్దియా శానిటరీ అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024లో ఉత్తమ ర్యాంకు సాధించాలంటే అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బల్దియా శానిటేషన్ విభాగం అధికారులు, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, బల్దియా జవాన్‌లతో స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో గుండు సుధారాణి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన 13అంశాల మీద సిబ్బందికి సమగ్ర అవగాహన కలిగిన ఉండాలన్నారు. ప్రతీ వారాని కోసారి లోతైన డ్రైన్‌క్లీన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇంకా 136 గార్బేజ్ పాయింట్‌ను గుర్తించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో రెండు చిట్టీ పాయింట్స్‌ను ఏర్పాటు చేయాలని ఎస్‌ఐలకు సూచించారు. చెత్త సేకరణలో తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలన్నారు. పొడి చెత్తను డీఆర్‌సీ సీలతో మాత్రమే అందించేలా ప్రజలకు తెలపాలన్నారు. 15 రకాల శుభ్రతా అంశా లను నిర్వాహకులు అమలు చేసేలా చూడాలన్నారు. మరుగుదొడ్ల జాబితా సిద్ధం చేసి అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. బల్దియా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఎక్కువ మార్కులు పొందడానికి కావలసిన పనులను ముందుగా సమర్థవంతంగా నిర్వర్తిం చాలన్నారు. ఇంకా ఆస్పత్రుల నుంచి సేకరించే వ్యర్థాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు డాక్యుమెంటేషన్, ఫొటోలతో కూడిన లఘు చిత్రాలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, హెచ్‌వో రమేష్, డీసీ ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ మహేందర్‌తో పాటు శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

ప్రజాస్వామ్యంలో ఓటర్లదే కీలక పాత్ర : ఎంపీ

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

వడ్డెపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటర్లదే కీలక పాత్ర అని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచిం చారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ వివేక్‌నగర్ కాలనీలోని ప్రజాతంత్ర ఆలోచన వేదిక జిల్లా కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాతంత్ర ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్యపర్చేందు కోసం ముద్రించిన డోర్ పోస్టర్లు, కరపత్రాలను హనుమకొండ కనకదుర్గా కాలనీలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల రమేష్, జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ పింగిళి అశోక్‌రెడ్డి, జిల్లా నాయకులు జనప సారంగపాణి, గూడెం రమేష్, శ్యామల దుర్గాదాస్ కాలనీ అధ్యక్షుడు నల్లాని శ్రీనివాస్, చింతలపణి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కడియం కావ్య

పింగిళి పీజీ కళాశాలలో..

హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని కళాశాల రాజనీతిశాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళిగౌడ్ విద్యార్థినులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేయూ పొలిటికల్ సైన్స్ అధిపతి డాక్టర్ జి. కృష్ణ, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ అరుణ, కవిత, రామా రత్నమాల, బండి యుగంధర్ పాల్గొన్నారు.





కల్నల్‌తో కాపురమంటే ఎడబాట్లు, త్యాగాలూ తప్పవు. నిరంతరం ప్రమాదాలతో చెలగాటాలూ తప్పవు. అయినా, ఆ వృత్తిని భర్తతో సమానంగా ప్రేమించడంతో పాటు, అటు కుటుంబానికీ, ఇటు నటనా జీవితానికీ సమ న్యాయం చేస్తున్నారు 'లక్కీ భాస్కర్' చిత్రంలో నటించిన **గాయత్రి భార్గవి**. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె 'నవ్య'తో పంచుకున్న జీవితానుభావాలివి...

ఇది త్యాగం కాదు... బాధ్యత

విక్రమ్ సుబ్రహ్మణ్యం... మావారు. ఆర్మీలో రెండో తరానికి చెందినవారు. మా మామయ్యగారు, ఆడపడుచు కూడా సైన్యంలో పని చేశారు. హిమనీనదాల దగ్గరకు వెళ్లిన తొలి బృందాల్లో మావారు కూడా ఉన్నారు. అప్పటివరకూ యుద్ధ సమయంలో తప్ప సైనికులెవరూ అక్కడకు వెళ్లేవారు కారు. పాకిస్తాన్, భారత్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో ఆరు నెలల గడపడం మొదలుపెట్టిన మొదటి బృందాలతో ఆయన కూడా వెళ్లారు. అప్పట్లో అక్కడ ఎలాంటి సదుపాయాలూ ఉండేవి కావు. ఉత్తరాలే ఏకైక కమ్యూనికేషన్. దాంతో మేమందరం ఆయనకు ఉత్తరాలు రాసేవాళ్లం. మేం రాసిన ఉత్తరం ఆయనకు చేరడానికి 15 రోజులు పడుతుంది. అయితే అప్పట్లో ఆయనకు నేనొక మంచి స్నేహితురాలిని మాత్రమే! చెన్నైలోని మా కజిన్ క్లాస్‌మేట్ ఆయన. అలా ఆయనతో పరిచయం ఏర్పడింది. ఓ సందర్భంలో ఆయన హైదరాబాద్ వచ్చారు. విక్రమ్‌కు హైదరాబాద్‌లో స్నేహితులు లేరు కాబట్టి కంపెనీ ఇవ్వమని మా కజిన్ అడగడంతో ఒకట్రెండు సార్లు కలిశాను. అలా మా స్నేహం మరింత పెరిగింది. అది ప్రేమగా మారిందనే విషయం, కలిసి 'బార్డర్' సినిమాకు వెళ్లినప్పుడు తెలిసింది. సినిమాలో సైనికుల కష్టాలు చూసి నేను కళ్లనీళ్లు పెట్టుకుంటూ ఉంటే, ఆయనేమో పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. కానీ అప్పటికి నేనింకా చిన్నదాన్ని. ఇంట్లో ఒప్పుకోరని అభ్యంతరం చెప్పాను. ఆ తర్వాత చాలా కాలం పాటు మా మధ్య ఉత్తరాలు, ఫోన్ కాల్స్ కొనసాగాయి. ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేసేనాటికి ఆయన ఒక కోర్సు కోసం హైదరాబాద్ ఇఎమ్ఇ సెంటర్‌కి వచ్చి ఇక్కడే మూడేళ్లు ఉండిపోయారు. ఆ సమయంలో పెద్దల అంగీకారంతో మేమిద్దరం 2004లో పెళ్లితో ఒక్కటయ్యాం.

ఆ కొరతలు తప్పవు

సైనికుడి భార్యగా ఆయనతో నాకున్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని చెప్పాలి. సగటు మహిళల్లాగే భర్తతో కలిసి కుటుంబ వేడుకలు, పండుగలు జరుపుకోవాలని నేనూ ఆశపడుతూ ఉంటాను. కానీ అలా అన్నిసార్లూ సాధ్యపడేది కాదు. టూర్లూ, షికార్లూ వీలుపడేవి కావు. పిల్లల పుట్టినరోజులు కూడా ఆయన లేకుండా జరుపుకోవలసి వస్తూ ఉండేది. అయితే పెళ్లికి ముందే సైనికుల జీవితాల పట్ల కొంత అవగాహన ఉండడంతో నేనెప్పుడూ దాన్నొక కొరతగా భావించలేదు. దేశాన్ని కాపాడే బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న విక్రమ్ అంటే నాకెంతో గౌరవం. ఆయన మాతో కలిసి ఉండే కొద్ది రోజులూ ఆనందంగా గడుపుతూ ఉంటాం. ఆయన అప్పుడప్పుడూ తన సైనిక అనుభవాలను నాతో పంచుకునేవారు. అయితే ముఖ్యమైన విషయాలే తప్ప తాను పాల్గొనే కొన్ని రహస్య మిషన్స్ గురించి చర్చించేవారు కారు. కొన్ని సందర్భాల్లో తనకెదురైన ప్రమాదకరమైన సంఘటనల గురించి చాలా కాలం తర్వాత ఎంతో తాపీగా, యథాలాపంగా చెప్పేవారు. ఆయన చెప్తున్న విషయాలు విన్నప్పుడు గుండె ఝల్లుమనేది. ఓ సందర్భంలో హిమపాతం నుంచి త్రుటిలో తప్పించుకున్నాననీ, మరో సందర్భంలో చెవి పక్క నుంచి తుపాకీ గుండు దూసుకువెళ్లిందనీ నాతో చెప్పారు. ఇలాంటివి విన్నప్పుడు ఒక సగటు భార్యగా భయాందోళనకు లోనయ్యేదాన్ని.

> మాది హైదరాబాదే! ప్రస్తుతం కుటుంబమంతా ఇక్కడే ఉంది. మాకు ఇద్దరు మగ పిల్లలు. పెద్ద బాబు అక్షజ్ భావిక్‌కు 18 ఏళ్లు. చిన్న బాబు కృతిక్ భావిక్‌కు ఎనిమిదేళ్లు. పెళ్లయ్యే నాటికి డిగ్రీ వరకే చదివినా, పెళ్లి తర్వాత చదువును కొనసాగించి ఎమ్ఎ, ఎమ్‌ఫిల్ చేయగలిగాను. అదే సమయంలో టివిలో కూడా పని చేశాను. భోపాల్, అసోం, బెంగుళూరు... ఇలా విక్రమ్‌తో ఎక్కడకు వెళ్లినా ఆ ప్రాంతాల్లోని అనాథాశ్రమాలకు వెళ్లి పిల్లలకు ఉచితంగా చదువు చెప్పేదాన్ని. ఆయన కూడా తన తీరిక సమయాల్లో పిల్లలకు గణితం బోధించేవారు.
>
> 'లక్కీ భాస్కర్'తో నాకు మంచి గుర్తింపు వచ్చింది. హీరోయిన్ మీనాక్షిది కూడా సైనిక కుటుంబమే! దాంతో మేమిద్దరం వెంటనే కలిసిపోయాం. సినిమా చివరివరకూ నేనెంతో ఎంజాయ్ చేశాను. మా అబ్బాయి దుల్కర్ సల్మాన్ అభిమాని. దాంతో షూటింగ్‌సమయంలో మా వారు బాబును వెంటబెట్టుకుని సెట్‌కు వచ్చారు. ఆయనకు మా ప్రొడక్షన్ భోజనం తినిపించాం. ఆ వాతావరణాన్ని ఆయన చాలా బాగా ఎంజాయ్ చేశారు.

అదే చివరిసారి అనుకున్న సందర్భం

సైనికుల భార్యల జీవితాలు తీగ మీద నడక చందం. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఇక ఆయనను చూడడం ఇదే చివరిసారి అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పటికి మా పెళ్లై ఆరు నెలలు. ఓ రోజు అకస్మాత్తుగా సైన్యం నుంచి ఆయనకు పిలుపొచ్చింది. రాత్రికి రాత్రే సైనికులందరూ వెళ్లిపోయారు. వెళ్లినవాళ్లు ప్రాణాలతో తిరిగొస్తారనే నమ్మకం లేదు. పాస్‌పోర్టులు, బ్యాంక్ పాస్‌బుక్స్ చేతికి అందించి, తిరిగి రాకపోతే ఏం చేయాలో వివరిస్తుంటే విపరీతంగా భయపడిపోయాను. సినిమాల్లో తప్ప, నిజ జీవితంలో సైనికుల జీవితాలు ఎలా ఉంటాయో ఏమాత్రం అవగాహన లేని నేను గుండెలదురుతూనే ఆయనను సాగనంపాను. అయితే సినిమాల్లోలా సైనికులను ఏడుస్తూ సాగనంపే సన్నివేశాలు నిజ జీవితంలో ఉండవు. సంతోషంగా హారతిచ్చి, బొట్టు పెట్టి పంపిస్తాం. భయం, బాధ ఉన్నా, వాటిని మనసులోనే దాచుకుని దేశ ప్రజల భద్రత కోసం ప్రాణాలకు తెగిస్తున్న భర్తలను హుందాగా సాగనంపుతాం! వాళ్లు వెళ్లిపోయిన తర్వాత సైనికుల భార్యలుగా మేమందరం ఎంతో బాధ్యతగా నడుచుకుంటాం! పిల్లలూ, పెద్దల బాగోగులు చూసుకోవడంతో పాటు కంటోన్మెంట్లలోని జవాన్ల భార్యాపిల్లలను చూసుకోవలసిన బాధ్యత కూడా పై అధికారుల భార్యలకు ఉంటుంది. కల్నల్ భార్యగా నేనలాంటి బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటాను. మేమందరం ఒకే కుటుంబంలా కలిసిమెలిసి జీవిస్తూ ఉంటాం.

• గోగుమళ్ల కవిత



ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా అనేక మంది మహిళలకు పద్మ అవార్డులు లభించాయి. వీరందరూ మన సమాజానికి ఏదో ఒక విధంగా తమ వంతు సేవ చేసిన వారే. వారి గురించి మీ కోసం..

100 ఏళ్ల ధీరురాలు!

కొందరు మాతృభూమిపై ఉన్న మమకారంతో అలుపెరగకుండా పోరాడుతూ ఉంటారు. అలాంటి స్వాతంత్ర్య సమరయోధురాలే లిబియా లోబో సర్దేశాయ్. 100 ఏళ్ల వయస్సులో కూడా ఇంకా చురుకుగా ప్రజలలో స్ఫూర్తి నింపుతున్నారు. ఆమెకు శనివారం భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది.

1955.. పోర్చుగీసు నుంచి స్వాతంత్ర్యం పొందటానికి గోవాలో ఉద్యమం జోరుగా సాగుతోంది. లిబియా లోబో సర్దేశాయ్ ఎవ్వరికి కనబడకుండా అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆరేళ్ల పాటు అడవుల్లోనే ఉండి రహస్యంగా రేడియో ప్రసారాల ద్వారా ఉద్యమానికి ఊపును ఇచ్చారు. "నేను అడవుల్లోకి వెళ్లే సమయానికి ఆల్ ఇండియా రేడియోలో ఉద్యోగం చేస్తున్నా. లా చదువుతున్నా. ఆ సమయంలో గోవాలో ఉత్తరాలను కూడా అనుమతించేవారు కారు. పత్రికలు వచ్చేవి కావు. ఆఖరికి శుభలేఖల వేయించుకోవటానికి కూడా పోర్చుగీసు అధికారుల అనుమతి అవసరమయ్యేది" అంటారామె! తనతో ఆల్ ఇండియా రేడియోలో పనిచేస్తున్న వామన్, నికలో మెన్జిలతో కలిసి గోవా స్వాతంత్ర్యం కోసం పనిచేయటానికి నిర్ణయించుకున్నారు. ఆల్ ఇండియా రేడియోలో పనిచేస్తూ ఉండటం వల్ల వారికి రేడియో స్టేషన్ ఎలా నడపాలో తెలుసు. దీనితో వారు- "వాజ్ డా లిబరేడేడ్" (వాయిస్ ఆఫ్ ఫ్రీడం) అనే రేడియో స్టేషన్‌ను ప్రారంభించి రహస్యంగా నడపటం మొదలుపెట్టారు. అధికారులకు అనుమానం రాకుండా మకాం మార్చేసారు. లిబో, సర్దేశాయ్‌లు ప్రతి రోజు ఇతర రేడియో స్టేషన్లలో వచ్చే వార్తలను వినేవారు. పేపర్లలో వచ్చే వార్తలను సేకరించేవారు. ఇలా సుమారు ఆరేళ్ల పాటు రోజుకు 18గంటల దాకా పనిచేసేవారు.



వీరు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌మిషన్ సెంటర్ ద్వారానే భారతీయ సైన్యం గోవాలోని ప్రజలకు సందేశాలు పంపుతూ ఉండేది. "పోర్చుగీస్ నుంచి గోవాకు స్వాతంత్ర్యం వచ్చిన రోజు- అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ జె.ఎన్. చౌదురి మా దగ్గరకు వచ్చి ఆ వార్తను చెప్పారు. నాకు ఎలా స్పందించాలో అర్థం కాలేదు. మా గార్డెన్‌లో ఉన్న ఒక పువ్వును ఆయనకు ఇచ్చాను" అంటారు లోబో. ఆ తర్వాత మూడేళ్లకు సర్దేశాయ్‌ను లోబో పెళ్లి చేసుకున్నారు. గోవాకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దేశాయ్ పంచాయతీ సమితిల డైరెక్టర్ అయ్యారు. ఆ తర్వాత ఐఏఎస్ అధికారిగా మారారు. అంగోలాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు. 1992లో ఆయనకు భారత ప్రభుత్వం పద్మశ్రీని కూడా బహూకరించింది. లోబో కూడా తన లా డిగ్రీని పూర్తి చేసి న్యాయవాది వృత్తిలో ప్రవేశించారు. గోవా కోర్టుల్లో తొలి మహిళా న్యాయవాదిగా ప్రసిద్ధి చెందారు. మహిళా కోఆపరేటివ్ బ్యాంకును స్థాపించారు. గోవా టూరిజం అభివృద్ధి కోసం ఎంతో సేవ చేశారు. 1994లో సర్దేశాయ్ మరణించిన తర్వాత ఆమె ఒంటరిగానే గోవాలో నివసిస్తున్నారు. "ఇప్పటికి నా వంట నేనే చేసుకుంటా! నాకు ఒక పనిమనిషి ఉందంతే!" అనే లోబోకు ఇటీవలే వందేళ్లు నిండాయి. ఇప్పటికీ ఆమె గోవా ప్రజలలో స్ఫూర్తి నింపుతూనే ఉన్నారు. ఇటీవలే ఆమె పుట్టిన రోజును గోవా ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది.

క్యాన్సర్ రోగుల ఆశాజ్యోతి

మన దేశంలోని మహిళలకు ఎక్కువగా వచ్చే క్యాన్సర్లలో సర్వైకల్ (గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్‌ది రెండో స్థానం. గ్రామీణ ప్రాంతాల్లో దీనివల్ల సంభవించే మరణాలు ఎక్కువ కాగా... పట్టణ ప్రాంతాలలో కేసుల సంఖ్య ఎక్కువ. ప్రజలలో అవగాహన లేకపోవడం, సరైన రోగ నిర్ధారణ జరగకపోవడం కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎంతోమందికి ఆశాజ్యోతిగా నిలుస్తున్నారు డాక్టర్ నీరజ భాట్లా. ఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో అబెస్టెట్రిక్స్ గైనకాలజీ విభాగం విభాగంలో అధిపతి, ప్రొఫెసర్ అయిన ఆమె ముప్ఫై అయిదేళ్ళుగా సర్వైకల్ క్యాన్సర్ నిర్మూలన కోసం అవిశ్రాంతంగా పాటుపడుతున్నారు. వైద్యరంగంలో ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఏడాది 'పద్మశ్రీ' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇంతకుముందు భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మకమైన 'ఉమెన్ అచీవర్స్ డే అవార్డ్'ను ఆరోగ్య సంరక్షణ విభాగంలో అందుకున్న తొలి మహిళగానూ ఆమె చరిత్రలో నిలిచారు. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ'కు అనుబంధమైన 'ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్' (ఎఐఆర్‌సి) నుంచి 2023లో పురస్కారాన్ని పొందారు. మన దేశంలో సర్వైకల్ క్యాన్సర్ నివారణలో వ్యాక్సిన్లు వినియోగగ మంచి ఫలితాన్ని ఇస్తుందనే విషయాన్ని ఆమె పలు సందర్భాల్లో ప్రతిపాదించారు. "చిన్న వయసునుంచే వ్యాక్సిన్లు వేసుకోవడం మనకు అలవాటు కాబట్టి అది హానికరం, బాధాకరం కాదనేది ప్రజలకు తెలుసు. పైగా వ్యాక్సిన్ నిల్వ చెయ్యడానికి, రవాణా చెయ్యడానికి, ప్రజలకు వాటిని ఇవ్వడానికి సంపూర్ణమైన నెట్‌వర్క్ ఉంది. దాన్ని వినియోగించుకుంటే మనం మంచి ఫలితాలు సాధించగలం" అని నీరజ స్పష్టం చేశారు.



అలాగే "వ్యాక్సినేషన్‌కు సంబంధించిన డేటాను భద్రపరచడం కూడా చాలా ముఖ్యం. అప్పుడే వ్యాక్సిన్ తీసుకున్నవారికి, తీసుకోనివారికి మధ్య వ్యాధి తీవ్రతలో, నివారణలో వ్యత్యాసాన్ని మనం అర్థం చేసుకోవడానికి వీలవుతుంది" అంటున్న నీరజ పలు అంతర్జాతీయ స్థాయి సంస్థలతో కలిసి పని చేస్తున్నారు. ఎయిమ్స్‌లోని తమ విభాగంలో వినూత్నమైన ఎన్నో మార్పులకు ఆమె నాంది పలికారు.



ఈ ఏడాదే విడుదల..!

సినీ ప్రేమికుల అభిరుచిని ఎప్పటికప్పుడు పసిగట్టడంలో ముందుంటుంది ఐఎండీబీ (ఇంటర్నెట్ మూవీస్ డేటాబేస్). సిని మాల వివరాలు, అప్‌డేట్స్, రేటింగ్స్, తారాగణం, విడుదల తేదీలు.. ఇలా ప్రతీ విషయాన్ని సినీ ప్రియులకు సమాచారం అందిస్తుంటుందీ వెబ్‌సైట్. వాటితో పాటు ఇప్పుడు **ఈ ఏడాది ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న** 20 భారతీయ చిత్రాల జాబితాను అందించింది. ఇందులో యాక్షన్ ఎంటర్టైనర్లు, సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్లు, పీరియాడిక్ డ్రామాలు, హారర్ కామెడీ సహా రొమాంటిక్ చిత్రాలు... అన్నీ ఉన్నాయి.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
పుష్ప 2	తెలుగు చిత్రం	జనవరి 30
లుక్కాస్ వరల్డ్	హాలీవుడ్ మూవీ	జనవరి 31
ది స్నో గర్ల్ 2	వెబ్‌సిరీస్	జనవరి 31
అమెజాన్ ప్రైమ్		
ర్యాంపేజ్	హాలీవుడ్ మూవీ	జనవరి 26
ట్రిబ్యునల్ జస్టిస్ 2	వెబ్‌సిరీస్	జనవరి 27
బ్రీచ్	హాలీవుడ్ మూవీ	జనవరి 30
ఫ్రైడే నైట్ లైట్స్	హాలీవుడ్‌మూవీ	జనవరి 30
జియో సినిమా		
దీదీ	హిందీ డబ్బింగ్	జనవరి 26
ది స్టోరీ టెల్లర్	హిందీ చిత్రం	జనవరి 28
జీ 5		
ఐడెంటిటీ	మలయాళ చిత్రం	జనవరి 31
ఆపిల్ టీవీ ప్లస్		
మిథిక్ క్వెస్ట్	వెబ్‌సిరీస్	జనవరి 29
ఈటీవి విన్		
పోతుగడ్డ	తెలుగు చిత్రం	జనవరి 30
సోనీ లివ్		
సాలే ఆషిక్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 01



బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ 'సికందర్' సినిమా ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంది.. ఆయన కథానాయకుడిగా తమిళ దర్శకుడు ఏ.ఆర్.మురుగదాస్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌లో రష్మిక మందన్న కథానాయిక. సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్నారు. ఇటీవలే టీజర్‌ను విడుదల చేసి ఈ సినిమాపై అంచనాలు పెంచేశారు. ఇందులో సల్మాన్ లుక్, సంభాషణలు, యాక్షన్‌తో పాటు విజువల్స్ ఆకట్టుకున్నాయి. టీజర్ చూసి ఫిదా అయిన అభిమానులు.. ఈ సారి సల్మాన్‌కు హిట్ పక్కా అని ఆనందపడుతున్నారు. సల్మాన్ ఖాన్‌కున్న రంజాన్ సెంటిమెంట్ గురించి సంగతి తెలిసిందే. అందుకే రంజాన్ సందర్భంగా చిత్రాన్ని మార్చి 28న విడుదలకు సిద్ధం చేస్తున్నారు. ఈ సినిమా జాబితాలో ముందు వరుసలో ఉన్నందుకు దర్శకుడు మురుగదాస్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుందని ఆయన తెలిపారు.

టాక్సిక్: కన్నడ స్టార్ హీరో, 'కె.జీ.ఎఫ్' సిరీస్ చిత్రాల నటుడు యష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టాక్సిక్' ఈ జాబితాలో రెండో స్థానంలో ఉంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే యష్ బర్త్‌డే సందర్భంగా సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు.

కూలీ: మాస్, క్లాస్ అన్న తేడా లేకుండా అందరూ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. సూపర్ హిట్ చిత్రాల స్పెషలిస్ట్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం 'కూలీ' ఈ జాబితాలో మూడో స్థానంలో ఉంది. నాగార్జున, ఉపేంద్ర, పూజా హెగ్డే, శ్రుతీ హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మే 1న విడుదల.

రెట్రో: సూర్య గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్న 'రెట్రో' చిత్రం ఈ జాబితాలో 12వ స్థానంలో ఉంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకుడు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన వాటిల్లో అధిక శాతం గ్యాంగ్‌స్టర్ తరహా కథాంశాలు కావడం.. ఆ సినిమాలన్నీ యాక్షన్ ప్రియులను అలరించడంతో రెట్రోపై మంచి అంచనాలున్నాయి. మే 1న సినిమా విడుదలవుతోంది.

రాజాసాబ్: 'సలార్, 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాల వరుస విజయాలతో జోరుమీదున్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా మారుతి దర్శకత్వంతో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్' ఈ జాబితాలో ఆరోస్థానంలో ఉంది. ఈ హారర్ థ్రిల్లర్‌ను మొదట ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఏవో కారణాలవల్ల ఈ సినిమా విడుదల తేదీ మారింది. రిలీజ్ ఎప్పుడనే విషయంలో సస్పెన్స్ ఉన్నప్పటికీ, అంచనాలు మాత్రం తారాస్థాయిలో ఉన్నాయి.

ఎల్ 2 ఎంపురాన్: మలయాళ నటుడు మోహన్‌లాల్ 2019లో నటించిన 'లూసీఫర్'కు ఇది కొనసాగింపు భాగం. పృథ్వీరాజన్ సుకుమారన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జాబితాలో ఎనిమిదో స్థానంలో ఉంది. స్టీఫెన్ గట్టుపల్లిగా మొదటిభాగంలో అలరించిన మోహన్‌లాల్, రెండో భాగం 'ఎల్ 2 ఎంపురాన్' లో గ్యాంగ్‌స్టర్ అబ్రహం ఖురేషిగా కనిపించనుండడంతో ఈ సినిమా కోసం అందరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

వార్ 2: 'ఆర్ఆర్ఆర్', 'దేవర' చిత్రాలతో నార్త్ లోనూ మంచి క్రేజ్ సంపాదించుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. ఇప్పుడు డైరెక్ట్‌గా 'వార్ 2' చిత్రంతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఈ జాబితాలో ఏడో స్థానాన్ని సంపాదించిందీ చిత్రం. 'వార్' చిత్రానికి ఇది కొనసాగింపు.


కన్నప్ప: మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం పీరియాడిక్ ఫాంటసీ చిత్రం 'కన్నప్ప' ఈ జాబితాలో 11వ స్థానంలో ఉంది. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 25న విడుదల. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం, అక్షయ్‌కుమార్, ప్రీతి ముకుందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

థగ్ లైఫ్: హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కలయికలో 1987లో వచ్చిన ట్రెండ్‌సెట్టర్ 'నాయకుడు'. దాదాపు 38 ఏళ్ల తర్వాత వీరి కలయికలో 'థగ్ లైఫ్'. తెరకెక్కుతోంది. ఈ జాబితాలో 13వ స్థానంలో ఉందీ చిత్రం. దీనిపై అంచనాలు అధికమయ్యాయి. శింబు, జయం రవి, త్రిష, ఐశ్వర్య లక్ష్మీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూన్ 5న చిత్రం విడుదలవుతోంది.

కాంతార ఏ లెజెండ్: చాప్టర్ 1 'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా క్రేజ్‌ను సంపాదించుకున్నారు కన్నడ నటుడు రిషబ్ షెట్టి. 'కాంతార'కు ప్రీక్వెల్‌గా ఆయన కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'కాంతార ద లెజెండ్: చాప్టర్ 1'. ఈ జాబితాలో 18వ స్థానంలో ఉంది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న చిత్రం విడుదలవుతోంది.

తండేల్: నాగచైతన్య, సాయి పల్లవి నటించిన ఈ సినిమాకు చందు మొండేటి దర్శకుడు. ఈ జాబితాలో 20వ స్థానంలో ఉంది. ఓ మత్స్యకారుని జీవితంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఫిబ్రవరి 7న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను పెంచేశాయి.

జాబితాలోని 20 చిత్రాలివే



ఇందులో 11 హిందీ చిత్రాలు ఉన్నాయి. తెలుగు నుంచి మూడు.. తమిళ్ నుంచి మూడు చిత్రాలు ఉన్నాయి. కన్నడ నుంచి రెండు చిత్రాలు.. మలయాళం నుంచి కేవలం ఒక్క చిత్రం చోటుదక్కించుకుంది. హీరోల్లో అత్యధికంగా అక్షయ్‌కుమార్ నటించిన మూడు సినిమాలు.. 'స్కై ఫోర్స్', 'కన్నప్ప', 'హౌస్‌ఫుల్ 5' లిస్ట్‌లో ఉన్నాయి. అలాగే, హీరోయిన్లలో రష్మిక నటించిన మూడు సినిమాలు.. 'సికందర్, 'ఛావా', 'థామా' ఈ జాబితాలో ఉన్నాయి. ఈ లిస్ట్‌లో ఉన్న ఐదు చిత్రాలు 'హౌస్‌ఫుల్ 5', 'బాఘీ 4', 'వార్ 2', 'సితారే జమీన్ పర్', 'కాంతార ఏ లెజెండ్: చాప్టర్ 1' చిత్రాలు సీక్వెల్స్ లేదా విజయవంతమైన ఫ్రాంచైజీలకు కొనసాగింపు కావడం విశేషం.

1.సికందర్
2.టాక్సిక్
3.కూలీ
4.హౌస్‌ఫుల్
5. బాఘీ 4
6.ద రాజాసాబ్
7.వార్ 2
8. ఎల్2ఎంపురాన్
9.దేవ
10.ఛావా
11.కన్నప్ప
12.రెట్రో
13.థగ్‌లైఫ్
14.జాట్
15.స్కై ఫోర్స్
16.సితారే జమీన్ పర్
17.థామా
18.కాంతార ఏ లెజెండ్: ఛాప్టర్ 1
19.ఆల్ఫా
20.తండేల్.

ఆద్యంతం వినోదం



విశాల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'మదగజరాజ'. సుందర్ సి. దర్శకత్వంలో జెమినీ ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించింది. జనవరి 31న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోంది. శనివారం వెంకటేశ్ ఈ చిత్రం ట్రైలర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. విశాల్, సంతానం పండించిన వినోదం, కథానాయికలు అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ గ్లామర్, విలన్ పాత్రధారి సోనూసూద్‌తో హీరో పోరాటాల నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. 'మదగజరాజ' చిత్రాన్ని సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ సంస్థ తెలుగులో విడుదల చేస్తోంది. విజయ్ అంటోని సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ఎం. నాథన్.



సింహాన్ని బంధించిన రాజమౌళి

దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న సినిమా ఇటీవలే లాంచనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను రాజమౌళి ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఆ వీడియోలో ఆయన పాస్‌పోర్టు పట్టుకుని సింహాన్ని బంధించినట్లు నవ్వుతూ కనిపించారు. క్యాప్చర్డ్ అని పేర్కొన్నారు. ఈ వీడియోకు మహేశ్‌బాబు, ప్రియాంకచోప్రా, నమ్రత శిరోద్కర్ తదితరులు స్పందించారు. 'ఒక్కసారి కమిట్ అయితే, నా మాట నేనే వినను' అని తను నటించిన 'పోకిరి' సినిమాలోని డైలాగ్‌తో రిప్లై ఇచ్చారు మహేశ్. 'ఎట్టకేలకు' అని ప్రియాంక చోప్రా.. 'ఆల్ ద బెస్ట్' అంటూ నమ్రత కూడా కామెంట్ చేశారు. దీంతో ప్రియాంక చోప్రా ఈ సినిమాలో హీరోయిన్‌గా ఖరారయ్యారని చెప్పాలి. ఈ సినిమా లుక్ టెస్ట్ కోసం ప్రియాంక ఇటీవలే హైదరాబాద్ వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పలువురు దీనిపై మీమ్స్ కూడా చేస్తున్నారు. కాగా, అమెజాన్ అడవుల నేపథ్యంలో రెండు భాగాలుగా తెరకెక్కే ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. మొదటి భాగం 2027లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

దిల్ రాజుకు ఐటీ నోటీసు



తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, సినీ నిర్మాత దిల్ రాజుకు ఐటీ అధికారులు నోటీసు జారీ చేశారు. వచ్చే నెల 3వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. దిల్ రాజుకు సంబంధించిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, మ్యాంగో మూవీస్, మైత్రీ మూవీస్ సంస్థల కార్యాలయాలు, ఆయా సంస్థల బాధ్యుల ఇళ్లలో నాలుగు రోజులపాటు ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. పలు సినిమాలకు వచ్చిన కలెక్షన్లకు, ఆయా సంస్థలు దాఖలు చేసిన ఐటీ రిటర్న్స్‌కు మధ్య భారీ తేడాలు ఎందుకు ఉన్నాయన్న అంశంపై ఐటీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై దిల్ రాజు శనివారం మీడియాతో మాట్లాడారు. ఐటీ సోదాలు సర్వ సాధారణమని, తమ వద్ద తనిఖీలు చేసి స్టేట్‌మెంట్ రికార్డు చేశారని తెలిపారు. ఐటీ సోదాలు జరిపినప్పుడు తన ఇంట్లో రూ.20లక్షల నగదు మాత్రమే ఉందని, తమ సంస్థకు సంబంధించిన లావాదేవీలన్నీ క్లియర్‌గా ఉండటం చూసి ఐటీ అధికారులు ఆశ్చర్యపోయారని పేర్కొన్నారు.

కమ్‌బ్యాక్ ఇచ్చే సినిమా



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'కానిస్టేబుల్'. ఆర్యన్ సుభాన్ ఎస్.కే దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి మొదటి పాటను హైదరాబాద్ కమిషనర్ సి.వి.ఆనంద్ విడుదల చేశారు. 'కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా' అంటూ సాగే ఈ పాటను శ్రీనివాస్ తేజ రచించగా, సుభాశ్ ఆనంద్ సంగీతమిచ్చారు. నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు. ఈ కార్యక్రమంలో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "ఇది నాకు కమ్‌బ్యాక్ ఇచ్చే సినిమా" అని అన్నారు. నిర్మాత జగదీశ్ మాట్లాడుతూ "సినిమా అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు.

బాలా బాబాయ్ కంగ్రాట్యులేషన్స్



నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డుని ప్రకటించడం పట్ల జూనియర్ ఎన్టీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 'ప్రతిష్ఠాత్మకమైన పద్మభూషణ్ అవార్డు పొందినందుకు బాలా బాబాయ్‌కి నా హృదయ పూర్వక శుభాకాంక్షలు. సినిమా రంగానికి మీరు చేసిన అసమానమైన సేవలకు, మీ నిర్విరామ ప్రజా సేవకు దక్కిన గుర్తింపు ఇది' అని ట్వీట్ చేశారు. 'సినీ ప్రపంచానికి మీరు చేసిన అసాధారణమైన సేవలకు లభించిన గుర్తింపు' అని నందమూరి కళ్యాణ్‌రామ్ ట్వీట్ చేశారు.

అభినందనల వెల్లువ

పద్మభూషణ్ అవార్డు రావడంపై పలువురు సినీ ప్రముఖులు ఆనందం వ్యక్తం చేస్తూ బాలకృష్ణను అభినందనలతో ముంచెత్తారు. చిరంజీవి, మహేశ్ బాబు, రవితేజ, విజయ్ దేవరకొండ, నిర్మాతలు అల్లు అరవింద్, నాగవంశీ, నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ బాలకృష్ణను అభినందిస్తూ 'ఎక్స్'లో పోస్టులు పెట్టారు.

రాణా అప్పగింతకు లైన్ క్లియర్

» ముంబై ఉగ్రదాడి నిందితుడికి బిగిసిన ఉచ్చు
» రివ్యూ పిటిషన్‌ను కొట్టేసిన అమెరికా సుప్రీంకోర్టు
» అతన్ని భారత్‌కు తీసుకొచ్చే ప్రక్రియ ప్రారంభం



వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 25: ముంబై ఉగ్రదాడి నిందితుడు తహవ్వుర్ రాణా(64)ను భారతదేశానికి అప్పగించేందుకు అమెరికాలో అడ్డంకులన్నీ తొలగిపోయాయి. అతన్ని భారత్‌కు అప్పగించేందుకు కింది కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ గతేడాది నవంబరు 13న దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు ఈనెల 21న కొట్టివేసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాతి రోజే ఈ తీర్పు రావడం గమనార్హం. రాణా పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా జాతీయుడు. ప్రస్తుతం అతను లాస్ ఏంజెల్స్‌లోని మెట్రోపాలిన్ నిర్బంధ కేంద్రంలో ఉన్నాడు. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్‌ఐ, పాకిస్థాన్ ఆర్మీ కుట్రపన్ని 2008 నవంబరు 26న 10 మంది ఉగ్రవాదులను ముంబైకి పంపి మారణహోమం సృష్టించాయి. ఉగ్రవాదులు 60 గంటలకుపైగా జరిపిన దాడుల్లో 174 మంది మరణించగా, 300 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ ఉగ్రదాడి ప్రధాన సూత్రధారుల్లో ఒకడైన పాకిస్థానీ అమెరికన్ డేవిడ్ కాలెమన్ హెడ్లీకి రాణా అనుచరుడు.

పాక్ ఆర్మీలో డాక్టర్‌గా పనిచేసి..

పాకిస్థాన్ ఆర్మీలో డాక్టర్‌గా పనిచేసిన రాణా 1997లో కెనడాకు, ఆ తర్వాత అమెరికాకు వలస వెళ్లాడు. అమెరికాలో ఇమ్మిగ్రేషన్ సంస్థను కూడా అతను ఏర్పాటు చేశాడు. ముంబైలోని కీలక భవనాల వద్ద రెక్కీ నిర్వహించేందుకు లష్కరే తాయిబా ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ ఆ సంస్థనే ఆశ్రయంగా ఉపయోగించుకున్నాడని ఎన్ఐఏ చార్జిషీట్‌లో పేర్కొంది. హెడ్లీకి ఆశ్రయం కల్పించిన ఆరోపణపైనే అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ రాణాను అరెస్టు చేసింది. ఆ కేసులో హెడ్లీని దోషిగా తేల్చిన అమెరికా కోర్టు.. తగిన ఆధారాలు లేవంటూ రాణాను విడుదల చేసింది. కాగా, ఓ డెన్మార్క్ పత్రికపై దాడికి యత్నించిన కేసులో రాణాకు అమెరికా కోర్టు 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది. రాణాను భారత్‌కు అప్పగించేందుకు తొలుత 2023 మేలో అమెరికాలోని ఒక ఎక్స్‌ట్రాడిషన్ కోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని కాలిఫోర్నియా జిల్లా కోర్టులో అతను సవాలు చేయగా, అక్కడా అతనికి చుక్కెదురైంది. ఆ తర్వాత అమెరికా కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ కూడా అతని సవాలును కొట్టివేసింది. చివరికి అతను సుప్రీంకోర్టును ఆశ్రయించగా, తాజాగా అక్కడ కూడా చుక్కెదురైంది.

భారత్‌కు రప్పించే ప్రక్రియ ప్రారంభం..

రాణా రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేయడంతో అతన్ని భారత్‌కు రప్పించే ప్రక్రియ ప్రారంభమైందని భారత భద్రతా విభాగానికి చెందిన అత్యున్నత అధికారి ఒకరు చెప్పారు. 'రాణాను భారత్‌కు తీసుకురావడం ద్వారా ముంబై ఉగ్రదాడిలో పాకిస్థాన్ భద్రతా యంత్రాంగం సహా అనేక మంది పాకిస్థానీయుల పాత్రకు సంబంధించి మరింత సమాచారాన్ని భారత్ పొందగలుగుతుంది' అని ముంబై ఉగ్రదాడి కేసును వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికం ఒక ఆంగ్ల వార్తా సంస్థకు చెప్పారు. 'రాణా అప్పగింత కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం. ముంబై ఉగ్రదాడిలో ఏమైనా కొత్త కోణాలు ఉంటే, అతని విచారణ ద్వారా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది' అని ముంబై ఉగ్రదాడి కేసును దర్యాప్తు చేస్తున్న ఒక అధికారి చెప్పారు. కాగా, ముంబై ఉగ్రదాడిలో పాకిస్థానీయుల పాత్రను నిరూపించడానికి రాణా అప్పగింత దోహపడుతుందని మరో అధికారి తెలిపారు.

అన్మోల్ బిష్ణోల్ నుంచి నీరవ్ మోదీ వరకు..

రాణాను భారత్‌కు రప్పించేందుకు అడ్డంకులన్నీ తొలగిపోవడంతో దావూద్ ఇబ్రహీం, నీరవ్ మోదీ, టైగర్ మెమన్ లాంటి పరారీలో ఉన్న ఇతర నిందితుల అప్పగింతకూ డిమాండ్లు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదిగా మారిన అర్ష్ దల్లా కెనడాలో నివసిస్తున్నాడు. నిషేధిత ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ అసలైన నాయకుడిగా భావిస్తున్న ఇతనిపై భారత్‌లో హత్య, హత్యాయత్నం సహా 50కిపైగా కేసులున్నాయి. అలాగే జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తమ్ముడు అన్మోల్ బిష్ణోయ్, అనుచరుడు గోల్డీ బ్రార్, విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, మనీలాండరింగ్ కేసులో సంజయ్ భండారీ, సౌరభ్ చంద్రకర్‌ల అప్పగింత కోసం భారత్ వివిధ దేశాల్లో న్యాయపోరాటం చేస్తోంది.

ట్రంప్ టీమ్‌లో ముగ్గురు భారతీయ అమెరికన్లు



వాషింగ్టన్, జనవరి 25: ఇటీవలనే అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. ముగ్గురు భారతీయ అమెరికన్లను తన టీమ్‌లోకి చేర్చుకున్నారు. కుష్ దేశాయ్, రిక్కీ గిల్, సౌరభ్ శర్మలకు కీలక బాధ్యతలు అప్పగించారు. ట్రంప్ తన డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా మాజీ జర్నలిస్టు కుష్ దేశాయ్‌ను నియమించారని వైట్‌హౌస్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. రిక్కీ గిల్‌ను జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సీ) దక్షిణ, మధ్య ఆసియా సీనియర్ డైరెక్టర్‌గా నియమించారు. ఇక సౌరభ్ శర్మ అధ్యక్ష సిబ్బంది కార్యాలయానికి నియమితులయ్యారు. ఆయన సిబ్బంది, నియామకాలు సంబంధిత వ్యవహారాలను చూడనున్నారు. వీరిలో కుష్ దేశాయ్ గత ఏడాది జరిగిన రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సు డిప్యూటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పనిచేశారు. కుష్ దేశాయ్ గతంలో మీడియా సంస్థ 'ది డైలీ కాలర్'లో జర్నలిస్టుగా పనిచేశారు.

డెన్మార్క్ ప్రధానికి ఫోన్లో ట్రంప్ బెదిరింపులు..!

న్యూఢిల్లీ, జనవరి 25: డెన్మార్క్ అధీనంలోని గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేస్తామని ఇప్పటికే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇదే విషయమై ఇటీవల డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 45 నిమిషాల పాటు సాగిన ఫోన్ కాల్‌లో ట్రంప్ బెదిరింపులకు పాల్పడినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ తన కథనంలో వెల్లడించింది. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే విషయమై తాము సీరియస్‌గా యోచిస్తున్నట్లు ట్రంప్ పేర్కొనగా.. ఫ్రెడెరిక్సన్ తోసిపుచ్చారు. తాము గ్రీన్‌లాండ్‌ను ఎట్టి పరిస్థితుల్లో అమ్మబోమని ఆమె తేల్చి చెప్పారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ట్రంప్.. డెన్మార్క్‌ను సుంకాలతో శిక్షిస్తామంటూ హెచ్చరించినట్లు అక్కడి అధికారులు తెలిపారు. ట్రంప్ తీరుకు తామంతా దిగ్భ్రాంతికి గురయ్యామన్నారు.

హజ్ యాత్రలో భారతీయులను కాపాడిన పాక్ అధికారికి బషీర్‌కు పౌర పురస్కారం

కరాచీ, జనవరి 25: గతేడాది హజ్ యాత్రలో తీవ్ర వేడిమి కారణంగా అస్వస్థతకు గురైన 17 మంది భారతీయులు సహా 26 మందిని కాపాడిన పాకిస్థాన్ అధికారి బషీర్‌కు అత్యున్నత పౌర పురస్కారం దక్కింది. ఆయన సేవలను మెచ్చిన పాక్ ప్రభుత్వం తమ దేశంలో మూడో అత్యున్నత పౌర పురస్కారం అయిన 'సితారే ఇంతియాజ్' అవార్డును ఆయనకు ప్రదానం చేసింది. పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ శనివారం అవార్డును బషీర్‌కు బహూకరించారు. గతేడాది హజ్‌యాత్రలో తీవ్రమైన ఎండలు, వడగాలుల కారణంగా చాలామంది యాత్రికులు అనారోగ్యానికి గురయ్యారు. 17 మంది భారతీయులు సహా 26 మందిని బషీర్‌తో పాటు ఆయన బృంద సభ్యులు భుజాలపై ఎత్తుకుని ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడారు.

ఏకీకృత పెన్షన్ పథకం ఏప్రిల్ నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, జనవరి 25: ఏకీకృత పెన్షన్ పథకాన్ని(యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్-యూపీఎస్) అమలు చేస్తున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ శనివారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి యూపీఎస్ అమల్లోకి వస్తుంది. జాతీయ పెన్షన్ వ్యవస్థ(ఎన్‌పీఎస్) పరిధిలోకి వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. ఎన్‌పీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉద్యోగులు యూపీఎస్‌ను ఎంచుకోవచ్చిక. పాత పెన్షన్ పథకం(ఓపీఎస్), ఎన్‌పీఎస్ ఫీచర్ల సమ్మేళనం ద్వారా కేంద్రం గత ఏడాది యూపీఎస్‌ను ప్రవేశపెట్టింది. ఓపీఎస్ తరహాలోనే యూపీఎస్ కూడా పదవీ విరమణ అనంతరం గ్యారెంటీ పెన్షన్ ఆఫర్ చేస్తుంది. పదవీ విరమణకు ముందు 12 నెలల్లో పొందిన కనీస వేతనం(బేసిక్ పే) సగటులో 50 శాతం పెన్షన్‌గా లభిస్తుంది.



చినాబ్ వంతెనపై వందేభారత్ చుక్ చుక్!

» ప్రపంచంలో ఎత్తయిన రైల్వే బ్రిడ్జ్‌పై సుందర దృశ్యం.. ట్రయల్ రన్ సక్సెస్

జనవరి 25: జమ్మూ-కశ్మీర్‌లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రెయిసీలోని చినాబ్ రైల్వే వంతెనపై వందేభారత్ రైలు పరుగులు తీసింది. ఈ మేరకు సెమీ హైస్పీడ్ వందే భారత్ రైలు ట్రయల్ రన్‌ను శనివారం రైల్వేశాఖ విజయవంతంగా నిర్వహించింది. కాట్రాలోని శ్రీ మాతా వైష్ణోదేవి రైల్వేస్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు ఈ రైలు ప్రయాణించింది. మార్గమధ్యలో చినాబ్ వంతెనపై ఈ రైలు పరుగులు పెడుతున్న దృశ్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. దీనికి సంబంధించి నెట్‌లో వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. చినాబ్ వంతెన ఎత్తు నదీగర్భం నుంచి 359 మీటర్లు. ఈ వంతెన పొడవు 1,315 మీటర్లు. కశ్మీర్‌లోని మిగతా ప్రాంతాలను అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో భాగంగా చినాబ్ బ్రిడ్జిని నిర్మించారు. ప్యారిస్‌లోని ఈఫిల్ టవర్‌తో పోల్చితే చినాబ్ రైల్వే వంతెన ఎత్తు 30 మీటర్లు ఎక్కువ కావడం విశేషం. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే 272 కి.మీ మేర ట్రాక్ నిర్మించారు.

బంజరు భూమిని అడవిలా మార్చేసి..



ఇండోర్, జనవరి 25: సమాజ హితం కోసం ఏదైనా చేయాలనే సంకల్ప బలం ఉండాలనే గానీ ఏ అవాంతరాలు ఏమీ చేయలేవు అని చెప్పేందుకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్, 74 ఏళ్ల డాక్టర్ శంకర్‌లాల్ గార్గ్ చక్కని ఉదాహరణ. ఆయనకు రాళ్ల రప్పలతో కూడిన బంజరు భూమి ఉంది. అక్కడ ఆయన బడి, కళాశాల నిర్మిద్దామని అనుకున్నారు. ఇందుకు పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆ భూమిలో మొక్కల పెంపకాన్ని చేపట్టారు! గత 8ఏళ్లలో ఏకంగా 40వేల మొక్కలు నాటారు. ఇప్పుడవి వృక్షాలయ్యాయి. ఒకప్పుడు గడ్డికూడా మొలవని ఆ ప్రాంతమంతా ఇప్పుడు అడవిలా మారింది. దానికి కేసర్ పర్వత్ అని నామకరణం చేశారు. అక్కడ కశ్మీర్ కుంకుమ పువ్వు, నేపాలీ రుద్రాక్ష, థాయిలాండ్ డ్రాగన్ ఫ్రూట్ సహా ఐదువందలకు మించి జాతులకు చెందిన చెట్లున్నాయి.

జమిలికి జైకొడదాం

» రాష్ట్రపతి గణతంత్ర దినోత్సవ సందేశం

న్యూఢిల్లీ, జనవరి 25: జమిలి ఎన్నికలు విధాన వైకల్యాన్ని నివారించే మార్గమని, పాలనలో సుస్థిరతను తెస్తాయని, ఖర్చు భారాన్ని తగ్గిస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటోన్న సాహసోపేత సంస్కరణల ద్వారా ఉత్తమ ఫలితాలు రాబోతున్నాయన్నారు. ముఖ్యంగా ఆర్థిక పురోగతి కారణంగా పేదరికం తగ్గుముఖం పట్టిందన్నారు. డిజిటల్ చెల్లింపులతో పాటు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయడం వ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చిందని రాష్ట్రపతి తెలిపారు. బ్రిటీషు కాలం నాటి చట్టాల స్థానంలో కొత్త చట్టాలు తీసుకురావడాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలో చాలా చోట్ల మహిళల సమానత్వం అనేది సుదూరమైన ఆదర్శంగా ఉన్న కాలంలోనే భారత మహిళలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని రాష్ట్రపతి చెప్పారు.

గణతంత్ర కవాతుకు కర్తవ్యపథ్ సిద్ధం

న్యూఢిల్లీ, జనవరి 25: ఈ ఏడాది గణతంత్ర వేడుకలను 'స్వర్ణమయ భారత్: వారసత్వం, వికాసం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో హాజరవుతున్నారు. ఇప్పటికే సుబియాంతో ఢిల్లీకి చేరుకున్నారు. మరోవైపు, పలు రాష్ట్రాలు, యూటీల నుంచి 16 శకటాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి మరో 15 శకటాలను ప్రదర్శన కోసం ఎంపిక చేశారు. తన సాయుధ పాటవాన్ని చాటుతూ రక్షణ శాఖ తొలిసారి బ్రహ్మోస్, పినాక, ఆకాశ్ వంటి విధ్వంసక క్షిపణులను; యుద్ధ నిఘా వ్యవస్థ 'సంజయ్'ను, భూతలం నుంచి భూతలం దాకా లక్ష్యాన్ని ఛేదించేలా డీఆర్‌డీవో రూపొందించిన 'ప్రళయ్'ను ప్రదర్శించనుంది. త్రివిధ దళాల బంధానికి ప్రతీకగా రూపొందించిన త్రివర్ణ శకటాన్ని ఈ కవాతులో తొలిసారి భాగం చేశారు. ఈ శకటానికి 'శక్తివంతమైన, సురక్షితమైన భారత్'అని పేరుపెట్టారు. ఈ సారి రిపబ్లిక్ వేడుకల్లో 352 మంది ఇండొనేషియాకు చెందిన బ్యాండ్ బృందం ఆకర్షణగా నిలువనుంది.

భారత్,ఇండొనేషియా మధ్య కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ, జనవరి25: రక్షణ ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని భారత్, ఇండొనేషియా నిర్ణయించాయి. భారత పర్యటనలో ఉన్న ఇండొనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ప్రధాని మోదీతో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ఆరోగ్యం, తీరప్రాంత భద్రత, సంస్కృతి, డిజిటల్ రంగాల్లో రెండు దేశాల మధ్య కనీసం 5 ఒప్పందాలు కుదిరాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంతో పాటు దక్షిణ చైనా సముద్రంపై చైనా ఆధిపత్య ధోరణికి చెక్ పెట్టేలా అంతర్జాతీయ నిబంధనలకు లోబడి శాంతి, సుస్థిరత కోసం కలిసి పనిచేయాలని భారత్, ఇండొనేషియా నిర్ణయించాయి.

సునామీలా ముంచేయనున్న
నగదు బదిలీ పథకాలు

» 8 రాష్ట్రాల్లో మహిళలకు ఏటా రూ.1.5 లక్షల కోట్లు
» ఎస్బీఐ నివేదిక వెల్లడి.. సార్వత్రిక ఆదాయ బదిలీకి సిఫారసు

న్యూఢిల్లీ, జనవరి 25: ఉచిత పథకాలు.. ముఖ్యంగా మహిళలను ఉద్దేశించి సునామీ మాదిరిగా అమలు చేస్తున్న ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు రాష్ట్ర ప్రభుత్వాలను ముంచివేయనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మహిళా సంక్షేమం పేరుతో నగదు బదిలీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇవన్నీ రాష్ట్ర ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతాయని భారతీయ స్టేటు బ్యాంకు నిపుణులు ఓ నివేదికలో పేర్కొన్నారు. "పలు రాష్ట్రాల్లో మహిళలను కేంద్రీకృతం చేసుకొని సునామీ లాగా ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు వస్తున్నాయి. ఇవన్నీ ఎన్నికల ముసుగువేసుకున్నవని మేం భావిస్తున్నాం. ఇవి కొన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా గాయపరిచి రక్తమోడేలా చేయనున్నాయి" ఆ నివేదికలో హెచ్చరించారు. ఎనిమిది రాష్ట్రాల్లో మహిళల కోసం అమలు చేస్తున్న నగదు బదిలీ పథకాలను పరిశీలిస్తే వాటి మొత్తం విలువ రూ.1.5 లక్షల కోట్లకు దాటింది. పన్నేతర ఆదాయం అధికంగా ఉన్న ఒడిశాలాంటి కొన్నింటిని మినహాయిస్తే మిగిలిన అన్ని రాష్ట్రాలకు ఇది భారంగానే మారింది. కర్ణాటకలో గృహ లక్ష్మీ పథకం కింద నెలకు రూ.2 వేలు ఇస్తున్నారు. ఇందుకోసం రూ.28,608 కోట్లు వెచ్చిస్తున్నారు. అంటే రాష్ట్ర రెవెన్యూ వసూళ్లలో 11 శాతం అన్న మాట. పశ్చిమ బెంగాల్‌లో లక్ష్మీ భండార్ పథకం కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు ఏక కాల గ్రాంటు కింద రూ.1,000 ఇస్తున్నారు. దీని మొత్తం వ్యయం రూ.14,400 కోట్లు కాగా, అది రాష్ట్ర ఆదాయంలో ఆరు శాతంగా తేలింది. ఢిల్లీలో ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన కింద నెలకు రూ.1,000 ఇస్తుండగా మొత్తం వ్యయం రూ.2,000 కోట్లకు చేరింది. రాష్ట్ర రెవెన్యూ ఆదాయంలో అది 3 శాతం కావడం గమనార్హం. రాష్ట్రాలన్నీ మహిళలకు నేరుగా నగదు బదిలీ చేయాలని భావిస్తున్నందున కేంద్రం కూడా అలాంటి పథకాన్ని అమలు చేయాలన్న ఒత్తిడికి గురికావచ్చని ఆ నివేదిక పేర్కొంది. అయితే, ప్రస్తుత నగదు బదిలీ పథకాలకు బదులుగా సార్వత్రిక ఆదాయ బదిలీ పథకా(యూనివర్సల్ ఇన్‌కం ట్రాన్స్‌ఫర్ స్కీం)న్ని అమలు చేయాలని నివేదిక సూచించింది. ఇందుకు రాష్ట్రాలకు కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఇది జరిగితే కేంద్రం, రాష్ట్రాలు కలిసి అమలు చేసినట్టవుతుంది. ఇదే నగదు బదిలీ పథకాలకు సుస్థిర ప్రత్యామ్నాయ పథకం అని తెలిపింది.

బస్సు కిటికీ నుంచి తల బయటకి.. లారీకి తగిలి తెగిపడిన మహిళ తల

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ కిటికీలో నుంచి తల బయటపెట్టి ప్రాణాలు కోల్పోయింది. ఎదురుగా వస్తున్న మినీ లారీకి తగలడంతో ఆమె తల తెగిపడింది. చామరాజనగర జిల్లా గుండ్లుపేట నుంచి నంజనగూడుకు వెళుతున్న బస్సులో శనివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. మృతురాలిని గుండ్లుపేట తాలూకా హాలహళ్లి గ్రామానికి చెందిన శివలింగమ్మ(50)గా గుర్తించారు. సెకన్ల వ్యవధిలో ఘోరం జరగడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గుండ్లుపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సోనూ సూద్ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సు

ఢిల్లీ, జనవరి 25: స్వచ్ఛంద సంస్థలు విదేశీ నిధులను తెచ్చుకోవడంపై పలు కఠినమైన ఆంక్షలు పెట్టిన తరువాత తొలిగా మూడు సంస్థలకు అనుమతి ఇస్తూ హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. సినీ నటుడు సోనూ సూద్‌కు చెందిన సూద్ చారిటీ ఫౌండేషన్, 14వ దలైలామా స్థాపించిన ది టిబెటన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్(టీఐపీఏ), కోర్టు నేతృత్వంలో ఏర్పడిన కమిటీ నిర్వహణలో నడుస్తున్న బృందావన్‌లోని బంకే బిహారీ ఆలయం... ఈ మూడింటికీ విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్ఏ) లైసెన్సును హోం మంత్రిత్వ శాఖ మంజూరు చేసింది. ఈ ఏడాది మొత్తం మీద 70 సంస్థలకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సులను మంజూరు చేశారు. ఇప్పటి వరకూ మొత్తంగా 1,068 సంస్థలు ఈ లైసెన్సులను కలిగి ఉండగా, 20,713 సంస్థల లైసెన్సులను రద్దు చేశారు.

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- అది రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


కలెక్టర్ అనుదీప్‌కు అవార్డు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

హైదరాబాద్ సిటీ, రవీంద్ర భారతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు ఓటు హక్కును బాధ్యతగా భావించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అది మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ ఎన్నికల నిర్వహణలో ఉత్తమంగా పనిచేసిన పలువురు జిల్లా కలెక్టర్లు, బూత్ లెవల్ అధికారులకు ఉత్తమ ఎన్నికల ఆచరణాత్మక అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఎన్నికల ఆచరణాత్మక అవార్డులను టూరిజం డైరెక్టర్, ఐఏఎస్ హనుమంత్ కొనిబా, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, కొమురం బీమ్ ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దొత్రే, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మంచిర్యాల కలెక్టర్ బి.రాహుల్, సిద్దిపేట కలెక్టర్ గరిమా అగర్వాల్, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ ఐజీ రమణకుమార్, ఏసీపీ స్పెషల్ బ్రాంచ్-వరంగల్ జితేందర్‌రెడ్డి, ఆర్డీవో ఎన్. జగదీశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ బోడకుంటి తిరుపతి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఆర్‌వో విజయకుమార్ తదితరులు అందుకున్నారు.

గణతంత్ర రాజ్యంగా దేశం వర్ధిల్లాలి

- ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం
- ప్రజలంతా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో జీవించాలి: గవర్నర్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక, సార్వభౌమ గణతంత్ర రాజ్యంగా భారతదేశం వర్ధిల్లాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలను స్మరిస్తూ సంవిధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఏడాదిలోనే అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో వివరించారు. గణతంత్ర దినోత్సవం నాడే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషకరమైన పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలంగాణలో ప్రజలంతా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ పటిష్ఠ అమలుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈఐసీబీఐ వైస్ చైర్మన్‌గా బాలయ్యనాయుడు

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): యూరప్ ఇండియా సెంటర్ ఫర్ బిజినెస్ ఇండస్ట్రీ (ఈఐసీబీఐ) వైస్ చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం బాలయ్యనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఈఐసీబీఐ పాలక మండలి శనివారం ప్రకటన చేసింది. భారత్-యూరప్ మధ్య వ్యాపార, వాణిజ్య బంధాన్ని మరింత పటిష్టపరచడంలో భాగంగా లక్ష్మీకాంతం నియామకం జరిగిందని ఈఐసీబీఐ తెలిపింది. ఈ పదవిలో ఆయన రెండేళ్లపాటు కొనసాగనున్నారు.

శ్రావణ్‌కుమార్‌కు జీవన్ రక్షా పదక్ అవార్డు

న్యూఢిల్లీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మనుషుల ప్రాణాలను కాపాడడంలో కృషి చేసినందుకు ఇచ్చే జీవన్ రక్షా పదక్ పురస్కారానికి తెలంగాణకు చెందిన బండకింది శ్రావణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఇటు ఆంధ్రప్రదేశ్ నుంచి నెల్లి శ్రీనివాసరావును ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 49 మందికి 3 విభాగాల జీవన్ రక్షా పదక్ అవార్డులు ప్రదానం చేయడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదం తెలిపారు. ఈ పురస్కారం కింద పతకం, కేంద్ర హోంమంత్రి సంతకం చేసిన సర్టిఫికెట్, ఏకమొత్తంలో ద్రవ్య భత్యం అందజేస్తారు.

మహిళా సంఘం సభ్యురాలికి అరుదైన గౌరవం

- ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు ఆహ్వానం


దాసరి కల్పన

శాయంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు దాసరి కల్పనకు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో గణతంత్ర ఉత్సవాల్లో సెర్ప్ తరఫున మహిళా పారిశ్రామికవేత్తగా పాల్గొనడంతోపాటు కేంద్ర మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. సాధారణ మహిళగా ఉన్న కల్పన స్వయం సహాయక సంఘంలో సీఆర్పీగా పలు రాష్ట్రాల్లో సేవలు అందించడంతోపాటు స్వయం ఉపాధితో పారిశ్రామికవేత్తగా ఎదిగి తోటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు.

అన్నదాతలారా ఆత్మహత్యలొద్దు: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా రైతు నర్సయ్య ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోవద్దని, రైతులకు జోడెద్దుల మాదిరి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో దశాబ్దాల పాటు వ్యవసాయ రంగం దగాపడిందని ఆయన ఆరోపించారు. కాగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారం రోజుల్లో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం విషాదకరమని మాజీమంత్రి హరీశ్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రిటిష్ విధానంలోనే బీజేపీ పాలన

- కులమతాలుగా విభజించి పాలిస్తున్న మోదీ
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్
- రేవంత్ రెడ్డి కేంద్రాన్ని అడుక్కుంటున్నారు: రాఘవులు
- సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు ప్రారంభం


సీపీఎం రాష్ట్ర మహాసభల్లో బృందా కారత్, రాఘవులు

సంగారెడ్డి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విభజించి పాలించాలనే బ్రిటిష్ విధానాన్నే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ ఆరోపించారు. దేశ ప్రజలను కుల మతాల పేరిట విభజిస్తూ ప్రధాని మోదీ పరిపాలిస్తున్నారన్నారు. సంగారెడ్డిలో శనివారం ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.బీజేపీ హయాంలో పెట్టుబడిదారుల ఆస్తులు 400రెట్లు పెరిగాయని ఆరోపించారు. కర్ణాటక, తెలంగాణలో ఉన్న ఇండియా కూటమి ప్రభుత్వాలు బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆమె అన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఒక సీఎంగా కేంద్రాన్ని నిధుల కోసం డిమాండ్ చేయకుండా దోసిలి పట్టి అడుక్కుంటున్నారని విమర్శించారు.

నలుగురు హైకోర్టు అదనపు జడ్జిల ప్రమాణం

- 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ అదనపు న్యాయమూర్తులు జస్టిస్ వై రేణుక, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఈడ తిరుమలదేవి, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావుతో ప్రమాణం చేయించారు. వీరు నలుగురూ న్యాయాధికారుల కోటాలో హైకోర్టు జడ్జిలుగా ఎంపికయ్యారు. మొదటి కోర్టు హాలులో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జనరల్.. రాష్ట్రపతి జారీ చేసిన నియామక ఉత్తర్వులను చదివి వినిపించారు. అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. నూతన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 42 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన హైకోర్టులో ప్రస్తుతం 26 మంది సేవలందిస్తున్నారు. కొత్తగా నలుగురి నియామకంతో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది.

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాప్!

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలు, సినీ తారల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. కాగా, గవర్నర్‌గా వెళ్లకముందు రాష్ట్ర బీజేపీ నాయకుల్లో ఇంద్రసేనారెడ్డి అత్యంత సీనియర్. దీనికితోడు ఆర్ఎస్ఎస్ పెద్దలతో ఉన్న సంబంధాల నేపథ్యంలోనే ఆయన ఫోన్‌ను ట్యాపింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఇంద్రసేనారెడ్డి 2023 అక్టోబరు 6వ తేదీన త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయినప్పటికీ, రాజకీయ నాయకుల కదలికలపై నిఘా వేసిన అప్పటి ఎస్ఐబీ బృందం.. ఆయన ఫోన్ ట్యాపింగ్‌ను కొనసాగించింది. ఇటీవల ఇంద్రసేనారెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) నర్సింహను పోలీసులు విచారించగా ఈ సంగతి బయటపడినట్లు తెలుస్తోంది. మరోవైపు ట్యాపింగ్ కేసులో పోలీసు అధికారులు ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావులను పోలీసులు అరెస్టు చేశారు. విదేశాలకు పారిపోయిన ఎస్ఐబీ నాటి చీఫ్ ప్రభాకర్‌రావు, మీడియా చానల్ యజమాని శ్రవణ్‌రావులను వెనక్కి రప్పించే ప్రయత్నాలు ప్రారంభించారు. అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశాల మేరకు, అమెరికాలో అక్రమంగా ఉంటున్న విదేశీయులను వారివారి దేశాలకు పంపించే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే, అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావును ఏ విధంగా రప్పించాలనే విషయంలో అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని డీజీపీ జితేందర్ ఇటీవల తెలిపారు.

కేజీఎఫ్ తరహాలో నల్ల మల్లారెడ్డి ఆగడాలు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్య
- దివ్యానగర్‌లో 4 కిలోమీటర్ల ప్రహరీ కూల్చివేసిన హైడ్రా అధికారులు


కాచవానిసింగారం-దివ్యానగర్ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని కూల్చేస్తున్న హైడ్రా అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): "పంచాయతీ లేఔట్‌తో అనుమతి తీసుకుని, కాలనీల చుట్టూ ప్రహరీలు కట్టారు. నాలుగైదు కాలనీలకు ఒకే ఎంట్రీ, ఒకే ఎగ్జిట్ పెట్టిన డెవలపర్ నల్ల మల్లారెడ్డి.. కేజీఎఫ్ సినిమాలో మాదిరిగా నియంతలా ప్రవర్తిస్తున్నారు. ఆ లేఔట్‌లో ప్లాట్ కొనాలన్నా.. అమ్మాలన్నా మల్లారెడ్డి అనుమతి లేనిదే లావాదేవీలు జరగవు. అమ్మేవారు రూ.50వేలు చెల్లించి, మల్లారెడ్డి ఇచ్చే ఎన్‌వోసీ తీసుకోవాల్సిందే. డెవలప్‌మెంట్‌ను ఆయనకే అప్పగించాలి. ఇల్లు నిర్మించే కాంట్రాక్ట్ కూడా ఆయనకే ఇవ్వాలి" అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. దివ్యానగర్-కాచవానిసింగారంతోపాటు.. ఆరు కాలనీల్లో రోడ్లకు అడ్డంగా 4 కిలోమీటర్ల మేర నల్లమల్లారెడ్డి నిర్మించిన ప్రహరీని హైడ్రా శనివారం కూల్చివేసింది. ఉదయం 3.30 గంటల సమయంలో ఈ ప్రాంతానికి కొంత దూరంలో సుమారు 25 ఎక్స్‌కవేటర్లతో మోహరించిన హైడ్రా బృందాలు.. ఉదయం 7గంటల సమయంలో దివ్యానగర్, సుప్రభాత్ టౌన్‌షిప్‌లకు చేరుకున్నాయి. ఆ వెంటనే.. మెయిన్‌గేట్లు, ప్రహరీల కూల్చివేతలను మొదలుపెట్టాయి. సుప్రభాత్ టౌన్‌షిప్ వద్ద ఎలాంటి ఉద్రిక్తతలు లేకున్నా.. దివ్యానగర్ వద్ద మల్లారెడ్డి అనుచరులు హైడ్రా సిబ్బందిని ప్రతిఘటించారు. హైడ్రాకు, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు నినాదాలు చేశారు. కూల్చివేతల అనంతరం దివ్యానగర్, బాబానగర్, కాచవానిసింగారం పరిసరాల ప్రజలు టపాసులు కాలుస్తూ.. సంబురాలు చేసుకున్నారు. 20 ఏళ్లుగా తమను నల్ల మల్లారెడ్డి అనేక ఇబ్బందులకు గురిచేశారని, ఈ ప్రాంతంలో ఓ నియంతలా వ్యవహరించాడని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రాకు ధన్యవాదాలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ కూల్చివేతలకు సంబంధించి రంగనాథ్ వివరాలను వెల్లడిస్తూ.. ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

30 ఏళ్లుగా సింగరేణి ఉద్యోగుల తంటాలు

"నల్లమల్లారెడ్డి 1990లో కాచవానిసింగారం, కొర్రెముల రెవెన్యూ పరిధుల్లో 200 ఎకరాల్లో దివ్యానగర్‌తోపాటు మరో ఆరు గ్రామపంచాయతీ లేఔట్లు చేశారు. వీటిల్లో మొత్తం 2,200ప్లాట్లు ఉన్నాయి. అప్పట్లో సింగరేణి ఉద్యోగులు సుమారు 1,000 మంది ఇక్కడి ప్లాట్లను కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వీరంతా ప్లాట్ల డెవలప్‌మెంట్ కోసం మల్లారెడ్డికి 15 ఏళ్ల క్రితం రూ.10.5 కోట్లు అందజేశారు. లేఔట్‌లో ముందుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని వీరి మధ్య ఒప్పందం కుదిరింది. మల్లారెడ్డి ఆ మొత్తాన్ని వెంచర్ అభివృద్ధికి కాకుండా.. కాలనీ భద్రత పేరుతో 4 కిలోమీటర్ల మేర ఎత్తైన ప్రహరీ నిర్మించారు. ఎలాంటి మౌలిక సదుపాయాలను కల్పించలేదు" అని రంగనాథ్ వివరించారు. దివ్యానగర్‌తోపాటు.. మరో ఆరు కాలనీలకు రెండుచోట్ల నుంచి మాత్రమే రాకపోకలకు ఏర్పాటు చేశారని తెలిపారు. "ఆ ప్రాంతంలో మార్కెట్ విలువ రూ.35 వేలు ఉంటే.. మల్లారెడ్డి తక్కువకే కొనేవారు. ఇలా మధ్య తరగతి ప్రజలను దోచుకున్నారు. కాలనీల్లోని పార్కులను, ఓపెన్ స్థలాలను ఆక్రమించారు. వాటిల్లో వ్యవసాయం చేశారు" అని వెల్లడించారు. గేటెడ్ కమ్యూనిటీకి మాత్రమే ప్రహరీని నిర్మించుకునే అవకాశం ఉంటుందని, పంచాయతీ లేఔట్లకు కాదని స్పష్టం చేశారు. ఇతర కాలనీల వారికి రోడ్డు సదుపాయం లేకుండా మల్లారెడ్డి ఓ నియంతలా వ్యవహరించేవారని చెప్పారు. సింగరేణియన్ సంక్షేమ సంఘం సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 8న తాను స్వయంగా దివ్యానగర్‌లో పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించానన్నారు. ఈ నెల 23న నల్లమల్లారెడ్డి, సింగరేణియన్ సంక్షేమ సంఘం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. శనివారం ఉదయం ప్రహరీతో పాటు.. రోడ్లకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేసినట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు, మునిసిపల్ చట్టాల ప్రకారం ఏదైనా రహదారి ఆక్రమణలకు గురైతే నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయవచ్చన్నారు.

గోడలు, గేట్లు కూల్చడం అక్రమం: మల్లారెడ్డి

కాలనీలకు రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న గోడలను, గేట్లను హైడ్రా అధికారులు కూల్చడం అక్రమమని నల్ల మల్లారెడ్డి ఆరోపించారు. రోడ్లు, ప్రహరీ కూల్చొద్దని కోర్టు ఆదేశాలున్నా.. హైడ్రా కమిషనర్ కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తంచేశారు.

రాజ్యసభకు విజయసాయి రాజీనామా

- వెంటనే ఆమోదించిన చైర్మన్ ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతోనే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని, పదవులు ఆశించి గానీ, కేసులు మాఫీ చేస్తామనే హామీ తీసుకునిగానీ ఆ నిర్ణయం తీసుకోలేదని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను ఆయన నివాసంలో కలిసి ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖను అందించారు. ఆయన రాజీనామాను ధన్‌ఖడ్ ఆమోదించినట్లు ఆ వెంటనే రాజ్యసభ సెక్రటేరియెట్ బులిటెన్ విడుదల చేసింది. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఇదే విషయం విజయసాయి కూడా ధ్రువీకరించారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారాయనీ, తన అశక్తత వల్ల ఎంపీగా రాష్ట్రానికీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వైసీపీకి న్యాయం చేయలేననే ఆలోచనతోనే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని వివరించారు. తన రాజీనామా వెనుక ఎవరి ఒత్తిడీ లేదన్నారు. తనపై నమోదైన కేసులను ధైర్యంగా ఎదుర్కొంటానని, భయపడేతత్వం తన వంట్లో లేదని చెప్పారు. రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక లండన్‌లో ఉన్న వైసీపీ అధినేత జగన్‌కు ఫోన్ చేసి అన్ని విషయాలు మాట్లాడానని, ఆ తర్వాతనే రాజీనామా సమర్పించానని చెప్పారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిది గుండెపోటు మరణమని తనకు అందిన సమాచారాన్నే మీడియాకు తెలిపానని విజయసాయిరెడ్డి అన్నారు. ఈ విషయమై విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. 'వివేకానందరెడ్డి మరణించిన రోజు నాకు ఒక విలేకరి ఫోన్ చేసి విషయం చెప్పారు. నేను ఆశ్చర్యపోయాను. వెంటనే పులివెందులకు ఫోన్‌చేసి, వైఎస్ అవినాశ్‌రెడ్డిని అడిగాను. పక్కన ఉన్న ఎవరికో అవినాశ్ ఫోన్ ఇచ్చారు. ఫోన్‌లో ఆ వ్యక్తి వివేకా గుండెపోటుతో చనిపోయారని చెప్పాడు. నాకు వచ్చిన ఆ సమాచారాన్నే నేను విలేకరులకు చెప్పాను" అని విజయసాయిరెడ్డి తెలిపారు.

తెలంగాణకు 21 సేవా పతకాలు

- ఇద్దరు పోలీసు అధికారులకు రాష్ట్రపతి విశిష్టసేవా పతకాలు
- 12 మందికి ప్రతిభసేవా పతకాలు

న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోంశాఖ ప్రకటించిన సేవా పతకాలలో తెలంగాణకు 21, ఆంధ్రప్రదేశ్‌కు రెండు పతకాలు లభించాయి. శనివారం దేశవ్యాప్తంగా పోలీస్, ఫైర్ సర్వీస్, హోంగార్డ్ అండ్ సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీస్‌లకు చెందిన 942 మంది సిబ్బందికి కేంద్ర హోంశాఖ శౌర్య, సేవా పతకాలను ప్రకటించింది. వీరిలో 95 మందికి శౌర్య పతకాలు (గ్యాలెంట్రీ మెడల్స్), 101 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 746 మందికి ప్రతిభా సేవా పతకాలు (మెడల్స్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) లభించాయి. తెలంగాణ పోలీస్ శాఖలో ఉత్తమ సేవలకు గాను ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, మరో 12 మందికి ప్రతిభా సేవా పతకాలు దక్కాయి. హైదరాబాద్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ మెట్టు మాణిక్ రాజ్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు లభించాయి. కార్తికేయ(ఐజీ), అన్నల ముత్యంరెడ్డి(ఎస్పీ), కమల రాం కుమార్(డీసీపీ), మహమ్మద్ ఫజ్లుర్ రెహమాన్(డీఎస్పీ), కోటపాటి వెంకట రమణ(డీఎస్పీ), అన్ను వేణుగోపాల్(డీఎస్పీ), అనుమల నిరంజన్‌రెడ్డి(ఇన్‌స్పెక్టర్), ఏఎస్ఐలు రణవీర్ సింగ్ ఠాకూర్, పీటర్ జోసెఫ్ బహదూర్, మహ్మద్ మొయినుల్లాఖాన్, హెడ్ కానిస్టేబుళ్లు వడ్త్య పత్యానాయక్, ఎండీ అయూబ్ ఖాన్‌లకు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. ఫైర్ సర్వీస్ విభాగంలో తెలంగాణలో అగ్నిమాపక సిబ్బందిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు మోరుబోయిన, సుబ్బయ్య చావల, జనార్దన్ కారుకూరికి, హోంగార్డ్ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగంలో హోంగార్డులు ఈశ్వరయ్య మంత్రి, యాదగిరి మేడిపల్లి, లక్ష్మణ్ కోమటి, ఐలయ్య కల్లెంలకు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. కాగా, కరెక్షనల్ సర్వీస్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కడలి అర్జునరావు(చీఫ్ హెడ్ వార్డర్), వీరవెంకట సత్యనారాయణ ఉండ్రాజవరపు(వార్డర్)కు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. మధ్యప్రదేశ్ ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన తెలుగు వ్యక్తి, సీబీఐ జాయింట్ డైరక్టర్‌గా ఉన్న దాట్ల శ్రీనివాస వర్మకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం లభించింది. పతకాలు సాధించిన పోలీసులకు డీజీపీ జితేందర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఇద్దరు ఆర్పీఎఫ్ అధికారులకు రాష్ట్రపతి పతకాలు


శ్రీనివాసరావు


రవిచంద్రన్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులకు రాష్ట్రపతి పతకాలు లభించాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విశిష్ట సేవలందించిన సికింద్రాబాద్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ దొంతగాని శ్రీనివాసరావు, మౌలాలి శిక్షణ కేంద్రం అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పుత్తూరు రవిచంద్రన్‌లను ఈ పతకాలకు ఎంపిక చేశారు.

దేశంలోనే అతిపెద్ద ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ

శంకర్‌పల్లిలో ఏర్పాటుకు జెన్‌కో నిర్ణయం.. 250 మెగావాట్లతో బ్యాటరీ స్టోరేజీకి టెండర్లు

- గంటకు 2.5 లక్షల యూనిట్ల కరెంట్‌కు చాన్స్
- రాత్రిళ్లు తక్కువ ధరకు కొని.. స్టోరేజీకి ప్రణాళిక
- డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు విక్రయాల లక్ష్యం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాత్రిళ్లు తక్కువ ధరకు కరెంటు కొని, దాన్ని నిల్వ చేసి.. పగటిపూట ఎక్కువ ధరకు విక్రయిస్తే..! ఖజానాకు కాసుల పంటే..! ఈ తరహాలో 250 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థ ఏర్పాటుకు తెలంగాణ జెన్‌కో సిద్ధమైంది. దీని ద్వారా డిమాండ్ మేరకు గంటకు 2.5 లక్షల యూనిట్లు.. రెండు గంటలకు 5 లక్షల యూనిట్లను సరఫరా చేసే అవకాశాలుంటాయి. హైదరాబాద్ శివార్లలోని శంకర్‌పల్లిలో ఉన్న ట్రాన్స్‌కో 440/220 కేవీ సబ్‌స్టేషన్‌కు చెందిన వందల ఎకరాల భూముల్లో బ్యాటరీ స్టోరేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం పోటీ బిడ్డింగ్‌ను ఆహ్వానిస్తూ.. శనివారం టెండర్లను ఆహ్వానించింది. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే.. దేశంలోనే అతిపెద్ద విద్యుత్తు బ్యాటరీ నిల్వ ప్లాంట్‌తో తెలంగాణ ముందంజలో ఉంటుంది. ప్రస్తుతం పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నందగావ్‌లో 100 మెగావాట్ల సామర్థ్యమున్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ ఉంది. దేశంలోనే ఇది పెద్ద ప్రాజెక్టు.

గంటకు 2.5 లక్షల యూనిట్లు

పగటిపూట విద్యుత్తు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో.. ఆ సమయంలో బహిరంగ విపణిలో యూనిట్ ధర రూ.9 నుంచి రూ.20దాకా పలుకుతోంది. డిమాండ్ చాలా వరకు పడిపోయే రాత్రి వేళల్లో తక్కువ ధరకు లభించే విద్యుత్తును కొనుగోలు చేసి, నిల్వ చేసేలా జెన్‌కో ప్రణాళికలు రూపొందించింది. అంతేకాకుండా.. పగటిపూట సౌర విద్యుదుత్పాదనకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ఉత్పత్తితోపాటు.. సౌర విద్యుత్తును కొనుగోలు చేసి, నిల్వ చేసుకోవచ్చని జెన్‌కో భావిస్తోంది. ఇలా.. గంటకు 2.5 లక్షల యూనిట్ల కరెంటును అందించేలా.. 250 మెగావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు సెకీ ద్వారా టెండర్లను ఆహ్వానించింది. యూనిట్‌కు రూ.3.41లకు బ్యాటరీ స్టోరేజీ ద్వారా విద్యుత్తును అందించేందుకు పలు సంస్థలు సిద్ధమైనట్లు తెలిసింది. అయితే.. ఒక మెగావాట్ స్టోరేజీకి రూ.2.20 కోట్ల నుంచి రూ.2.40 కోట్ల వ్యయం, పావు ఎకరం భూమి అవసరం. ఇలా శంకర్‌పల్లి వద్ద ట్రాన్స్‌కోకు చెందిన 70 ఎకరాల్లో బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థ ఏర్పాటుకు భూములను లీజుకు ఇచ్చేందుకు జెన్‌కో సిద్ధమైంది. బిడ్‌ను దక్కించుకునే సంస్థలకు కేంద్రం నుంచి నిధులు కూడా సమకూరే అవకాశాలున్నాయి. 2026కల్లా గంటకు 4వేల మెగావాట్ల కరెంటు ఇచ్చేలా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థల ఏర్పాటుకు 40% వయబిలిటీ గ్యాప్ ఫండ్(వీజీఎఫ్) కింద కేంద్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ అందజేయనుంది. అంటే.. సుమారు రూ.600 కోట్ల అంచనా వ్యయానికి రూ.240 కోట్లు కేంద్రం నుంచి అందుతాయి. క్లీన్ ఎనర్జీ ఫండ్ కూడా వచ్చే అవకాశాలుంటాయి. అంతేకాదు.. ప్రపంచ బ్యాంకు సాయం కూడా అందుతుంది. ఇన్ని వెసులుబాట్లు ఉన్న నేపథ్యంలో తక్కువ ధరకు కరెంటు ఇచ్చేందుకు సుముఖంగా ఉండే సంస్థకే జెన్‌కో నుంచి వర్క్ ఆర్డర్ దక్కనుందని తెలుస్తోంది. నూతన ఇంధన పాలసీకి అనుగుణంగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తారని సమాచారం. 2034కల్లా 7,917 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని ఈ పాలసీ ద్వారా ప్రభుత్వం సంకల్పించింది. జెన్‌కో నిర్ణయం పట్ల ఆ సంస్థ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. రూ.360 కోట్ల పెట్టుబడిని జెన్‌కోనే భరిస్తే ఈ ప్రాజెక్టు భవిష్యత్‌లో బంగారుబాతుగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు.

ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్లు ఇవ్వం

- రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో పెట్టాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- బీజేపీలో చేరిన కరీంనగర్ మేయర్ సునీల్‌రావు



కరీంనగర్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇచ్చే ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఒక్క ఇల్లు కూడా ఇవ్వబోమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే రేషన్‌కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఇకపై కొత్త రేషన్ కార్డులపై సీఎంతోపాటు ప్రధాని ఫొటో కూడా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. అవసరమైతే కేంద్రమే నేరుగా పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసే విషయాన్ని ఆలోచిస్తామని చెప్పారు. కరీంనగర్ మేయర్ సునీల్‌రావుతో పాటు ఇద్దరు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి శనివారం బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంజయ్ మాట్లాడారు. దావోస్ వేదికగా రూ.లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చేస్తున్న ప్రచారమంతా ఉత్తదేనని కొట్టిపారేశారు. రూ.ఐదు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రా బోతున్నాయని గత పదేళ్లలో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారని, ఆచరణలో పదో వంతు కూడా రాలేదని విమర్శించారు. '2014 నుండి ఇప్పటి వరకు దావోస్ పెట్టుబడులకు సంబంధించి ఎంత మొత్తంలో ఎంవోయూలు జరిగాయి? ఎంత మందికి ఉద్యోగాలిస్తామన్నారు? ఆచరణలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయి..? ఎంత మందికి ఉద్యోగాలిచ్చారు..?' శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే దావోస్ పెట్టుబడుల పేరుతో ప్రచార దుకాణాన్ని తెరిచారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించ డం లేదని, పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేంద్రం నిధులతోనే పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. కాగా, కరీంనగర్‌లో జరిగిన ప్రతి స్కామ్ వెనక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హస్తముందని, అవినీతికి ఆయన కేరాఫ్ అని కరీంనగర్ మేయర్ సునీల్‌రావు ఆరోపించారు.

ఇందిరమ్మ ముందు మోదీ ఎంత?

- ఇళ్ల పథకానికి ఆమె పేరు పెడితే నిధులివ్వరా?
- బండి సంజయ్‌పై టీపీసీసీ చీఫ్ ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'బలహీన వర్గాల ఇళ్ల పథకానికి ఇందిరమ్మ పేరు ఎందుకు పెట్టొద్దు? ప్రపంచంలోనే ఉక్కు మహిళగా పేరు పొందిన ఇందిరమ్మ పేరు పెడి తే బండి సంజయ్‌కు వచ్చిన కడుపు నొప్పి ఏంటి? ఇందిరమ్మ త్యాగం ముందు బీజేపీ త్యాగం ఎంత.. మోదీ పర్సనాలిటీ ఎంత?' అంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నిలదీశారు. కేంద్ర పథకాలకు ఇందిరమ్మ పేరు పెడితే నిధులివ్వబోమంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏ హక్కుతో అన్నారని ప్రశ్నించారు. ఇది ఒక రకంగా ప్రజల ఆకాంక్షలను అవమానించినట్లేనని, ఇందుకు సంజయ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం బలైన ఇందిరమ్మ కుటుంబాన్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా దేశ ప్రజలు క్షమించబోరన్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ నాలుగు ముక్కలు కాబోతుందని, ఆ పార్టీలో తండ్రీ, కొడుకు తప్ప ఎవరూ ఉండబోరని జోస్యం చెప్పారు. కక్ష సాధింపు రాజకీయాలన్నది కాంగ్రెస్ సిద్ధాంతం కానే కాదని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. గతంలోని కాంగ్రెస్ సీఎంల నుంచి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వరకూ ఎవరూ కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడలేదన్నారు. ప్రతి పేదకూ సంక్షేమం అందాలన్న సంకల్పంతో నాలుగు పథకాలు ప్రారంభిస్తున్నామని, ప్రతి గ్రామంలోనూ దీన్ని పండుగగా జరపాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా నిలబడాలి

- వారు కష్టపడినందువల్లే అధికారంలోకి వచ్చాం: ఉత్తమ్
- కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు: మహేశ్‌కుమార్



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): "క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు అనేక కష్ట నష్టాలను ఓర్చుకుని పార్టీ పటిష్టత కోసం పనిచేయడం వల్లనే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. అధికారంలోకి వచ్చిన మనం.. ఇప్పుడు ఆ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలబడాలి. వారిని ఆదుకోవాలి" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, అందరికీ తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుందని భరోసా ఇచ్చారు. గాంధీభవన్‌లో శనివారం పార్టీ సీనియర్ నేత ప్రేమ్‌లాల్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రేమ్‌లాల్ వంటి క్రమశిక్షణ కలిగిన నాయకుడు లేకపోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబాన్ని తాను వ్యక్తిగతంగా, ప్రభుత్వ పరంగానూ ఆదుకుంటానని చెప్పారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోవడం తన కర్తవ్యమని, కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు లభించేలా చేస్తామని చెప్పారు. కొందరికి అవకాశం వచ్చిందని, మిగతా వారికి లభించేలా ప్రయత్నాలు చేస్తామన్నారు.

నేటి నుంచి విప్లవాత్మక పథకాల అమలు: ఉత్తమ్

దేశంలో కెల్లా విప్లవాత్మక పథకాలు రాష్ట్రంలో అమలు కాబోతున్నాయని మంత్రి ఉత్తమ్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు కాబోతున్నాయని, కొత్త రేషన్ కార్డులూ ఇవ్వనున్నామని చెప్పారు. రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం కూడా ఇవ్వబోతున్నామని తెలిపారు. పదేళ్లలో రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇవ్వని బీఆర్ఎస్ నేతలు.. తమ ప్రభుత్వాన్ని విమర్శించడం అవివేకమన్నారు.

ప్రతిపక్షాలు రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి

- అభివృద్ధి, సంక్షేమం తెలంగాణ ప్రజల హక్కు: పొన్నం



మహేశ్వరం/ఎల్‌బీనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై లేనిపోని రాద్ధాంతాలు చేయడం మానుకొని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కోరారు. శనివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మునిసిపాలిటీలో రూ.1.30కోట్లు, మహేశ్వరంలో రూ.1.65 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రం పదేళ్ల దొరల గడిలో బందీగా ఉండిపోయిందని, ఇప్పుడు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ప్రజాపాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు.



ములుగులో అధికారులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న మంత్రి సీతక్క

స్టెప్పులేసిన మంత్రి సీతక్క

- ములుగులో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

ములుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి ధనసరి అనసూయ సీతక్క. డీజే టిల్లు సినిమా పాటలు, తీన్‌మార్ మ్యూజిక్‌కు స్టెప్పులేశారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో త్రీకే రన్ జరిగింది. కార్యక్రమాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించిన సీతక్క.. యువతీ యువకులతో కలిసి పరుగు పందెంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, పోలీసు సిబ్బందితో కలిసి సీతక్క డ్యాన్స్ అలరించారు. పౌష్టికాహారం తీసుకుంటూ నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె సూచించారు.

రూ.45,500 కోట్లతో హైడ్రోపవర్ ప్రాజెక్టులు

- 3,400 మె.వా సామర్థ్యంతో ఏర్పాటు: సన్ పెట్రోకెమికల్స్

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రూ.45,500 కోట్ల పెట్టుబడులకు నిర్ణయం తీసుకున్నామని సన్ పెట్రోకెమికల్స్ ప్రకటించింది. ఈ మేరకు ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందాలపై బీఆర్ఎస్ అనుమానాలను వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆ సంస్థ శనివారం ఓ ప్రకటనను విడుదల చేసింది. నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో 3,400 మెగావాట్ల సామర్థ్యంతో మూడు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసింది. అదనంగా 5,440 మెగావాట్లతో సమీకృత సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 7 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీ తెలిపారు.

పారిశ్రామిక పార్కుకు భూములు ఇవ్వం

- తేల్చి చెప్పిన లగచర్ల, రోటిబండ తండా రైతులు

దుద్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలెపల్లి, హకీంపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కుకు తమ భూములు ఇవ్వబోమని లగచర్ల, రోటిబండ తండా, పులిచర్ల కుంట తండాల రైతులు తేల్చిచెప్పారు. శనివారం కొంత మంది రైతులు వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం, తాండూర్ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాలు అందించారు. కాగా, పార్కు కోసం భూములు ఇచ్చేందుకు పలువురు రైతులు ముందుకు వచ్చారు. శనివారం లగచర్లకు చెందిన కొందరు రైతులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భూ సేకరణలో అభ్యంతరాలపై చర్చించారు. ఈ సమావేశానికి వచ్చిన 30 మంది రైతులు వారి భూములు ఇచ్చేందుకు అంగీకార పత్రాలను అందించారు. రైతులకు ఎకరానికి రూ.20లక్షల నగదు, 150 గజాల ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

బీఆర్ఎస్‌తో కిషన్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం

- రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తే శాపనార్థాలా?: ఆది శ్రీనివాస్
- కిషన్‌రెడ్డీ.. కేంద్రమంత్రివా.. పాలేరువా?: చామల

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను ప్రపంచ ఆర్థిక దిగ్గజాల ముందుంచి.. రూ.1.79 లక్షల కోట్ల మేర పెట్టుబడులు సీఎం రేవంత్‌రెడ్డి తెస్తే.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వచ్చిన నొప్పి ఏంటని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిలదీశారు. ఆరేళ్లుగా కేంద్రమంత్రిగా ఉన్న ఆయన.. తెలంగాణకు కొత్త ప్రాజెక్టు ఏమైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి.. బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంలో ఉన్నాడంటూ ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు చూసి కిషన్‌రెడ్డి గర్వించాలే కానీ.. శాపనార్థాలు పెట్టేలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. 'నువ్వు మోదీ క్యాబినెట్లో మంత్రివా.. లేకుంటే కేసీఆర్ ఫాంహౌస్‌లో పాలేరువా? నువ్వు పెట్టుకున్న గులాబీ కళ్లజోడు తీసి చూడు..! అన్నీ సజావుగానే కనిపిస్తయి' అంటూ కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ తొత్తులుగా ఇంకెన్ని రోజులు పనిచేస్తారంటూ కిషన్‌రెడ్డిపై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. వైఎస్ఆర్‌కు అప్‌డేటెడ్ వర్షన్.. రేవంత్ అని మత్స్యకార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్ అన్నారు.

పెట్టుబడులను చూసి కడుపు మంటా?

- 'ఈనో' వాడండంటూ కాంగ్రెస్ ఫ్లెక్సీలు అందులో కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ నేతల తీరును విమర్శిస్తూ శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. అందులో ప్రధానంగా.. 'రాష్ట్ర అభివృద్ధికి రికార్డు స్థాయిలో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారు. ఈ పెట్టుబడులు చూసి కడుపుమంటా.? వాడండి ఈనో..!' అంటూ పేర్కొన్నారు. వాటిలోనే బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ ఫొటోలను ప్రచురించారు. గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీ, నాంపల్లి, బంజారాహిల్స్, లక్డీకపూల్, కొంపల్లి, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వెలిశాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి మాట్లాడుతూ దావోస్ పర్యటనలో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి రేవంత్‌రెడ్డి రికార్డు సృష్టించారని తెలిపారు. దీన్ని చూసి ఓర్వలేకపోతున్న బీఆర్ఎస్ నేతలు కడుపు మంట తగ్గించుకోవడానికి ఈనో ప్యాకెట్లు వాడాలని అన్నారు. ఓటమి కుంగుబాటుతో బీఆర్ఎస్ నేతలు ఆంబోతుల్లా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.



పథకాల బౌండరీ

(మొదటిపేజీ తరువాయి)



కొనసాగుతున్నందున.. ముందుగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో నాలుగు పథకాలను సంతృప్త స్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే.. ఆ గ్రామంలో నాలుగు పథకాలకు అర్హులైన లబ్ధిదారులు ఎంత మంది ఉంటే అంత మందికీ మంజూరు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 622 రెవెన్యూ మండలాలు ఉన్నాయి. వీటిలో మండలానికి ఒక గ్రామం చొప్పున 622 గ్రామాల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు అమలు కానున్నాయి. కానీ, హైదరాబాద్‌లోని మండలాలకు రైతు భరోసా, ఇందిర ఆత్మీయ భరోసా పథకాల ఆవశ్యకత లేనందున.. మిగతా జిల్లాల్లో ఉన్న 606 మండలాల్లోని 606 గ్రామాల్లో మొత్తం నాలుగు పథకాలను అమలు చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామంలో నాలుగు పథకాలను ప్రారంభిస్తారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి మంజూరు పత్రాలను అందజేస్తారు. రేషన్ కార్డులు కూడా ఇస్తారు.

రాత్రి 12 తరువాత రైతుల ఖాతాల్లోకి సొమ్ము..

నగదు బదిలీతో కూడిన రైతు భరోసా, ఇందిర ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. 26న ఆదివారం బ్యాంకులకు సెలవు ఉన్నందున.. రాత్రి 12 గంటల తర్వాత లబ్ధిదారుల ఖాతాల్లో ఈ సొమ్ము జమ అవుతుందని అధికార వర్గాలు వివరించాయి. అయితే.. రైతు భరోసా పథకం కింద సొమ్మును గతంలోని రైతుబంధు పథకం మాదిరిగానే.. ముందుగా ఎకరం భూమి ఉన్నవారికి, తర్వాత రెండెకరాల వారికి, మూడెకరాల వారికి, నాలుగెకరాల వారికి.. వరుసగా బ్యాంకు ఖాతాల్లో వేస్తారు. ఇలా కోటి 40 లక్షల ఎకరాలకు ఈ స్కీము వర్తించే అవకాశాలున్నట్లు ప్రాథమికంగా తేల్చారు. ఆత్మీయ భరోసా పథకం కింద కూడా సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. నాలుగు పథకాలకు సంబంధించి మిగతా గ్రామాల లబ్ధిదారుల సంఖ్యను తేల్చడానికి ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశం నాటికి రాష్ట్రంలోని ఈ నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితా పూర్తవుతుంది. ఈ జాబితాలను పరిశీలించి, అమలు కార్యాచరణ ప్రణాళికపై మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తారు. ఏ పథకానికి ఎప్పుడెప్పుడు ఆర్థిక సాయం అందించాలన్నదానిపై నిర్ణయం తీసుకుంటారు. ఈ ప్రక్రియను మార్చి 31లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అర్హులందరికీ 4 పథకాలు: భట్టివిక్రమార్క

అర్హులైన వారందరికీ 4 ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అర్హత కలిగిన ప్రతి చివరి వ్యక్తికీ పథకాలను వర్తింపజేయాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక, పథకాల వర్తింపు వంటి ప్రక్రియను మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. దరఖాస్తుదారుల సంఖ్య లక్షల్లో ఉండడం వల్ల మార్చి వరకు గడువు పెట్టామని తెలిపారు. కాగా, రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ప్రజాపాలన సేవా కేంద్రంల్లోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి ఉత్తమ్ చెప్పారు. సాగు యోగ్యమైన ప్రతి ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 4 పథకాలను ఈనెల 26 నుంచే రాష్ట్రమంతటా అమలు చేయాలని అనుకున్నప్పటికీ.. దరఖాస్తులు ఇంకా వస్తుండడ వల్ల మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు.

కొడంగల్ నుంచే నాలుగు పథకాలు

నేడు చంద్రవచకు సీఎం

హైదరాబాద్, మహబూబ్‌నగర్, కొడంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డు పథకాలను కొడంగల్ పరిధిలోని చంద్రవంచలో సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. ఆదివారం గణతంత్ర వేడుకలను ముగించుకొని నేరుగా చంద్రవంచకు సీఎం చేరుకుంటారు. అక్కడే ఏర్పాటు చేసిన సభలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు జారీచేయడంతో పాటు నూతన రేషన్ కార్డులను కూడా అందజేస్తారు. రైతు భరోసాతోపాటు వ్యవసాయ కూలీల కోసం తీసుకువచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను కూడా అక్కడి నుంచే ప్రారంభిస్తారు.

సీఎం షెడ్యూల్..

- గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమరవీరుల సైనిక స్మారక స్థూపం దగ్గర సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పిస్తారు.
- ఎయిర్ వార్‌ఫేర్ నుంచి బయలుదేరి అంబేడ్కర్ యూనివర్సిటీకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.
- మధ్యాహ్నం చంద్రవంచకు వెళ్లి.. అక్కడ పథకాల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగే గవర్నర్ 'ఎట్ హోం' కార్యక్రమంలో పాల్గొంటారు.

రేపట్నుంచే ప్రత్యేకాధికారుల పాలన !

- 130 మున్సిపాలిటీల పాలకవర్గాలకు నేడే ఆఖరిరోజు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీల పాలక వర్గాల గడువు ఆదివారంతో ముగియనున్న తరుణంలో సోమవారం నుంచి అవన్నీ ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. ప్రత్యేకాధికారుల నియామకానికి సంబంధించిన ఫైల్ ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేరింది. ఉత్తర్వులు కూడా సోమవారం నాటికి వెలువడే అవకాశం ఉందని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 142 మున్సిపాలిటీలుండగా, ఇటీవల అసెంబ్లీలో 12 కొత్త మున్సిపాలిటీలను ప్రభుత్వం ప్రకటించింది. వీటితో కలిపితే 154. అయితే 2020లో 130 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. వీటికి సంబంధించిన పాలక వర్గాల గడువు ఈ నెల 26తో ముగియనుంది. (ఇందులో కూడా కరీంనగర్, మేడ్చల్‌కు ఈ నెల 27 వరకు గడువు ఉంది.) వీటికి, కొత్తగా ఏర్పాటైన 12 మున్సిపాలిటీలకు కలిపి ఏప్రిల్ నాటికి ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. బీసీ కులగణనపై స్పష్టత వచ్చాక స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకునే అవకాశం ఉంది. 142 మున్సిపాలిటీలలో 130 మున్సిపాలిటీలకు 2020లో ఎన్నికలు జరగ్గా, 2021లో జీహెచ్‌ఎంసీతోపాటు గ్రేటర్ వరంగల్, ఖమ్మం, అచ్చంపేట, కొత్తూరు, నకిరేకల్, సిద్ధిపేట, జడ్చర్ల మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. మరో నాలుగు మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అందులో ఏజెన్సీ పరిధిలో ఉన్న పాల్వంచ, మణుగూరు, మందమర్రితోపాటు జహీరాబాద్ ఉన్నాయి. పాలక వర్గాల గడువు ముగియడంతో రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 13 కార్పొరేషన్లలో పదింటికి ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ, ఖమ్మం నగర పాలక సంస్థలకు 2021లో ఎన్నికలు జరిగినందున ఇవి మినహాయించి మిగిలిన 10 నగరపాలక సంస్థలకు ప్రత్యేకాధికారులుగా కలెక్టర్లను నియమించే అవకాశం ఉంది. వీటితోపాటు మున్సిపాలిటీలకు ఆర్డీవో స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించనున్నారు. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి పట్టణాల ప్రగతికి అవరోధం లేకుండా చూసే యోచనలో ప్రభుత్వం ఉంది.



పద్మశ్రీ.. మాదిగ జాతికి అంకితం

- నా సామాజిక సేవను కేంద్రం గుర్తించింది: మందకృష్ణ

సుభాష్‌నగర్ (నిజామాబాద్)/సిద్దిపేట అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డును మాదిగ జాతికి అంకితం చేస్తున్నానని మందకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి నిజామాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన 30 ఏళ్ల పోరాటంలో ప్రభుత్వాలతో కొట్లాడి ఆరోగ్యశ్రీతో పాటు వికలాంగులు, వితంతువులకు పెన్షన్లు సాధించానని చెప్పారు. తన సేవను గుర్తించి అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుకూలమే అయినా ఆయన మాలల కబంధహస్తాల్లో బంధించబడ్డారన్నారు. వర్గీకరణకు వెంకటస్వామి, మల్లు కుటుంబాలు అడ్డుపడుతున్నాయన్నారు. మాదిగలు, ఉపకులాలు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'వేల గొంతుకలు.. లక్ష డప్పులు' కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

31న ఉస్మా'నయా'కు శంకుస్థాపన

గోషామహల్ స్టేడియంలో కొత్త ఆస్పత్రి.. అధునాతన సౌకర్యాలతో నిర్మించాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం శంకుస్థాపనకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 31న శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గోషామహల్‌లోని పోలీసు స్టేడియంలో ఉస్మానియా కొత్త ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగ్గట్లుగా పూర్తి అధునాతన సౌకర్యాలతో ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించాలని సీఎం ఆకాంక్షించారు. నిర్మాణంలో ఏ విషయంలోనూ రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. ఆస్పత్రి భవన నిర్మాణాలతోపాటు బోధనా సిబ్బంది, విద్యార్థి, విద్యార్థినులకు వేర్వేరుగా నిర్మించే హాస్టల్ భవనాల విషయంలోనూ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రి భవన నిర్మాణాలు, లే అవుట్, బిల్డింగ్ డిజైన్, ల్యాండ్ స్కేపింగ్ విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆస్పత్రికి రాకపోకలు సాగించేలా నలువైపులా రహదారులు ఉండాలని, అవసరమైన చోట ఇతర మార్గాలను కలిపేలా అండర్‌పాస్‌లు నిర్మించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, పరామర్శకు వచ్చేవారి వాహనాలను నిలిపేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఉండాలన్నారు. డార్మిటరీ, ఫైర్ స్టేషన్, క్యాంటీన్, మూత్రశాలలు, ఎస్టీపీలు నిర్మించాలన్నారు. ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ నిర్మాణాలుండాలని సీఎం ఆదేశించారు. అవయవాల మార్పిడి, అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా హెలీ అంబులెన్స్‌లు వినియోగిస్తున్నందున హెలీప్యాడ్ నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించారు. ఆస్పత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉండాలని, ఆస్పత్రికి వచ్చామనే భావన ఉండకూడదన్నారు. భవన నిర్మాణాల నమూనాల్లో పలు మార్పులను సీఎం సూచించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు పాల్గొన్నారు.

నిర్మాణ బాధ్యతలు ఆర్అండ్‌బీకే?

ఉస్మానియా కొత్త ఆస్పత్రి నిర్మాణ బాధ్యతలను తొలుత ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఈడబ్ల్యూఐడీసీ)కు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కొన్ని రాజకీయ కారణాల వల్ల ఈ ప్రాజెక్టు చివరి నిమిషంలో రోడ్లు, భవనాల శాఖకు వెళ్లింది. తామే ఆ ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ఆర్అండ్‌బీ కోరినట్టు, దాంతో సర్కారు అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆస్పత్రి నిర్మాణ వ్యయ అంచనాలను ఆర్అండ్‌బీ ఇప్పటికే సిద్ధం చేసినట్లు, రూ.2,150 కోట్ల వ్యయం అవుతుందని సర్కారుకు అంచనాలను సమర్పించినట్లు తెలిసింది. కాగా, ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోతున్న 8 నూతన వైద్య కళాశాలల భవన నిర్మాణాల బాధ్యతలను ఈడబ్ల్యూఐడీసీ సర్కారు అప్పగించింది. తొలుత వీటిని కూడా ఆర్అండ్‌బీకే అప్పగించాలని నిర్ణయించినా.. చివరి నిమిషంలో కార్పొరేషన్‌కు అప్పగించాలని నిర్ణయించింది. గతంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణ బాధ్యతలను ఆర్అండ్‌బీనే చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే వాటిని సకాలంలో పూర్తిచేయకపోవడం, ఎక్కువ రేట్లు కోట్ చేయడంతో పాటు ఇతర సాంకేతిక కారణాలతో నిర్మాణ బాధ్యతల నుంచి ఆర్అండ్‌బీని తప్పించినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కొత్త మెడికల్ కాలేజీలను జోగులాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిల్లో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే జిల్లాల్లో ఈ వైద్య కళాశాలలకు సంబంధించి స్థలాల గుర్తింపు కూడా ఇంతవరకు జిల్లా కలెక్టర్లు చేయలేదని సమాచారం.

సోనియా, రాహుల్ నాయకత్వంలో..

రేవంత్ ప్రజాపాలన భేష్

నేటి నుంచీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు .. రైతు, ఇందిరమ్మ భరోసా అమలు ప్రారంభం

- వాటి అమలుకు మేం ప్రజల్లోకి వెళ్తుంటే.. ప్రతిపక్షాల నేతలకు నిద్ర పట్టట్లేదు
- ప్రజలు, అధికారుల్ని సమన్వయం చేయడంలో సీఎం, మంత్రులు సక్సెస్
- రేవంత్ పాలన చూసి కేటీఆర్, హరీశ్‌ల బుర్ర బ్లాక్ అయింది
- ప్రజల బుర్రనూ పాడు చేస్తున్నరు?: జగ్గారెడ్డి



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డులు, పేదోళ్లకు ఇందిమ్మ ఇళ్లు, రైతులకు భరోసా, భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా ఇచ్చేందుకు తాము ప్రజల్లోకి వెళుతుంటే.. ప్రతిపక్షాలకు నిద్ర పట్టట్లేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను బద్నాం చేసే పనిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పడ్డాయని ఆరోపించారు. సోనియా, రాహుల్ గాంధీల నాయకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన బాగా నడుస్తోందని కితాబునిచ్చారు. పథకాల అమలుకు నిధులు సమకూర్చుకుంటూ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోతోందన్నారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రజలు, అధికారులను సమన్వయం చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు సక్సెస్ అయ్యారని చెప్పారు. 'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సచివాలయానికి ప్రజలు వెళ్లారా? జర్నలిస్టులకు కూడా అనుమతి లేదు. కానీ మా పాలనలో మంత్రుల చాంబర్లన్నీ రాత్రి 12 గంటల దాకా కిటకిటలాడుతున్నాయ'న్నారు. హామీలు అమలు చేయండంటారు.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలుచేస్తే సీట్లు దొరకట్లేదంటూ మళ్లీ ఆరోపిస్తున్నారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటి వరకు కోటి మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని చెప్పారు. 'పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన గ్రామసభలకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎందుకు పోలేదు?' అంటూ నిలదీశారు. 'సీఎం రేవంత్ ప్రజా పాలన చూసి కేటీఆర్, హరీశ్ రావులకు కళ్లు మండుతున్నయి. వారి బుర్రలు పాడై పోయినయి. బుర్రలు ఖరాబు అయి ఉన్న కేటీఆర్, హరీశ్ రావులు.. మంది బుర్రలు ఎందుకు పాడు చేస్తున్నరు?" అని అన్నారు.

సంజయ్.. తెలంగాణ ప్రజల్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నవా?

బండి సంజయ్.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఏం మాట్లాడినా చెల్లిందని, కేంద్ర మంత్రిగా ఎలా మాట్లాడాలన్నది నేర్చుకుంటే ఆయనకు మంచిదని జగ్గారెడి అన్నారు. రాజకీయ అనుభవం లేకున్నా మంత్రి పదవి రావడంతో ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియట్లేదని విమర్శించారు. "ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్లకు డబ్బులు ఇయ్యవా? నిధులు ఇవ్వనని చెప్పి తెలంగాణ ప్రజల్నే బ్లాక్ మెయిల్ చేస్తున్నవా? డబ్బులు ఏమైనా సీఎం రేవంత్ ఇంటికి పంపుతున్నవా? కేంద్రానికి నిధులు వస్తున్నదీ.. ప్రజలు కడుతున్న పన్నులతోనే అన్నది మర్చిపోకు" అంటూ సంజయ్‌పై ధ్వజమెత్తారు. రాజకీయంగా సీఎం రేవంత్‌తో కొట్లాడొచ్చునని, అంతేకానీ కేంద్ర మంత్రి అయుండీ తెలంగాణ ప్రజల్ని బ్లాక్ మెయిల్ ఎలా చేస్తారని నిలదీశారు. బండి సంజయ్ మాటలను కిషన్‌రెడ్డి సమర్థిస్తున్నారా అంటూ ప్రశ్నించారు.

పేదలను గుర్తుంచుకుని నిర్ణయాలు

మన్మోహన్ సింగ్ సలహా ఎప్పటికీ ఆచరణీయమే

- సంస్కరణల వెనక ఐఎంఎఫ్ ఒత్తిడి లేదు
- పరిపాలనా సంస్కరణలు కూడా రావాలి
- ఎన్టీఆర్ హయాంలో చాలా నేర్చుకున్నాను
- హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు
- 'జస్ట్ ఏ మెర్సినరీ' పుస్తకంపై సంభాషణ



హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలను గుర్తుంచుకుని నిర్ణయాలు తీసుకోవాలనే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సలహా ఎప్పటికీ ఆచరణీయమని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. తాను ఆర్బీఐ గవర్నర్‌గా వెళ్లే ముందు మన్మోహన్ ఈ సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో పనిచేయడం జీవితపాఠాలు నేర్పిందని దువ్వూరి చెప్పారు. హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో తాను రచించిన 'జస్ట్ ఏ మెర్సినరీ? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరీర్' పుస్తకం గురించి మాట్లాడటానికి ఆయన వచ్చారు. రచయిత సుచిత్ర షెనాయ్‌తో జరిపిన సంభాషణలో పలు అంశాలపై మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

'జస్ట్ ఏ మెర్సినరీ' అనే పేరు ఎందుకంటే..

మనం మన దేశం గురించి ఎన్నో ఫిర్యాదులు చేస్తుంటాం. సమానత్వం లేదని, పేద-ధనిక తేడాలని.. ఇలా ఎన్నో! అందుకు నేనూ మినహాయింపు కాదు. కానీ, నా జీవితం, కెరీర్‌ను ఓసారి తరచి చూస్తే ఈ దేశం తనకు ఎంతో ఇచ్చిందని తెలుసుకున్నాను. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో సైనిక్ స్కూల్‌లో, తరువాత ఐఐటీలో చదివాను. కలెక్టర్‌గా తొలి ఉద్యోగం చేశాను. తరువాత ఆర్థిక శాఖ కార్యదర్శిగా, ఆర్‌బీఐ గవర్నర్ పనిచేశాను. ప్రతిచోటా ప్రభుత్వం తనకు అవకాశం ఇచ్చింది. తన విధులను సాధ్యమైనంత మేర సక్రమంగానే నిర్వర్తించాను. అయితే సమాజానికి తాను తిరిగి సక్రమంగా ఇవ్వగలిగానా అనేది నన్ను ఇప్పటికీ వేధిస్తున్న ప్రశ్న. అందుకే ఈ పుస్తకానికి 'జస్ట్ ఏ మెర్సినరీ' అనే పేరు పెట్టాను. మన్మోహన్ సింగ్‌కు ఫైనాన్స్ సెక్రటరీగా కొన్నాళ్లు పనిచేశాను. అంతకు ముందు 1991లో ఆర్థిక సంసంస్కరణల వేళ కూడా ఆయనతో ఉన్నాను. ఆ తరువాత ఆర్‌బీఐ గవర్నర్‌గా ఆయన హయాంలోనే నియమితుడయ్యాను. ఆయనకు ధన్యవాదాలు చెప్పడానికి వెళ్లినప్పుడు, 'గతంలో మీరు ఆర్‌బీఐ గవర్నర్‌గా చేశారు. ఆ అనుభవంతో నాకేమైనా సలహా ఇస్తారా' అని అడిగాను. దానికి ఆయన.. 'మీరు ప్రభుత్వంలో 35 సంవత్సరాలు పనిచేశారు. కాబట్టి వాస్తవ పరిస్థితులు ఏమిటో తెలుసు. ఆర్‌బీఐలో కూడా మీకు ఎలా అనిపిస్తే అలానే చేయండి. కానీ ఆర్‌బీఐ విభిన్న ప్రపంచం, సంస్థ. మీరు అక్కడ ఎప్పుడూ వడ్డీ రేటు, ద్రవ్యోల్బణం, నగదు సరఫరా లాంటి మాటలే వింటారు. కానీ వాటి వెనుక ఉన్న ప్రజలను మరిచిపోతారు. కాబట్టి పేద ప్రజలను గుర్తుంచుకుని మీ నిర్ణయాలు తీసుకోండ'ని సూచించారు. ఐఏఎస్‌గా నా 35 ఏళ్ల కెరీర్‌లో ఎన్టీఆర్ హయాంలో పనిచేయడం మరిచిపోలేని అనుభవం. 250 మంది ఐఏఎస్ అధికారులు ఉంటే నన్ను ఎంపిక చేసి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

ఐఎంఎఫ్ ఒత్తిడిఉందనడం తప్పు

1991లో ఆర్థిక సంస్కరణలను అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐఎంఎఫ్) ఒత్తిడితో తీసుకున్నారని చాలామంది విమర్శించారు. అది తప్పు. అన్ని రంగాల్లో.. ముఖ్యంగా పరిపాలనా సంస్కరణలు అవసరం. ఐఏఎస్ అధికారులు రాజకీయ నాయకులను అర్థం చేసుకోవాలి. 'చాలా చేద్దామనుకున్నాను. రాజకీయ నాయకులు చేయనీయడం లేద'ని ఎవరైనా అంటే ఆ కథలు నమ్మవద్దు. రాజకీయ నాయకులది మాత్రమే తప్పు కాదు. నేను మండలస్థాయి అధికారుల నుంచి ప్రధాని వరకూ కలిసి పనిచేశాను.

నిశ్శబ్దమే అసలు సమస్య!

- మహిళల ఆరోగ్యంపై చర్చించాలి
- హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో వక్తలు
- వాతావరణ మార్పులతోనే పలు వ్యాధులు: సౌమ్య స్వామినాథన్



హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో మహిళల ఆరోగ్య పరంగా ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య నిశ్శబ్దమేనని హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. తమ ఆరోగ్య సమస్యల గురించి మహిళలు బయటకు వెల్లడించరని, అదే సమస్యగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'బియాండ్ పీరియడ్స్ అండ్ ప్రెగ్నెన్సీ ఫర్ ఉమెన్స్ హెల్త్' అనే అంశంపై శనివారం జరిగిన చర్చలో ఢిల్లీలోని పాపులేషన్ కౌన్సిల్ ఇనిస్టిట్యూట్‌లో సీనియర్ ఫెలోగా ఉన్న సప్న దేశాయ్, గైనకాలజిస్ట్ అర్చనా సత్వాల్కర్ పాల్గొన్నారు. గర్భాశయ సమస్యలు అయిన ఎండోమెట్రియోసిస్ లాంటి వాటి గురించి చాలామందికి తెలియదని, వాటి పట్ల మహిళలకు అవగాహన కల్పించాలని సప్న తెలిపారు. అర్చన మాట్లాడుతూ.. అమ్మాయి రజస్వల అయినప్పుడు పెద్ద ఫంక్షన్ చేస్తారు కానీ, ఆ తరువాత నెలసరి గురించి మాట్లాడటమే తప్పన్నట్లు మాట్లాడతారని, అది ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. సంభోగ సమయంలో నొప్పి అని చెబుతున్నవారు వారు కూడా ఎక్కువగానే ఉంటున్నారని, నవ వధువుకు అలానే ఉంటుందని పెద్దవారు దీనిని తేలిగ్గా చేసి చెబుతారని, కానీ, దాంట్లో పూర్తి వాస్తవం లేదన్నారు. సెక్స్ అనేది ఆహ్లాదంగా ఉండాలి తప్ప నొప్పితో బాధపడేలా ఉండకూడదన్నారు. గర్భనిరోధకాల గురించి కూడా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'పాలసీ పర్‌స్పెక్టివ్స్ అండ్ ద ప్లానెట్' అనే అంశంపై జరిగిన చర్చలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సౌమ్య స్వామినాథన్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల వల్లనే టీబీ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. అభివృద్ధి కార్యకలాపాలు భూగోళానికి నష్టం కలిగించవద్దని సూచించారు. ప్రజారవాణాను బాగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

భువనగిరిలో ఆర్ఆర్ఆర్ నిర్వాసితుల ధర్నా

- హైవేపై రాస్తారోకో, కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే యత్నం
- పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత

భువనగిరి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసిత రైతులు శనివారం నిర్వహించిన మహాధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. నిర్వాసితులకు మద్దతుగా బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొనడంతో సుమారు నాలుగు గంటల పాటు హైటెన్షన్ నెలకొంది. భూమికి భూమి ఇవ్వాలని, లేదంటే మార్కెట్ ధర చెల్లించాలని, దక్షిణ భాగంలో అలైన్‌మెంట్ మార్చాలనే డిమాండ్‌తో ఆర్ఆర్ఆర్ నిర్వాసిత రైతులు శనివారం యాదాద్రి కలెక్టరేట్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. కాగా, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో రైతులకు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించిన లక్ష్మణ్, శేఖర్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో పార్టీల కార్యకర్తలు, రైతులు దూసుకుపోయేందుకు ప్రయత్నించారు. చివరకు పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్‌ను పోలీసులు కలెక్టరేట్‌లోకి అనుమతించారు. అరగంట ముందే కలెక్టరేట్‌లోకి వెళ్లిన ఎంపీ లక్ష్మణ్.. కలెక్టర్ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు ఆందోళన విరమించారు.

మండలి ఎన్నికల్లో బీసీలకు అవకాశమివ్వాలి

- విస్తృతస్థాయి సమావేశంలో బీసీ సంఘాల ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాసనమండలి ఖాళీ స్థానాల భర్తీకి జరిగే ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని బీసీ మేధావులు, బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీలను కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం 'శాసనమండలి ఎన్నికలు- బీసీల పాత్ర' అనే అంశంపై హైదరాబాద్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి బీసీలపైన చిత్తశుద్ధి ఉంటే బీసీ కులగణనతో శాసనమండలి ఎన్నికల్లో అభ్యర్థులను రంగంలోకి దింపాలని అన్నారు.

నీటిపారుదలశాఖలో పదోన్నతులకు రంగం సిద్ధం

- సీనియారిటీ జాబితాను పంపాలని ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలో భారీగా పదోన్నతులకు రంగం సిద్ధమయింది. చీఫ్ ఇంజనీర్ (సీఈ) నుంచి ఈఎన్‌సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్)లుగా పదోన్నతి కల్పించే ఫైలు శనివారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి వద్దకు చేరగా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ)ల పదోన్నతుల ఫైలు సాధారణ పరిపాలనశాఖకు చేరింది. ఇక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)లుగా పదోన్నతి కల్పించడానికి వీలుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ర్యాంకులు, మార్కుల ఆధారంగా సమీకృత సీనియారిటీ లిస్టును పంపాలని నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఈఎన్‌సీకి ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజులోసీనియారిటీ జాబితాను ప్రభుత్వానికి పంపించే అవకాశాలున్నాయి.

యూపీఎస్‌తో ఉద్యోగులకు అన్యాయం

- ఎన్ఎంఓపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఏకీకృత పెన్షన్ పథకం(యూపీఎస్) గెజిట్‌ను శనివారం విడుదల చేశారు. ఈ పథకం కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. అయితే, ఈ పథకం కింద కేంద్రప్రభుత్వం ఉద్యోగుల నుంచి వాటాను వసూలు చేసి పెన్షన్‌ను ఇవ్వాలనుకుంటోందని, ఈ తీరును వ్యతిరేకిస్తున్నామని పాత పెన్షన్ విధానం అమలు కోసం జాతీయ స్థాయిలో ఉద్యమించడానికి ఏర్పాటైన 'ఎన్ఎంఓపీఎస్' సంఘం ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ తెలిపారు. అంతే కాకుండా, ఇప్పటివరకు ఉన్న ఎన్‌పీఎస్ విధానం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వాటా రూపంలో రూ.10.5లక్షల కోట్లను ఎన్‌పీఎస్ ట్రస్టుకు జమ చేశాయని, ఈ నిధులు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కూలి పనులు

- ముగ్గురు టీచర్ల సస్పెన్షన్.. కార్మికశాఖ షోకాజ్ నోటీసులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ఏబీహెచ్‌బీ కాలనీ-2 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కూలి పనులు చేయించిన ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. విద్యార్థులతో ఇటుకలు, కంకరరాళ్లు, ఇతరత్ర సామగ్రి మోయిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం జరగ్గా స్పందించిన కలెక్టర్ ఆ పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులు మంజుల, శారద, నాగమణిని సస్పెండ్ చేశారు. బడి పిల్లలతో పని చేయించడాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్.. కార్మికశాఖ అధికారులతో విచారణకు ఆదేశించారు. వారు పాఠశాలకు చేరుకుని విచారించి ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కొట్టకపోతే ముద్దు పెట్టుకుంటామా!

- అహంకారంగా ఉపాధ్యాయుడి సమాధానం.. సస్పెన్షన్

బల్మూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల కోసం కొందరు విద్యార్థులకు నృత్యం నేర్పుతుండగా.. అటుగా నవ్వుకుంటూ వస్తున్న ఇద్దరు విద్యార్థినులు తనను చూసే నవ్వుతున్నారని భావించిన ఓ ఉపాధ్యాయుడు వారిపైకి చెప్పు విసరడమే కాకుండా విపరీతంగా కొట్టాడు. మరుసటి రోజు వారి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి అదేమిటని అతణ్ని ప్రశ్నించగా 'కొట్టకపోతే ముద్దు పెట్టుకుంటామా' అంటూ అహంకారంగా సమాధానం చెప్పడంతో వారు ఆగ్రహించి ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన శనివారం నాగర్‌కర్నూలు జిల్లా బల్మూరు మండలం కొండనాగుల ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఈ ఘటనపై వివరణ కోరగా గతంలోనే ఇలాంటి ఘటనలు తమ దృష్టికి వచ్చాయని, తమ సిబ్బందితో కలిసి ఉపాధ్యాయుడికి పలుమార్లు సూచనలు చేసినా ఆయన తీరు మారలేదని చెప్పారు. కాగా, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లాకు చెందిన కందునూరి వెంకటేశ్ అరుదైన చిత్రాన్ని ఆవిష్కరించారు. 15 రోజులు కష్టపడి కాన్వాస్ పెయింటింగ్‌ను చిత్రీకరించారు. దీనిని ప్రధాని మోదీకి అందజేయనున్నట్లు వెంకటేశ్ తెలిపారు.

ఎవర్ని వివాహమాడాలో కూడా రాజ్యమే నిర్ణయిస్తుంది

- రాజ్యాంగ విలువలను చాటి చెప్పడంలో విఫలమయ్యాం
- ప్రముఖ సామాజిక వేత్త అరుణారాయ్ వ్యాఖ్య



హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలను తెలియజేయడంలో విద్యాలయాలు, ఉద్యమాలు, ప్రభుత్వ వ్యవస్థలు విఫలమయ్యాయని ప్రఖ్యాత సామాజిక వేత్త అరుణారాయ్ వ్యాఖ్యానించారు. మనకు హక్కులు రాజ్యాంగం నుంచి వచ్చాయన్న విషయాన్ని విస్మరిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల జీవితంలో వ్యక్తిగతం అంటూ ఏమీ లేదని, అంతా రాజకీయమే అన్నారు. మహిళలు ఎవరిని వివాహమాడాలో కూడా రాజ్యమే నిర్ణయిస్తుందని విమర్శించారు. హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో భాగంగా శనివారం సత్వా నాలెడ్జ్‌సిటీ వేదికగా అరుణా రాయ్ రచించిన 'ది పర్సనల్ ఈజ్ పొలిటికల్-యాన్ యాక్టివిస్ట్ మెమోయిర్' పుస్తకంపై సీ రామ్మోహన్‌రెడ్డి సమన్వయంలో ఆమెతో చర్చా గోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా, అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన ఆలోచనలు ప్రబలుతోన్న ప్రస్తుత సమయంలో పౌరులంతా సమష్టిగా రాజ్యాంగ పరిరక్షణను భుజానికెత్తుకోవాలి అని పిలుపునిచ్చారు. దేశంలో మత అసహనం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వ రాజకీయాలను ఎదుర్కోడానికి మహాత్మాగాంధీ ప్రబోధించిన 'ఈశ్వర్ అల్లా తేరేనామ్...' గీతమే శరణ్యమని సూచించారు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి సమావేశాలకు ముందు ఆ పాటను సామూహికంగా ఆలపించాలన్నారు. కరుణ, శాంతి ద్వారా ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్షోభాలను పరిష్కరించగలిగిన శక్తి స్త్రీవాదానికి ఉందన్నారు. అయితే ఫెమినిజం దురదృష్టవశాత్తూ లైంగికత విషయాల చట్రంలో చిక్కుకుపోవడం బాధాకరమన్నారు.

ఈవీఎంలలో కాదు.. లోపమంతా వ్యవస్థలోనే!

- ఇప్పుడు గాంధీ పోటీచేసినా డిపాజిట్లు రావు
- ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్



హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాజకీయ పార్టీ ప్రజాస్వామ్యయుతంగా నడవడం లేదని, వ్యక్తులు లేదా కుటుంబాల కనుసన్నలలో ఉన్నాయని ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ వ్యాఖ్యానించారు. ధన ప్రభావం, కండబలం, వాట్సాప్ యూనివర్సిటీ దుష్ప్రచారాల మధ్య ఎన్నికల ప్రక్రియ సాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మహాత్మాగాంధీ పోటీచేసినా గెలవడం కష్టమని, డిపాజిట్లు కూడా రాకపోవచ్చన్నారు. లోపం ఈవీఎంలలో లేదని, మన వ్యవస్థల్లోనే ఉందన్నారు. హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో సునీతారెడ్డి సమన్వయంలో రాజ్‌దీప్ సర్దేశాయ్ రాసిన '2024 : ది ఎలక్షన్ దట్ సర్‌ప్రైజ్డ్ ఇండియా' పుస్తకంపై సంభాషణ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై ఈడీ, సీబీఐ లాంటి సంస్థలతో బెదిరించడం, అక్రమ కేసులు పెట్టడం పరిపాటి అయిందని విమర్శించారు. 'తెలంగాణలోని ఒక ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసినప్పుడు ఎన్నికలకు రూ.75 కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఎంతమంది యువత అంత డబ్బు వెచ్చించి, రాజకీయాల్లోకి రాగలర'ని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను వీకెండ్ పార్టీగా అభివర్ణిస్తూ.. ఎన్నికల్లో గెలవడానికి వ్యూహాలు అవసరమని, అవి రాహుల్‌లో కనిపించడం లేదన్నారు. రాజకీయంగా ఉత్తరాది ప్రాబల్యం కొనసాగిస్తున్నా, ఆర్థికంగా దక్షిణాది బలంగా ఉందని, కనుక దేశ రాజకీయాలను దక్షిణాది రాష్ట్రాలు శాసించే రోజులు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు.

ఏడాదిలోనే బ్యారేజీలో సమస్యలా..?

- 45 ఏళ్లయినా మన్నికగా ఉండాలి కదా
- నాణ్యతా ప్రమాణాలు పాటించరా?
- అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థకు కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): "ఒక బ్యారేజీ వందేళ్ల పాటు నిలిచి ఉండాలి. కనీసం 45 ఏళ్లయినా మన్నికగా ఉండాలి. ఏడాదిలోనే లోపాలు ఎందుకు బయటపడినట్లు..? జాతీయ స్థాయిలో పేరున్న నిర్మాణ సంస్థకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలనే బాధ్యత లేదా..? అగ్రిమెంట్‌లో లోపాలున్నప్పుడు ప్రారంభ దశలోనే ఎందుకు ప్రశ్నించకపోయారు..?" అని అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థను కాళేశ్వరం కమిషన్ నిలదీసింది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణలో భాగంగా శనివారం అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హైడ్రో వ్యాపార విభాగాధిపతి నాగ మల్లికార్జున్‌రావుతో పాటు జనరల్ మేనేజర్ (సివిల్ నిర్మాణాల విభాగం) శేఖర్ దాస్‌ను కమిషన్ ప్రశ్నించింది. ఈపీసీ విధానంలో పనులు దక్కించుకుంటే.. భూమి సర్వే పరీక్షలు, డిజైన్/డ్రాయింగ్‌లను సిద్ధం చేయడంతో పాటు నిర్మాణ బాధ్యతలు ఉంటాయని.. అన్నారం బ్యారేజీ పనులను ఐటెమ్ రేట్ కాంట్రాక్ట్(కాంపోనెంట్ల వారీగా పనులు చేయడం) వల్ల పరీక్షలు, డిజైన్/డ్రాయింగ్‌లు చేయలేకపోయామని మల్లికార్జున్‌రావు తెలిపారు. ఒప్పందం చేసుకున్నాక ప్రతిపాదిత నిర్మాణ ప్రదేశం కన్నా 2.2 కి.మీ దిగువన స్థలాన్ని ఎంపిక చేశారని చెప్పారు. అటవీ భూముల ముంపును తగ్గించడం, మేడిగడ్డ-అన్నారం మధ్య గ్రావిటీ కాల్వ పొడవును తగ్గించడం వంటి కారణాలతో పని ఆలస్యమయిందని వెల్లడించారు. 'నిర్మాణ ఒప్పందంలో బ్యారేజీ నిర్మాణంలో షీట్‌పైల్స్ వాడాలని ఉంటే.. సీకెంట్ పైల్స్ వినియోగించారా..?' అని కమిషన్ ప్రశ్నించగా.. అవునని బదులిచ్చారు. వరదల సమయంలో కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురయ్యాయా..? అని కమిషన్ ప్రశ్నించింది. 2019 అక్టోబరు, నవంబరులో వరద రావడంతో దిగువ భాగంలో సీసీ బ్లాకులన్నీ చెల్లాచెదురయ్యాయని చెప్పారు. ఆ తర్వాత బ్లాకులన్నీ సరిచేశామని, 2020 వరదలకు మళ్లీ అదే పరిస్థితి నెలకొందని తెలిపారు. దాంతో నిపుణులను పిలిపించి అధ్యయనం చేయించామని.. సమస్య పరిష్కారానికి స్టిల్లింగ్ బేస్‌ను విస్తరించాలని నివేదికలు చెప్పాయని తెలిపారు. అయితే నివేదికలు అందించినా.. ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని అన్నారు. 2020 వరదల సమయంలోనే సీపేజీని గుర్తించామని, ఢిల్లీ నుంచి నిపుణులను రప్పించి గ్రౌటింగ్ చేయించామని పేర్కొన్నారు. కాగా, విచారణలో పొంతనలేని సమాధానాలు ఇచ్చిన వారిని మళ్లీ పిలవాలని కమిషన్ నిర్ణయించింది. అయితే అందరినీ పిలిచాక చివరగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను పిలిచే అవకాశాలున్నాయని సమాచారం. ఈ నెల 27న విద్యుత్ జేఏసీ నేత కంచర్ల రఘు, రిటైర్డ్ ఇంజనీర్ దొంతుల లక్ష్మీనారాయణ అభిప్రాయాలను కమిషన్ తెలుసుకోనుంది.

ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థకు ఏసీబీ నోటీసు

- 4 వారాలు గడువు ఇవ్వాలని కోరిన ఎఫ్ఈవో... మరో సారి కేటీఆర్ విచారణ

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ రేసు కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారులు ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సీఈవోకు నోటీసు జారీ చేశారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థకు హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.45.71కోట్ల బదిలీకి సంబంధించిన వివరాలు, తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాల పత్రాలు తీసుకుని రావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఈ మేరకు గత నెల 16వ తేదీనే నోటీసు జారీ కాగా.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే, విచారణకు హాజరు కావడానికి నాలుగు వారాల గడువు కావాలని ఎఫ్ఈవో మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఏసీబీ ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని సమాచారం. మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే నిధుల బదిలీ జరిగిందని అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి చెప్పిన నేపథ్యంలో ఎఫ్ఈవోకు ఏసీబీ నోటీసు జారీ చేయడం గమనార్హం. మరోవైపు.. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు ఆధారంగా కేటీఆర్‌ను మళ్లీ విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఏస్ నెక్ట్స్ జెన్ సీఈవో చలమలశెట్టి అనిల్ చెప్పిన అంశాల ఆధారంగా కేటీఆర్‌ను ప్రశ్నించనున్నట్లు సమాచారం.

హెక్సా బ్లేడ్‌తో తల వేరు చేసి.. మొండాన్ని మూడు ముక్కలుగా కోసి..

- ఎముకలను స్టవ్ మీద కాల్చిన కిరాతకుడు
- మీర్‌పేట హత్య కేసులో దిగ్భ్రాంతికర విషయాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన మీర్‌పేట మహిళ హత్య కేసు మిస్టరీని ఛేదించిన రాచకొండ పోలీసులకు విచారణలో ఒళ్లు గగుర్పొడిచే విషయాలు తెలిసినట్లు సమాచారం. నిందితుడు గురుమూర్తే తన భార్య వెంకట మాధవిని హత్య చేసి, శవాన్ని మాయం చేసేందుకు హెక్సా బ్లేడ్‌తో తల నుంచి మొండెం వేరు చేసి, మొండెం నుంచి కాళ్ల వరకు శరీరాన్ని మూడు ముక్కలుగా కోశాడని విచారణలో తేలినట్లు విశ్వసనీయంగా తెలిసింది. శరీర భాగాల మాంసాన్ని ఒలిచి బకెట్‌లో వేసి నీళ్లు పోసి పలు విడతలుగా హీటర్‌తో వేడి చేసి ముద్దగా మార్చినట్లు, చర్మం ఒలిచిన తర్వాత ఎముకలు, కాళ్లను స్టవ్‌పై కాల్చి గునపం లాంటి దానితో ఎముకలను చిన్న చిన్న ముక్కలుగా విరగ్గొట్టినట్లు విచారణలో గురుమూర్తి ఒప్పుకున్నట్లు తెలిసింది. మాంసం ముద్దలను, ఎముకలను బకెట్‌లో వేసుకొని మీర్‌పేట పెద్ద చెరువులో పారేసినట్లు వెల్లడించినట్లు సమాచారం. ఆధారాలు దొరకకూడదని నిందితుడు ప్రయత్నించడంతో రాచకొండ పోలీసులు లోతుగా విచారణ జరిపారు. 'బ్లూరేస్ టెక్నాలజీ'తో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షించి.. గురుమూర్తే హంతకుడిగా నిర్ధారించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.